




www.andhrajyothy.com

ధర (Price) : Rs. 6.50

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 234








సోమవారం | 9-12-2019 | పేజీలు: 12 + 16

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ. 9.55 తదుపరి త్రయోదశి; నక్షత్రం: భరణి తె. 5.01 తదుపరి కృత్తిక; వర్జ్యం: మ. 1.43-3.25; దుర్ముహూర్తం: మ. 12.30-1.14, మ. 2.42-3.26; అమృతఘడియలు: రా. 11.55-1.37; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 5.38

విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


# బతుకులు బుగ్గి



కన్నీరే మిగిలింది



ప్రమాదం జరిగిన అనధికార ఫ్యాక్టరీ లోపలి దృశ్యం

## ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం

## 43 మంది కార్మికుల మృతి

- 'షార్ట్ సర్క్యూట్' కారణం
- దట్టంగా పొగ, మంటలు
- ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి
- అందరూ వలస కార్మికులే
- 20 ఏళ్లలోపు వారే అధికం
- ఇరుకు గల్లీల్లో అనధికార కర్మాగారంలో ఘోరం

కాసేపట్లో ఎప్పట్లాగానే కళ్లు నులుముకుంటూ... నిద్రలేవాల్సిన వాళ్లు! కానీ... కళ్ల మంటలెక్కించే పొగలో, మంటల్లో చిక్కుకుపోయారు! బయటికి వెళ్లే దారి లేక, ఉన్నా కానరాక... ఉక్కిరిబిక్కిరై ఊపిరివదిలేశారు. ఒకరూ ఇద్దరూ కాదు... ఏకంగా 43 మంది ప్రాణాలు కోల్పోయారు. 21 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో అత్యధికుల పరిస్థితి విషమంగా ఉంది. ఉత్తర ఢిల్లీలోని ఇరుకుఇరుకు సందుల ప్రాంతమైన అనాజ్ మండీలో, రాణీ ఝాన్సీ రోడ్‌లో జరిగిన ఘోరమిది! బాధితులంతా కార్మికులే!



క్షతగాత్రుడిని మోసుకు వస్తున్న ఫైర్ సిబ్బంది

### రాజకీయ మంటలు

- కేజ్రీవాల్ సర్కారుదే బాధ్యత: బీజేపీ
- కాదు.. మీ మున్సిపాలిటీదే: ఆప్
- ఇద్దరి నిర్లక్ష్యమే కారణం: కాంగ్రెస్

న్యూఢిల్లీ, డిసెంబరు 8: అది నాలుగు అంతస్తులున్న భవంతి. అందులో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, టోపీలు, ఇతర వస్తువులను తయారు చేసే ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో రెండో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు మొదలయ్యాయి. చూస్తుండగానే పైపైకి వ్యాపించాయి. ఆ సమయంలో మొత్తం భవంతిలో 65 మందికిపైగా కార్మికులు ఉన్నారు. ఎక్కువమంది గాఢంగా నిద్రపోతున్నారు. మంటలు, పొగ తమను కమ్ముకోవడంతో ఉలిక్కిపడి లేచారు. బయటపడే మార్గం కోసం అన్వేషించారు. కానీ... అప్పటికే ప్లాస్టిక్

మిగతా 10వ పేజీలో...

# సభకు సై





## విపక్షం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీద్దాం!

- పూర్తి ఆధిపత్యం చాటుదాం
- 6 నెలల పాలనపై సభలో ప్రస్తావన
- రోజుకో నవరత్నంపై చర్చ
- సంక్షేమ పథకాలపైనే ఫోకస్
- ముఖ్యమంత్రి జగన్ మనోగతం
- తొలిరోజు మహిళా రక్షణపై చర్చ
- సభ నడిచేది 9 రోజులా.. వారమా?

నేటి నుంచే అసెంబ్లీ

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శాసన సభ శీతాకాల సమావేశాల్లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు అధికార పక్షం సమాయత్తమైంది. ప్రతిపక్ష టీడీపీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడంపై దృష్టి సారించింది. బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షం నుంచి దీటైన ప్రతిఘటన ఎదురైంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి మొదలవుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వ్యూహాత్మకంగా టీడీపీపై దాడిచేయాలని వైసీపీ భావిస్తోంది. సమావేశాలను తొమ్మిది రోజుల పాటు

మిగతా 9వ పేజీలో...

## ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- 21 అంశాలపై రోజుకో నిరసన
- తొలి రోజు ఉల్లి, నిత్యావసర ధరలు
- అసెంబ్లీ ఆవరణ నుంచి పాదయాత్ర
- రైతు సమస్యలు, కార్మికుల ఆత్మహత్యలు..
- ఆర్థిక సంక్షోభం, పథకాల కోతపై పట్టు
- 15 రోజులు సభ జరపాలని డిమాండ్
- టీడీపీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

## సీఎం ఫొటో చాలు!

- ప్రభుత్వ ప్రచారంలో జగన్ చిత్రం ఒక్కటే ఉండాలి
- ఫ్లెక్సీ, పోస్టర్, కరపత్రాల్లో కూడా అంతే
- ఆయన పక్కన మరొకరి చిత్రం ఉండకూడదు
- జిల్లా కలెక్టర్లకు సీఎంవో నిర్దేశం

3

# రంగు పోతుందా?



కృష్ణా కరకట్ట రహదారిపై విద్యుత్ స్తంభాలకు వైసీపీ రంగులు

- సచివాలయాలు, ట్యాంకులకు వైసీపీ కలర్స్
- స్థానిక ఎన్నికల కోడ్ వస్తే ఏం చేయాలి?
- గ్రామ పంచాయతీలపై పెను భారం
- జనవరి నుంచి 'స్థానిక' సమరం మొదలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇప్పుడంతా రంగుల రాజకీయం! తెలుగుదేశం హయాంలో అక్కడక్కడా, స్థానిక నేతల అత్యుత్సాహంతో వాటర్ ట్యాంకులు, ఆధునీకరించిన శ్మశానాల ప్రహరీలకు పసుపు రంగు పులిమేశారు. వైసీపీ వచ్చాక గ్రామ సచివాలయాలకు తమ పార్టీ పతాకంలోని రంగులైన ఆకుపచ్చ, తెలుపు, నీలం రంగులు వేయాలంటూ ఏకంగా అధికారిక ఉత్తర్వులే ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రాన్ని కూడా ప్రదర్శించాలన్నారు. రంగుల ఖర్చు, ఇతర లెక్కల సంగతి అటుంచితే... స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే పరిస్థితి ఏమిటని అధికారులు తలలు బద్దలు

మిగతా 9వ పేజీలో...






## లిఫ్ట్ అడిగిన బాలికపై గ్యాంగ్‌రేప్

- తిరుచానూరు బ్రహ్మోత్సవాల వేళ దారుణం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- 'ప్రకాశం'లో ప్రేమ పేరుతో నయవంచన
- యువతిని గర్భవతిని చేసి ప్రియుడు పరార్



2




1387.2019



పరంజ్యోతి

# విధి అనుల్లంఘనీయము



*సుమహాంత్యపి భూతాని దేవాశ్చ పురుషర్షభ*
*నదైవస్య ప్రముంచంతి సర్వభూతాది దేహినః*

శ్రీరామచంద్రుని దుఃఖాతిశయాన్ని ఓదార్చే సందర్భంలో లక్ష్మణ స్వామి పలికిన మాటలివి. "ఓ పురుష శ్రేష్ఠుడవైన శ్రీరామా! పంచమహాభూతాలైనా, సకల దేవతాగణమైనా, దేహం కలిగి ఉన్న ప్రాణులెవరైనా.. విధి నిర్ణయాన్ని అతిక్రమించడం అంత సులభం కాదు" అని దీని అర్థం. దుఃఖం మానవ జీవితంలో ఒక భాగం. ఆపదలు రావడం సహజం. అనివార్యమైన కొన్ని బాధలను మనిషి అధిగమించడానికి చల్లని ఓదార్పు అవసరం. ఆ ఓదార్చే వ్యక్తులు ఎదుటివారి దుఃఖాన్నీ, బాధను తక్కువ చేసే యత్నంలో పలు విధాలైన పలుకులు వినిపిస్తుంటారు. ఎదుటి వ్యక్తి బాధను అధిగమించే మానసిక ధైర్యాన్ని కలిగించే మాటలు మాట్లాడుతుంటారు. అవి తర్కానికి నిలబడుతాయా, అవన్నీ నిజాలేనా?, నమ్మదగినవేనా? అనే విచికిత్సకు తావు లేదు. దుఃఖ భారాన్ని తగ్గించి ఎదుటి మనిషిని సామాన్య స్థితిలోకి తీసుకురావడమే ఆ మాటల ప్రధాన ధ్యేయం. సీతాపహరణ కారణంగా అమిత వేదనను పొందుతున్న రాముని మానసిక స్థితి దుస్సహమైనది. ఆ సమయంలో ప్రతివ్యక్తికీ తన దుఃఖానికి కారణమైనవారిపై అంతులేని క్రోధం వస్తుంది. ఏ మనిషైనా క్రోధావిష్టుడైనప్పుడు ఉచితానుచితాలు మరచి ప్రవర్తించడం సహజం. రామచంద్రుడు కూడా తన బాణాలతో లోకాన్ని భస్మం చేస్తానని తన పరాక్రమంతో సమస్త ప్రకృతినీ తల్లడిల్లజేస్తానని ఆక్రోశించాడు. ఆ క్షణంలో తన దుఃఖానికి కారణాలను అన్వేషించి నిర్ణయం తీసుకునే స్థాయిలో రాముని మనస్సు లేదు. ఇది లోకంలోని ప్రతి వ్యక్తికీ సహజం. తన వాళ్లెవరైనా తీవ్రవేదనాపరులైతే ఓదార్చగలిగే శక్తి వారి వారి ఆత్మీయులకు, బంధువులకు ఉంటుంది. శ్రీరాముడు ఇప్పుడున్న స్థితిలో లక్ష్మణుడొక్కడే ఆత్మీయ బంధువు. రాముని మానసిక స్థితిని గ్రహించినవాడు. కనుక తన మాటలతో అతన్ని శాంతింపజేసే యత్నం చేస్తున్నాడు. ఈ సందర్భాన్ని మనిషన్న ప్రతివానికీ మార్గంచూపే విధంగా వాల్మీకి మహర్షి నిబద్ధించాడు. ఆయన లక్ష్మణుడి నోటివెంట పలికించిన పలుకులు గమనిస్తే, ఇటువంటి సున్నితమైన సందర్భంలో మాట్లాడే మాటలు ఎలా ఉండాలో అర్థమవుతుంది. దుఃఖితుడైన రాముని పరాక్రమం గొప్పదేనని, ఇంద్రాదులనైనా నిలువరించగలిగే సామర్థ్యం కలదేనని, రాముని బాణాలు వజ్రాయుధ తుల్యములేనని చెబుతూనే.. లోకాన్ని కోపానికి గురిచేయడంలోని ఔచిత్యాన్ని లక్ష్మణుడు ప్రశ్నించకనే ప్రశ్నించాడు. రాముడి కోపంవల్ల.. ఎందరో నిర్దోషులకు నివారించలేని నష్టం సంభవించే ప్రమాదం ఉందన్నాడు. 'రాజెప్పుడూ నిర్దోషులను శిక్షింపరాదన్న ధర్మం నీకు తెలుసుకదా!' అని గుర్తుచేశాడు. 'నీకు వ్యక్తిగతంగా కలిగిన దుఃఖానికి ఇది సరియైన ప్రక్రియ కాద'ని సున్నితంగా హెచ్చరించాడు. శత్రువును గుర్తించి శిక్షించాలని కోరి శ్రీరాముణ్ని శాంతింపజేశాడు. విధివశాత్తు సంభవించే అనర్థాలకు చలించి.. చేయకూడని వినాశనం చేయరాదని, విధి అనుల్లంఘనీయమైన సత్యమని మానవజాతికి సందేశాన్నందించాడు.

**- గన్నమరాజు గిరిజామనోహర్**

## ఉల్లి కోసం పడిగాపులు

- లైన్లలో వేలాది మంది
- సరుకు అందక శాపనార్థాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

చిత్తూరు, తిరుపతి బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధర రూ.200కు చేరడంతో ఆదివారం రైతు బజార్లలో రాయితీ ఉల్లి కోసం ప్రజలు భారీగా బారులు తీరారు. తిరుపతి రైతుబజారులో చంటిబిడ్డల తల్లులు, పండు వృద్ధులు, పిల్లలు ఇంటిల్లిపాదీ ఆధార్‌కార్డులతో వాలిపోయారు. దాదాపు కిలోమీటరు పొడవునా భారీ లైను ఏర్పాటు కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తెల్లవారు జాము నుంచే జనం వరుసలో నిలబడ్డారు. చిత్తూరులో, తిరుపతిలో ఉల్లి బస్తాలు కేవలం 5 టన్నుల చొప్పున రావడంతో కొన్ని గంటల్లోనే సరుకు అయిపోయింది. రూ.25 చొప్పున ఒక్కొక్కరికి కిలో ఉల్లిని మాత్రమే పంపిణీ చేశారు. ఎగబడిన జనాన్ని పోలీసులు అదుపు చేయలేకపోయారు. దాదాపు 70 శాతం మంది ఉల్లి దొరక్క శాపనార్థాలు పెడుతూ వెనుదిరిగారు. ఇక ప్రకాశం జిల్లా ఒంగోలులోని లాయరుపేట, దిబ్బలరోడ్ రైతు బజారుల వద్ద జనం సుమారు కిలోమీటరు వరకూ బారులు తీరారు. కొను గోలుదారులు, విక్రయదారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. రోజంతా పోలీసు బందోబస్తు మధ్య ఉల్లి విక్రయాలు జరిగాయి.



నెల్లూరులో రాయితీ ఉల్లిని కొన్నవారికి వేలిపై సిరా గుర్తు వేస్తున్న దృశ్యం



చిత్తూరులో ఉల్లిని విక్రయిస్తున్న పోలీసులు



విజయవాడ పటమట రైతు బజారులో బారులు తీరిన జనం

# ప్రభుత్వంలో భూ కలవరం

- పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి గడువు మరో మూడు నెలలే
- అయినా సేకరణకు నిధుల లేమి
- రూ.14వేల కోట్లు సమీకరణ ఎలా?
- రెవెన్యూ డీపీఆర్‌పై సర్కారులో అలజడి

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో 'భూముల పంపిణీ'పై కలవరం మొదలైంది. వచ్చే ఉగాది రోజున అర్హులైన 25 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందుకు నెల రోజులు ముందుగానే భూములు సిద్ధం చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. అయితే ఈ విషయంలో నిధుల లేమి ప్రధాన సమస్యగా మారింది. పంపిణీ కోసం ప్రైవేటు భూమి సేకరించాలంటే రూ.14వేల కోట్లు కావాలని రెవెన్యూశాఖ ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను ఆర్థికశాఖకు పంపించింది. వాస్తవానికి భూసేకరణకు రూ.20వేల కోట్లు అవసరమని రెవెన్యూశాఖ ముందుగా అంచనా వేసినా, తర్వాత దానిని రూ.16వేల కోట్లకు తగ్గించింది. చివరికి... రూ.14వేల కోట్లు కేటాయిస్తేనే పని అవుతుందని నిర్ధారించింది. కానీ, ఈ నిధులు కూడా ప్రభుత్వానికి పెనుభారంగా మారాయి. మరో మూడు నెలల్లో ఈ నిధులు సమకూర్చుకోవడం ఎలా? భూ సేకరణ గండం నుంచి బయటపడటం ఎలాగని ప్రభుత్వం కలవర పడుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ఉన్నది 19వేల ఎకరాలే. ఇందులో ఇళ్ల స్థలాలకు పనికొచ్చేది ఎంతో ఇప్పటికీ స్పష్టత రాలేదు. ప్రస్తుత పాలసీ ప్రకారం గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు భూమి ఇవ్వాలని సీఎం జగన్ చెప్పారు. పట్టణాల్లో ఇవ్వడానికి సెంటు భూమి కూడా లేకపోతే అపార్ట్‌మెంట్‌లు నిర్మించి ఇవ్వాలన్నది మరో ప్రత్యామ్నాయం. అయితే, అపార్ట్‌మెంట్‌లు నిర్మించాలన్నా భూమి కావాల్సిందే. ఈ కార్యక్రమం పూర్తి కావాలంటే ప్రభుత్వం అదనంగా మరో 26,500 ఎకరాల ప్రైవేటు భూమి సేకరించాల్సి ఉందని తేల్చారు. ఇందుకు అవసరమైన సొమ్మును ఫిబ్రవరి నాటికి సమకూర్చడం అసాధ్యమని అధికారులే అంటున్నారు. ఇళ్ల స్థలాల కోసం బడ్జెట్‌లో కేటాయించింది రూ.5వేల కోట్లే. అంటే అదనంగా మరో రూ.9వేల కోట్లు కేటాయించాలి. అయితే, ముందుగా కేటాయించిన సొమ్ము ఇవ్వడమే కష్టమని ఆర్థికశాఖ వర్గాలు చెప్తున్నాయి. ప్రస్తుతం ఉద్యోగుల జీతాలకే అప్పులు తెచ్చిమరీ చెల్లిస్తున్నామని, భూసేకరణకు ఇంత భారీమొత్తంలో నిధులు సమకూర్చడం సాధ్యమయ్యే పనికాదని వ్యాఖ్యానిస్తున్నాయి.

### అప్పులూ ఆదుకోవు!

ఇది 14వ ఆర్థిక సంఘానికి సంబంధించిన చివరి సంవత్సరం. ఇప్పటికే ఐదేళ్లలో తెచ్చుకోవాల్సిన అప్పుల టార్గెట్‌ను ప్రభుత్వం చేరుకుంది. ఇక అదనపు అప్పు కోసం అవకాశం ఉండదని అధికారవర్గాలే చెబుతున్నాయి. ఒకవేళ రిజర్వు బ్యాంకు, ప్రైవేటు బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చినా మరో ఆరు సంక్షేమ పథకాలు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. వీటన్నింటినీ దాటుకొని ఇళ్ల స్థలాలకు ఆ నిధులు చేరినా, రూ.300 కోట్లలోపే ఉంటాయని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పుడున్న ఆర్థిక కష్టాల్లో కనీసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులైనా విడుదల అవుతాయో లేదో అనే సందేహం నెలకొందని, డీపీఆర్‌లో పేర్కొన్న నిధుల్లో సగం ఇచ్చినా మహాభాగ్యమే అని సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించడం ఆర్థిక పరిస్థితిని తెలియచేస్తోంది.

## రాహుల్.. దేశం పరువు తీయొద్దు: వెంకయ్య

- రేప్‌ల రాజధాని అన్న వ్యాఖ్యలపై ఉప రాష్ట్రపతి హితవు
- ఐపీసీ, సీఆర్‌పీసీలను సవరిస్తాం: అమిత్ షా



న్యూఢిల్లీ/పుణె, డిసెంబరు 8: అత్యాచారాలకు భారత్ రాజధానిగా మారిందన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మండిపడ్డారు. రాహుల్ వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ దేశం పరువు తీయొద్దని హితవు పలికారు. అత్యాచార ఘటనల విషయంలో రాజకీయాలను తేవద్దని సూచించారు. ఆదివారం పుణెలోని సింబియోసిస్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. "నిర్భయపై బిల్లు తెచ్చాం. ఏం జరిగింది? సమస్య పరిష్కారం అయిందా? నేను ఏ బిల్లుకి, కొత్త చట్టాలకు వ్యతిరేకం కాదు. సామాజిక దురాగతాలను అంతమొందించాలంటే రాజకీయ సంకల్పం, పరిపాలనా సామర్థ్యాలు అవసరం" అని పేర్కొన్నారు. కాగా, ఐపీసీ, సీఆర్‌పీసీ సవరణకు ఎన్‌డీఏ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.

**పుట్టిన రోజు వేడుకలకు సోనియా దూరం:** కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ సోమవారం తన 73వ పుట్టిన రోజు వేడుకలను జరుపుకోకూడదని నిర్ణయించారు. దేశంలో పలుచోట్ల మహిళలపై అత్యాచారాలు, దాడుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు.

## 12 ఏళ్ల బాలికపై ఏడాదిగా గ్యాంగ్‌రేప్

- దారుణానికి తల్లి సహకారం.. ముగ్గురి అరెస్టు

భావ్‌నగర్, డిసెంబరు 8: పన్నెండేళ్ల ముక్కుపచ్చలారని బాలికపై ముగ్గురు వ్యక్తులు ఏడాది కాలంగా అత్యాచారానికి ఒడిగడుతున్నారు. మరో ఘోరం ఏమిటంటే ఈ దారుణానికి స్వయంగా బాధితురాలి తల్లే సహకరించింది. గుజరాత్‌లో ఈ దారుణం వెలుగుచూసింది. బాధితురాలు.. పటియాలా తాలూకా భుటియాకు చెందిన బాలిక. 'ఈ ఘటన వెనుక నా భార్యే ఉంది' అంటూ ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక తల్లి పరారీలో ఉంది. అయితే తండ్రిపైనే బాధితురాలు ఆరోపించింది. 'మా నాన్న ఇంట్లోంచి వెళ్లేటప్పుడు నాతో ఏదో తినిపించేవాడు. నేను మత్తులోకి వెళ్లగానే ముగ్గురు వ్యక్తులు నాపట్ల దారుణంగా ప్రవర్తించేవారు' అని పోలీసులకు చెప్పింది. ఘటనకు సంబంధించి నిందితులు శాంతి ధంధుకియా (46), బాబుబాయి (43), చంద్రేశ్ (32)ను అదుపులోకి తీసుకున్నారు.

## మద్యపానమే హత్యాచారాలకు కారణం: హరగోపాల్

జడ్చర్ల, డిసెంబరు 8: మానవీయ సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యపానం, అశ్లీల వెబ్‌సైట్లు, సినిమాలే స్త్రీలపై జరుగుతున్న హత్యాచారాలకు ప్రధాన కారణమన్నారు. ప్రతీకారంతో చూడడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ విషయంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్పందించిన తీరుతో సమాజం మనోవేదనకు గురవుతోందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి చేర్యాలలో అన్నారు.

# బాలికపై గ్యాంగ్‌రేప్

- తిరుచానూరు బ్రహ్మోత్సవాల వేళ దారుణం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- 'ప్రకాశం'లో యువతిని వంచించిన ప్రియుడు

తిరుచానూరు/తిరుపతి/మార్కాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో 'నిర్భయ', హైదరాబాద్‌లో 'దిశ', ఉన్నావ్‌లో 'ఆమె'... ఘటనల తర్వాత కూడా మహిళలు, చిన్నారులపై అకృత్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. లిఫ్ట్ అడిగిన మైనర్ బాలికపై ఇద్దరు దుర్మార్గులు అత్యాచారానికి పాల్పడిన ఘటన చిత్తూరు జిల్లాలో వెలుగు చూసింది. తిరుచానూరులో పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలోనే ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... జిల్లాలోని పడమటి ప్రాంతానికి చెందిన బాలిక(16) గతనెల 24న అర్ధరాత్రి 12.30గంటల ప్రాంతంలో తిరుచానూరు వెళ్లేందుకు తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురం వద్ద రోడ్డుపై నిలబడి ఉంది. అదే సమయంలో స్కూటర్‌పై వెళ్తున్న బ్రాహ్మణపట్టుకు చెందిన కారు డ్రైవర్ వెంకటేశ్‌ను లిఫ్ట్ అడిగింది. అతడు ఆమెను స్కూటర్‌పై ఎక్కించుకుని తిరుచానూరులో ఆపకుండా ముళ్లపూడి వరకు తీసుకెళ్లాడు. స్కూటర్‌లో పెట్రోల్ అయిపోయిందని బాలికను నమ్మించాడు. తన స్నేహితుడైన పద్మావతీపురం వాసి, రౌడీషీటర్ రాజమోహన్ నాయక్‌కు ఫోన్‌చేసి పెట్రోల్ తీసుకురమ్మని చెప్పినట్టు నటించాడు. అతను రాగానే ఇద్దరూ కలసి ఆమెను బలవంతంగా సమీపంలోని ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు 420, 376(డి)(ఎ), పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. రెండు వారాలపాటు విషయం గోప్యంగా ఉంచిన పోలీసులు ఆదివారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాజమోహన్ నాయక్ తిరుపతిలో ఓ హత్యకేసులో నిందితుడని, అతనిపై తిరుచానూరు పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉందని డీఎస్పీ తెలిపారు.

### ప్రేమ పేరుతో ముగ్గులోకి...

ప్రేమ పేరుతో ఓ యువతిని గర్భవతిని చేసి కనిపించకుండా వెళ్లిన యువకుడిపై ప్రకాశం జిల్లా మార్కాపురం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్సై గుంగుల వెంకట్ కథనం మేరకు.. మార్కాపురం మండలానికి చెందిన ఓ యువతికి ఇంటి సమీపంలో ఉండే యువకుడు ఆషిక్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెను ప్రేమపేరుతో ముగ్గులోకి దించిన ఆషిక్.. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి లొంగదీసుకున్నాడు. తర్వాత కనిపించకుండా పోయాడు. ఇటీవల బాధితురాలు కడుపునొప్పితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆమెకు అబార్షన్ అయినట్లు నిర్ధారించడంతో విషయం బయటపడింది. నిందితుడి స్వస్థలం విశాఖపట్నం అని బాధితురాలు పేర్కొన్నారని, ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

## 'ఉన్నావ్' కుటుంబానికి పోలీసు రక్షణ



ఉన్నావ్ బాధితురాలి కుటుంబానికి తగిన రక్షణ కల్పిస్తామని యూపీ ప్రభుత్వం తెలిపింది. కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించడంతో పాటు బాధితురాలి సోదరుడికి గన్ లైసెన్స్ ఇప్పిస్తామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. "బాధితురాలి సోదరికి 24 గంటల పోలీసు రక్షణ, ఉద్యోగం కల్పిస్తాం. ఆమె సోదరుడికి ఆత్మ రక్షణ కోసం గన్ లైసెన్స్ ఇప్పిస్తాం. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఆ కుటుంబానికి రెండు ఇళ్లు నిర్మిస్తాం. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు. ఆదివారం పోలీసు భద్రత నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

## శ్రీనివాస్‌రెడ్డినీ చంపాలి!

**హాజీపూర్ బాధిత కుటుంబాల డిమాండ్**

యాదాద్రి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమ బిడ్డలను పొట్టన పెట్టుకున్న రాక్షసుడు శ్రీనివాస్‌రెడ్డినీ చంపాలని, అప్పుడే వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని హాజీపూర్ బాధిత కుటుంబాలు పేర్కొన్నాయి. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో శ్రీనివాస్‌రెడ్డినీ చంపాలంటూ మూడు రోజులుగా బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. తెలంగాణలోని యాదాద్రి జిల్లా మల్యాలలో ఆదివారం కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల భవన శంకుస్థాపనకు వచ్చిన మంత్రి సబితను వారు కలిశారు. తమకూ న్యాయం చేయాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయమై సీఎం కేసీఆర్‌తో మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

## కామాంధులకు.. బహిరంగ ఉరే సరి!: రోజా



రేణిగుంట, డిసెంబరు 8: మహిళలపై అత్యాచారాలకు పాల్పడే కామాంధులను బహిరంగంగా ఉరి తీయడమే సరైన శిక్ష అని వైసీపీ ఎమ్మెల్యే ఆర్‌కే రోజా అన్నారు. చిత్తూరు జిల్లా రేణిగుంటలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, దిశ హంతకుల ఎన్‌కౌంటర్‌పై మానవ హక్కుల సంఘం చేసిన వాదనను తప్పుబట్టారు. ఒక ఆడపిల్ల తల్లిగా తాను ఈ ఎన్‌కౌంటర్‌ను సమర్థిస్తున్నట్టు చెప్పారు. పోలీసుల చర్యను ప్రజలు కూడా స్వాగతిస్తున్నారని అన్నారు.

## 'సింగపూర్' తరహా శిక్షలు వేయాలి

- అత్యాచార ఘటనలపై పవన్ వ్యాఖ్య



మండపేట, డిసెంబరు 8: అత్యాచార ఘటనల్లో దోషులకు సింగపూర్ తరహాలో బహిరంగ శిక్షలు అమలు చేయాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఇలాంటి శిక్షలు వేస్తేనే తప్పు చేయాలనుకునేవారు భయపడతారని చెప్పారు. ఆదివారం తూర్పు గోదావరి జిల్లా మండపేటలో పర్యటించిన ఆయన హైదరాబాద్‌లో దిశ ఘటనకు సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలను వైసీపీ నాయకులు వక్రీకరించారని ఆరోపించారు. దిశ ఘటనలో దోషులకు సింగపూర్ తరహాలో బహిరంగంగా 'కేనింగ్' చేయాలని తాను చెప్పానని, దీనికే 'బెత్తం దెబ్బలు' అని వాడానని, అయితే, వైసీపీ నేతలు ఈ వ్యాఖ్యలను వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


## మూక న్యాయం.. దేశానికే ప్రమాదం: జగ్గీ వాసుదేవ్

ముంబై, డిసెంబరు 8: 'దిశ' హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్‌పై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలన్న ప్రజాగ్రహం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే.. మనదేశంలో న్యాయ ప్రక్రియ తీవ్రంగా ఆలస్యమవుతోందని.. ఆ సమస్యను పరిష్కరించడానికి ఏమీ చేయకపోతే ఇలాగే మూక న్యాయం అమలవుతుందని ఆందోళన వెలిబుచ్చారు. ఇలాంటి మూక న్యాయాన్ని సమాజం ఒక ప్రమాణంగా భావిస్తోందని.. ఇది దేశానికి మంచిది కాదని ఆయన హెచ్చరించారు.

## 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్.. పోలీసులపై ఉప్పల్‌లో ఫిర్యాదు

ఉప్పల్/హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'దిశ' నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై మహబూబ్‌నగర్‌కు చెందిన 'నేనుసైతం' అనే సంస్థ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలంటూ ఉప్పల్ పోలీసులను కోరారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ నేతృత్వంలోని పోలీసుల బృందం చట్టాన్ని చేతుల్లోకి తీసుకుందని.. పాయింట్-బ్లాంక్ రేంజ్‌లో ఆ నలుగురిని కాల్చి చంపిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సజ్జనార్‌తోపాటు.. శంషాబాద్ డీసీపీ ఎన్.ప్రకాశ్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎస్పీ రెమారాజేశ్వరి, షాద్‌నగర్ డీఎస్పీ శ్రీధర్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ అరవింద్‌గౌడ్‌పై కేసు నమోదు చేయాలని కోరారు.

## లోకం తీరు




### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 15.9 | 26.8 |
| హైదరాబాద్ | 18.0 | 27.5 |
| గుంటూరు | 19.4 | 30.2 |
| కడప | 21.0 | 26.0 |
| విజయవాడ | 21.7 | 31.0 |
| చిత్తూరు | 21.9 | 29.8 |
| శ్రీకాకుళం | 22.0 | 32.5 |
| నెల్లూరు | 23.5 | 28.8 |

## పలుచోట్ల వర్షాలు


విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక సమీపంలో, నైరుతి బంగాళాఖాతం పరిసరాల్లో ఉపరితల ద్రోణి ఆవరించి ఉంది. దీని ప్రభావంతో తూర్పు గాలులు వీస్తుండడంతో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల మేఘాలు ఆవరించి వర్షాలు కురిశాయి. నందవరంలో 2, పోలవరంలో 1సెం.మీ. వర్షపాతం నమోదైంది. రానున్న 24గంటల్లో పలుచోట్ల ఉరుములతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆరోగ్యవరంలో 16.5డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



## రాహుల్ సిగ్గుపడు.. నెహ్రూనే అతిపెద్ద రేపిస్ట్

ప్రపంచంలో అత్యాచారాలకు భారత్ నెలవుగా మారిందంటూ చేసిన వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ సిగ్గుపడాలి. అందరికన్నా పెద్ద రేపిస్టు నెహ్రూ, ఆయన వంశమే. దీనిపై విచారణ జరగాలి. దేశంలో చోటుచేసుకుంటున్న ఉగ్రవాద, నక్సల్, అత్యాచార ఘటనలకు కారణం నెహ్రూ కుటుంబమే. తన వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ తక్షణమే క్షమాపణలు చెప్పాలి.

**- వీహెచ్‌పీ నేత సాధ్వీ ప్రాచీ**



## గో పోషణతో ఖైదీల్లో నేరప్రవృత్తి తగ్గుతుంది

జైళ్లల్లో గోవుల షెడ్లు ఏర్పాటు చేసి.. ఆవుల బాధ్యతను ఖైదీలకు అప్పగిస్తే వారిలో నేరప్రవృత్తి తగ్గుతుంది. ఇది తమ అనుభవంతో జైళ్ల అధికారులు నాతో పంచుకున్న మాట. ఖైదీలపై మానసిక పరీక్షలు చేసి, గో పోషణ బాధ్యత తర్వాత వారిలో వచ్చిన మార్పును పరిశీలించాలి.

**- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్**

## ఆహార నియమాలు పాటిస్తే.. మధుమేహానికి మందులక్కర్లేదు

వాషింగ్టన్, డిసెంబరు 8 : "జీవ గడియారానికి అనుగుణంగా ఆహారం తీసుకుంటే మధుమేహ బాధితులు మందులు వాడాల్సిన పనే ఉండదు.. ఇన్సులిన్ ఇంజెక్షన్లు చేయించుకోవాల్సిన అవసరమే ఉండదు" అని ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. రోజూ ఉదయం పిండి పదార్థాలతో కూడిన అల్పాహారం.. మధ్యాహ్నం, రాత్రి భోజనాలు.. నిద్రపోయే ముందు కొద్దిపాటి అల్పాహారం తీసుకుంటే రక్తంలో చక్కెర మోతాదు అదుపులోకి వస్తుందని అధ్యయనంలో గుర్తించారు. ఇన్సులిన్ ఇంజెక్షన్ల వల్ల సాధారణంగా శరీర బరువు పెరుగుతుంటుంది. ఆ విపరీత పరిస్థితికి బ్రేక్ పడాలంటే పిండిపదార్థాలతో కూడిన అల్పాహారం తీసుకోవడం తప్పనిసరి అని వారు సూచిస్తున్నారు.

## 'సిజేరియన్' పిల్లలకు స్థూలకాయం ముప్పు తక్కువే

స్టాక్‌హోం, డిసెంబరు 8 : సిజేరియన్ ద్వారా పుట్టే శిశువులకు స్థూలకాయం(ఒబెసిటీ) ముప్పు అంతగా ఉండదని స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు అంటున్నారు. అధ్యయనంలో భాగంగా 18 ఏళ్ల వయసు కలిగిన లక్ష మంది వయసు, ఎత్తు, బరువు, ఆరోగ్యం వివరాలను సేకరించారు. ఆ సమాచారాన్ని విశ్లేషించగా, సిజేరియన్ ద్వారా జన్మించిన 5.6శాతం మంది, సాధారణ ప్రసవంతో పుట్టిన 4.9శాతం మంది స్థూలకాయంతో బాధపడుతున్నట్లు వెల్లడైంది.

# సీఎం ఫొటోకే చోటు!

## ప్రభుత్వ ప్రచారంలో జగన్ చిత్రం ఒక్కటే ఉండాలి

- ఫ్లెక్సీ, పోస్టర్, కరపత్రాల్లో కూడా అంతే
- ఆయన పక్కన మరొకరి చిత్రం ఉండకూడదు
- జిల్లా కలెక్టర్లకు సీఎంవో నిర్దేశం



అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల్లో సీఎం ఫొటో మాత్రమే వాడాలి.. ఆయన చిత్రం పక్కన ఇతరుల ఫొటోలు వద్దంటే వద్దు..' అని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని నిర్దేశించింది. ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంగా రూపొందించే ఫ్లెక్సీలు, కరపత్రా లు, వాల్‌పోస్టర్లు, టీవీ, పత్రికా ప్రకటనల్లోనూ ఇకపై ఇదే విధానం కొనసాగించాలని స్పష్టం చేసింది. అనంతపురం జిల్లాలో కియా కార్ల కంపెనీ కార్యక్రమంలో అధికారిక, రాజకీయ, ప్రైవేటు ఫ్లెక్సీల్లో సీఎం జగన్ ఫొటోల వాడకం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలే ఈ ఆదేశాలకు మూలకారణమని తెలుస్తోంది. సీఎం గత గురువారం ఆ జిల్లాకు వెళ్లి కియా కార్ల ఫ్యాక్టరీ గ్రాండ్ ఓపెనింగ్ వేడుకలో పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆయన రాక సందర్భంగా ఘనస్వాగతం పలుకుతూ జిల్లా అధికార యంత్రాంగం, వైసీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు రహదార్ల వెంట పెద్దఎత్తున ఫ్లెక్సీలు, స్వాగత బ్యానర్లు, భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు. పత్రికల్లో భారీగా ప్రకటనలు కూడా ఇచ్చారు. నేతలు, అభిమానులు పెట్టిన ఫ్లెక్సీల్లో సీఎంతోపాటు జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర అధికారుల ఫొటోలు పెట్టారు. కొన్ని ఫ్లెక్సీల్లో సీఎం ఫొటో చిన్నగా.. మంత్రులు, కలెక్టర్, ఇతర అధికారులవి పెద్దవిగా పెట్టారు. ఇంకొన్నిటిలో సీఎం, కలెక్టర్ ఫొటోలు పెద్దవిగా.. మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలు చిన్నగా ఉన్నాయి. దీనిపై దుమారం చెలరేగింది. ఇదిలా ఉండగానే, మరో వివాదం తెరపైకి వచ్చింది. ప్రైవేటు వ్యక్తులు కూడా ప్రభుత్వం అధికారికంగా విడుదలచేసిన సీఎం జగన్ ఫొటోలే వాడాలని, ఇతరత్రా వాడకూడదంటూ ఓ ఉన్నతాధికారి ఆంక్షలు పెట్టే ప్ర యత్నం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ఫొటోలు లేని ఫ్లెక్సీలను తొలగించాలని హుకుం జారీశారు. దీనిపై వైసీపీ నేతలు, ప్రైవేటు వ్యక్తులు గొడవపడ్డారు. జగన్ వి తమకు నచ్చిన ఫొటోలు వాడుకుంటామని, అభ్యంతరపెట్టడానికి అధికారులెవరని పెనుకొండ ప్రాంతంలో నిలదీశారు. ఇది వివాదంగా మారి.. ఆ తర్వాత మరింత రచ్చరచ్చయింది.

### సరిగ్గా మూడు రోజుల తర్వాత..

ఈ వివాదం జరిగి సరిగ్గా మూడు రోజులైన తర్వాత ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో సీఎం ఫొటోల వాడకంపై ఆయన కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. 'ఫ్లెక్సీలు, కరపత్రాల్లో జిల్లా అధికారుల ఫొటోలు ప్రచురిస్తున్నారు. అనేక జిల్లాల్లో ఇది గుర్తించాం. ఈ సందర్భంగా 2003, 2004, 2012ల్లో దాఖలైన రిట్ పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను మీ దృష్టికి తీసుకొస్తున్నాం. ఆ ఆదేశాల స్ఫూర్తి ఏమంటే.. పథకాలను బాగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, వాటిని ప్రాచుర్యం పొందడానికి రూపొందించే పబ్లిసిటీ మెటీరియల్‌లోని ప్రభుత్వ సందేశాల్లో అధికారుల ఫొటోలు ఉండడానికి వీల్లేదు. ఒక వేళ అలాంటి వాటిల్లో ముఖ్యమంత్రి ఫొటో ఉంటే .. ఇక మరో వ్యక్తి ఫొటో ఉండకూడదు. ఈ ఆదేశాల స్ఫూర్తి కేవలం టీవీ, పత్రికల్లో ఇచ్చే ప్రకటనలకే కాదు.. ప్రజాధనంతో చేపట్టే అన్ని రకాల ప్రచారాలకూ (సోషల్ మీడియా, కరపత్రాలు, హోర్డింగులకు) ఇది వర్తిస్తుంది. కాబట్టి జిల్లా కలెక్టర్లు ఇది కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి' అని సీఎంవో నుంచి వెళ్లిన ఆదేశంలో పేర్కొన్నారు. అంటే ఇక ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం కోసం రూపొందించే కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు, పత్రికా, టీవీ ప్రకటనల్లో సీఎం ఫొటో మాత్రమే ఉండాలి. సోషల్ మీడియా ప్రచారంలోనూ అధికార యంత్రాంగం ఈ నియమం పాటించాలన్నమాట.



## సీఎం ఇంటిపై ఇచ్చిన మరో రెండు జీవోలు రద్దు

- 3.99 కోట్ల ఎలక్ట్రికల్ పనులు బంద్

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్ ఇల్లు, క్యాంపు కార్యాలయాల్లో సదుపాయాల కల్పన కోసం నిధులు కేటాయిస్తూ ఇచ్చిన జీవోల రద్దు పరంపర కొనసాగుతోంది. ఆదివారం రాత్రి కూడా మరో రెండు కీలక ఉత్తర్వులను రద్దుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇంతవరకు ఎనిమిది జీవోలు రద్దయినట్లయింది, జగన్‌కు చెందిన తాడేపల్లి నివాసం, క్యాంపు ఆఫీసు, హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ నివాసంలో అదనపు సదుపాయాలు, రక్షణ ఏర్పాట్లకోసం సర్కారు నవంబరు 25 నాటికి రూ.16 కోట్లపైనే నిధులు కేటాయించింది. దీనిపై జాతీయ స్థాయిలో దుమారం చెలరేగింది. కొత్త ఇంటి కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నారన్న విమర్శలు చెలరేగాయి. దీంతో సీఎం ఇరకాటంలో పడినట్లయింది. కొన్ని పనులను రద్దుచేయాలని ఆయన రోడ్లు-భవనాల శాఖను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం అర్ధరాత్రి ఆరు జీవోలను రద్దుచేస్తూ ఆ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. వాటి విలువ రూ.2.87 కోట్లు. ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మరో రెండు జీవోలు రద్దుచేస్తూ ఆర్‌అండ్‌బీ ఉత్తర్వులు జారీ చేసింది. తాడేపల్లి నివాసంలో రూ.3,63,50,000తో ఎలక్ట్రికల్, ఎలక్ట్రోమెకానికల్ వర్కులు చేపట్టాలని గత జూలై 12న జీవో 146 ఇచ్చారు. జారీ చేసిన నాలుగు నెలల తర్వాత దానిని తాజాగా రద్దుచేయడం గమనార్హం. జీవో 306 ప్రకారం లోటస్‌పాండ్ నివాసంలో రూ.35.50 లక్షల వ్యయంతో ఎలక్ట్రికల్, ఎలక్ట్రోమెకానికల్ వర్కులు చేపట్టాలని ప్రతిపాదించారు. రద్దయిన ఈ రెండు ఉత్తర్వుల్లో పేర్కొన్న పనుల విలువ రూ.3.99 కోట్లు. గత మూడు రోజుల కాలంలో రద్దయిన 8 జీవోల్లో పేర్కొన్న పనుల మొత్తం విలువ రూ.6.86 కోట్లు.

## 'రైతు పవర్' డైలాగ్ అదుర్స్

- 'రూలర్' దుమ్ములేపిద్ది మావయ్యా: లోకేశ్ ట్వీట్

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ ధాన్యం తింటున్న మీకే ఇంత పొగరుంటే...దీన్ని పండించిన రైతుకు ఇంకెంత పొగరు, పవర్ ఉంటుందో చూపించమంటావా? అంటూ రూలర్ సినిమాలో చెప్పిన డైలాగ్ అదిరిందని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. 'బాలా మావయ్యా! మొత్తంగా రూలర్ ట్రైలర్ అదుర్స్. ట్రైలర్ చూస్తేనే సినిమా దుమ్ములేపుద్దని అనిపిస్తోంది. ఆల్ ది బెస్ట్ మావయ్యా!' అని పేర్కొన్నారు. మరోవైపు టీడీపీ కార్యకర్త హకసింగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని తెలిసిందని, అతను తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడని, అతనికి అండగా ఉంటామని మరో ట్వీట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో హకసింగ్ ఉన్న ఫొటోను జతచేశారు.

## పేటీఎంలో రూ.41 వేలు చోరీ

ఏలూరు, డిసెంబరు 8: డబ్బులు వాపసు ఇస్తామంటూ పేటీఎం అకౌంట్ వివరాలు తెలుసుకున్న ఓ ఆన్‌లైన్ వ్యాపార సంస్థ... కస్టమర్ ఖాతా నుంచి రూ.40,799 అపహరించింది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన చిన్నం నవ్యనిఖిత స్థానిక సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఆమె ఆన్‌లైన్‌లో కుర్చీ కోసం ఆర్డర్ ఇచ్చారు. దీని కోసం పేటీఎం ద్వారా డబ్బులు చెల్లించారు. అయితే కుర్చీకి బదులు చీర రావడంతో దానిని తిప్పి పంపించేశారు. తాను చెల్లించిన డబ్బులు ఇచ్చేయాలని నిఖిత కోరడంతో... పేటీఎం ఖాతాలో జమ చేస్తామని ఈ ఆన్‌లైన్ సంస్థ నిర్వాహకులు చెప్పారు. పేటీఎం అకౌంట్ నంబరు, అందుకు సంబంధించిన కోడ్ నంబరు అడిగి తెలుసుకుని, ఆ తర్వాత నిఖిత అకౌంట్ నుంచి రూ.40,799 అపహరించారు. నిఖిత ఫిర్యాదుతో ఏలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎస్సీ గురుకులాల్లో టీచర్లకు రేటింగ్

- సబ్జెక్టుల వారీ ఫలితాలను బట్టి మదింపు
- మెరుగుపడకుంటే తప్పనిసరి రిటైర్‌మెంట్!

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో ఇంగ్లీషు మీడియం అమలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలపై ఒకవైపు చర్చ జరుగుతుండగా... మరోవైపు సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ సాహసోపేతమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలన్నీ ఇంగ్లీషు మీడియంలోనే కొనసాగుతున్నాయి. అయితే ఇప్పటికీ ఆంగ్లంలో పదాలు రాయలేని విద్యార్థులు అధిక సంఖ్య లో ఉన్నారని ఆ సంస్థ గుర్తించింది. ఇటీవల ఆ సంస్థ కార్యదర్శి కల్నల్ రాములు గురుకులాల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్షాపేపర్లు ఉన్నతాధికారులకు, మంత్రికి చూపించి విద్యార్థుల ప్రామాణికత ఏ స్థాయిలో ఉందో వివరించారు. ఇంకా 10 శాతానికిపైగా విద్యార్థులకు ఓనమాలు రాని పరిస్థితి ఉందని గుర్తించారు. పేద ఎస్సీ విద్యార్థుల తల్లిదండ్రులు గురుకులాలను నమ్మి చేర్పిస్తే... ఏళ్లు గడిచినా వారికి అక్షరాలు రాని పరిస్థితి ఉంటే దానికి ఎవరిని బాధ్యులను చేయాలనే ప్రశ్న తలెత్తింది. ఈ విషయంపై మంత్రి పినిపే విశ్వరూప్‌తో పాటు ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. సబ్జెక్టుల వారీగా టీచర్ల పనితీరును సమీక్షించాల్సిన అవసరముందని గుర్తించారు. చాలామంది టీచర్లు కూడా ప్రమాణాలకు అనుగుణంగా లేరని, పనితీరును మెరుగుపరుచుకోలేని పరిస్థితిలో వారు ఉన్నారని అంచనా వేశారు. గత మూడేళ్లుగా గురుకుల సొసైటీ సెక్రటరీ కల్నల్ రాములు సంస్కరణలు చేపట్టినప్పుడల్లా కొంతమంది గురుకులాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, వారికి ప్రభుత్వ పెద్దలు వత్తాసు పలకడంతో సంస్కరణలు అమల్లోకి తీసుకురాలేకపోయారని కొంతమంది అధికారులు పేర్కొంటున్నారు. తాజాగా మంత్రి భరోసా తీసుకుని సెక్రటరీ ఈ సంస్కరణలు చేపడుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ఆయా సబ్జెక్టుల్లో ఫలితాల్లో వెనుకబడిన చివరి 5 శాతం టీచర్లకు సంబంధించి ముందు పరిశీలన చేస్తారు. ఇందుకోసం ఆయా జిల్లాలో జిల్లా కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో ఎస్‌సీఈఆర్‌టీ నిపుణులు, బయట విద్యాసంస్థల నిపుణులు నుంచి ఒకరు, స్థానిక డైట్ కళాశాల నుంచి ఒకరితో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీ ముందు ఆయా టీచర్లు సెమినార్ ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా గురుకుల సొసైటీ సెక్రటరీ, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ లేదా డైట్ ప్రిన్సిపాల్, ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ఇద్దరు సబ్జెక్టు నిపుణులతో కూడిన మరో కమిటీ ముందు అకడమిక్ ఫలితాల్లో ఆఖరులో ఉన్న ఒక శాతం టీచర్లు సెమినార్ ఇస్తారు. ఈ అసెస్‌మెంట్‌లో సబ్జెక్టు నాలెడ్జికి సంబంధించి 50 శాతం, టీచింగ్ మెథడాలజీపైన 35 శాతం, ప్రవర్తన నియమావళికి సంబంధించి 15 శాతం పరీక్షిస్తారు. సెమినార్‌లో ఈ కమిటీలు పరిశీలించిన తర్వాత టీచర్లకు ఎక్సలెంట్, గుడ్, సరాసరి(ఆవరేజ్), సరాసరి కంటే తక్కువగా రేటింగ్‌లు ఇస్తారు.

### ఆరు నెలల్లో మెరుగు

జిల్లా కోఆర్డినేటర్ల ముందు ఇచ్చిన సెమినార్‌లో టీచర్లు సరాసరి కంటే తక్కువ పనితీరు కనబర్చితే వారికి ఆరు నెలల సమయం ఇస్తారు. వారి పనితీరు మెరుగుపరుచుకున్న ఆరు నెలల తర్వాత ఆ టీచర్లు సొసైటీ సెక్రటరీ ఆధ్వర్యంలోని కమిటీ ముందు సెమినార్ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటికీ వారి పనితీరు సరాసరి లేదా అంతకంటే తక్కువగా ఉంటే... వారికి మరో ఏడాది అవకాశం ఇస్తారు. ఆ లోపు వారి బోధనా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. ఏడాది తర్వాత సెక్రటరీ ఆధ్వర్యంలోని కమిటీ ముందు మళ్లీ హాజరై సెమినార్ నిర్వహించాలి. అప్పటికీ సరాసరి, అంతకంటే తక్కువగా పనితీరు ఉంటే అలాంటి టీచర్లు కచ్చితంగా సర్వీసు నుంచి రిటైర్ కావాల్సి ఉంటుందని సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని ఎస్సీ గురుకులాల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ వెంటనే దృష్టి సారించాలని రాములు ఆదేశాలిచ్చారు.

## ఇద్దరూ రెండు కళ్లు!

- కన్నవారూ, పెంచినవారూ సమానమే
- ఒక్కొక్కరి దగ్గరా పదేసి రోజులుంటా
- భవానీ కథ సుఖాంతం

విజయవాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒకరు కన్నవారు. మరొకరు పెంచినవారు. బాల్యంలో తెగిన బంధాన్ని ఫేస్‌బుక్ కలిపింది. ఇప్పుడు కన్నవారి వద్దకు వెళ్లకుండా ఉండలేదు. అలాగని పెంచినవారిని దూరం చేసుకోలేని భవానీ... తనకు కన్నవారు, పెంచినవారూ రెండు కళ్లని పేర్కొంది. 15ఏళ్ల క్రితం ఇంటినుంచి తప్పిపోయి ఫేస్‌బుక్ ద్వారా కన్నవారిని కలుసుకున్న ఆమె వారితో పాటు పెంచిన వారివద్ద కూడా పదేసి రోజులు ఉండాలని నిర్ణయించుకుంది. భవానీ విజయవాడలో ఉన్నట్లు తెలియడంతో శ్రీకాకుళం జిల్లా చీపురుపల్లిలో ఉంటున్న ఆమె తండ్రి కోడిపెట్ల మాధవరావు, తల్లి వరలక్ష్మి, అన్నలు సంతోష్, గోపి హుటాహుటిన ఇక్కడకు వచ్చారు. ఆదివారం పటమట పోలీస్‌స్టేషన్‌లో సెంట్రల్ ఏసీపీ నాగరాజురెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి ఇద్దరు తల్లిదండ్రులను విచారించారు. కన్నకూతుర్ని తీసుకెళ్లడానికి అసలు తల్లిదండ్రులు ముందుకురావడం, భవానీని ఇవ్వడానికి ఆమెను పెంచిన తానేటి జీవరత్నం, జయమ్మ ఇష్టపడకపోవడంతో నిర్ణయాన్ని ఆమెకే వదిలిపెట్టారు.

## ఎస్సీలను వర్గీకరించొద్దు

- మాలమహానాడు

న్యూఢిల్లీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాలో ఎస్సీలను ఏ,బీ,సీ,డీ కేటగిరీలుగా వర్గీకరించవద్దంటూ మాలమహానాడు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆదివారం రిలే నిరాహారదీక్షలను ప్రారంభించింది. ఎస్సీ ఉప కులాలను వర్గీకరించవద్దంటూ గతంలో సుప్రీంకోర్టు, జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశించాయని.. అయితే ఇప్పుడు రాజకీయ పార్టీలన్నీ తమ ఓటు బ్యాంకు రాజకీయాలకోసం ఎస్సీలను వర్గీకరించాలని ప్రయత్నించడం శోచనీయమని మాలమహానాడు ఏపీ అధ్యక్షుడు జాన్‌పాల్, తెలంగాణ అధ్యక్షుడు గైని గంగారాం విమర్శించారు.



జస్టిస్ కృష్ణమురారికి ప్రసాదాలు అందచేస్తున్న అదనపు ఈవో

## శ్రీవారి సేవలో సుప్రీం న్యాయమూర్తి

తిరుమల, డిసెంబరు 8: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమురారి ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి తిరుమల చేరుకున్న ఆయన ఆదివారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఉదయం వీఐపీ బ్రేక్‌లో మరోసారి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జస్టిస్ కృష్ణమురారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, టీటీడీ అదనపు ఈవో ధర్మారెడ్డి శ్రీవారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందజేశారు.

## తిరుమలేశుని దర్శించుకున్న సీఎస్



నీలం సాహ్నికి శ్రీవారి చిత్రపటం అందచేస్తున్న ధర్మారెడ్డి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఆదివారం తిరుమలేశుని దర్శించుకున్నారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆమె శనివారం రాత్రి తిరుమలకు వచ్చారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం.. టీటీడీ అదనపు ఈవో ధర్మారెడ్డి, ఆగమ సలహాదారు రమణ దీక్షితులు శ్రీవారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, తెలంగాణ బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖా మంత్రి గంగుల కమలాకర్, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, ఏపీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) బీవీ రమణమూర్తి కూడా ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు.

## రేపు రూ.300 టిక్కెట్ల కోటా విడుదల

తిరుమలేశుని దర్శనానికి సంబంధించి 2020 మార్చి నెలకు సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ టిక్కెట్ల కోటాను మంగళవారం విడుదల చేయనున్నారు. వీటిని ఆన్‌లైన్‌లోనూ, ఈ-దర్శన్ కౌంటర్లు, తపాలా కార్యాలయాల్లోనూ ముందుగా బుక్ చేసుకోవచ్చని టీటీడీ ఆదివారం ప్రకటనలో తెలిపింది.

## శ్రీరంగనాథునికి టీటీడీ పట్టువస్త్రాలు



రంగనాథస్వామికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న టీటీడీ చైర్మన్, ఈవో

తమిళనాడులోని శ్రీరంగంలో కొలువుదీరిన రంగనాథస్వామికి టీటీడీ తరపున ఆదివారం పట్టువస్త్రాలు బహూకరించారు. ద్రవిడ సంప్రదాయం ప్రకారం మార్గశిర ఏకాదశిని పురస్కరించుకుని ఏటా టీటీడీ తరపున రంగనాథస్వామికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, అర్చక బృందంతో కలసి రంగనాథస్వామి ఆలయం వద్దకు చేరుకోగా ఆలయ జాయింట్ కమిషనర్ జయరామన్, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈవో, చైర్మన్ పట్టువస్త్రాలు, పూజాసామగ్రిని తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి రంగనాథస్వామికి సమర్పించారు.

## పర్యాటక బోటు ప్రమాదం కేసు

- మరో ఐదుగురిని నిందితులుగా చేర్చిన పోలీసులు

రంపచోడవరం, డిసెంబరు 8: కచ్చులూరు పర్యాటక బోటు మునక కేసులో కాకినాడ పోర్టు అధికారిగా పనిచేసిన శ్రీధర్మశాస్త్రితో పాటు ఐదుగురిని నిందితులుగా చేర్చారు. ఈ ప్రమాదంలో 51 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇంతవరకూ 14 మందిని నిందితులుగా పేర్కొని, ఐదుగురిని అరెస్టు చేశారు. వారికి ఇటీవలే కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ ప్రమాదానికి బోటు నిర్వాహకులు, ట్రావెల్ ఏజెంట్ల నిర్లక్ష్యమే కారణమని దర్యాప్తులో పోలీసులు తొలుత నిర్ధారించారు. వరద సమయంలో బోటును గోదావరిలోకి అనుమతించడం, బోటుకు ఫిట్‌నెస్ ఇవ్వడమే ఈ ప్రమాదానికి కారణమయ్యాయని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. పోర్టు అధికారిగా ఉన్న శ్రీధర్మాశాస్త్రిను ప్రమాదం అనంతరం ప్రభుత్వం మచిలీపట్నానికి బదిలీ చేసింది. ఆయన స్థానంలో పోర్టు అధికారిగా బాధ్యత తీసుకున్న మరో అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా పోలీసులు తదనంతర దర్యాప్తులో శ్రీధర్మశాస్త్రి, పోర్టు కన్జర్వేటర్‌గా పనిచేసిన కేవీఎస్‌ఎస్ రామచంద్రవర్మ, నేవల్ ఆర్కిటెక్ ఏవీ లక్ష్మణరాజు, సర్వేయర్ పి.మురళీకృష్ణ, చీఫ్ సర్వేయర్ కె.రమేష్‌లను కూడా ఈ ఘటనలో నిందితులుగా పేర్కొన్నారు.

## భక్తుల ముందుకు కల్కి దంపతులు

వరదయ్యపాళెం, డిసెంబరు 8: ఎట్టకేలకు కల్కి దంపతులు మళ్లీ భక్తుల ఎదుటకు వచ్చారు. చిత్తూరు జిల్లా వరదయ్యపాళెం మండలం బత్తలావల్లం సమీపంలోని ఏకం ఆధ్యాత్మిక క్షేత్రంలో జరుగుతున్న జీవన్ముక్తి ఉత్సవాల్లో ఆదివారం అమ్మాభగవాన్ దంపతులు భక్తులకు నేరుగా దర్శనమిచ్చారు. కొంతకాలంగా కల్కి భగవాన్ భక్తులకు నేరుగా దర్శనమివ్వడం నిలిపివేశారు. దీనికితోడు ఇటీవల కల్కి ఆశ్రమాలపై ఐటీ శాఖాధికారుల దాడులతో విమర్శలపాలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏకం ఆధ్యాత్మిక కేంద్రంలో ఐదురోజులుగా జరుగుతున్న ముక్తి ఉత్సవాల్లో కల్కి భగవాన్ దంపతులు భక్తులకు నేరుగా దర్శనమివ్వడమే కాకుండా ఆధ్యాత్మిక బోధన చేశారు.

## వైభవంగా అమలోద్భవిమాత ఉత్సవం

జ్ఞానాపురం(విశాఖ సిటీ), డిసెంబరు 8: విశాఖలో అమలోద్భవి మాత (కొండగుడి) ఉత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. ఉత్తకోస్తా జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా కొండగుడికి తరలివచ్చారు. మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. విశాఖ అగ్రపీఠాధిపతి బిషప్ మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో దివ్య పూజాబలి నిర్వహించారు.



మేరీమాతను ఊరేగింపుగా కొండకు తీసుకువస్తున్న భక్తులు

## 'పెళ్లి' చేశారు!



పోలీసుల అదుపులో మోహన్‌కృష్ణ

### పీటలపై వరుడికి దేహశుద్ధి.. ఒకరితో నిశ్చితార్థం, మరొకరితో పెళ్లికి సిద్ధం

- కట్న కానుల పేరిట భారీగా వసూలు
- రెండు పెళ్లిళ్లు రద్దు.. కేసు నమోదు


నంద్యాల (నూనెపల్లె), డిసెంబరు 8: బ్యాంకు ఉద్యోగం, సమాజంలో హోదా. ఓ యువతితో వివాహం నిశ్చయమైంది. బంగారం, డబ్బు రూపంలో ముందుగానే కట్న కానుకలు తీసుకున్నాడు. ఆ తరువాత జాతకాలు కలవడం లేదని చెప్పాడు. తీసుకున్న డబ్బు, బంగారం తిరిగి ఇవ్వకపోగా, మరో యువతితో పెళ్లికి సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న మొదటి యువతి కుటుంబం రంగ ప్రవేశం చేసింది. పీటలపై కూచున్న వరుడికి మరో రకం 'పెళ్లి' చేసింది. అప్పటికే ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కర్నూలు జిల్లా నంద్యాలలో కలకలం రేపింది. తిరుపతిలో ఎస్‌బీఐ మేనేజర్‌గా పనిచేస్తున్న మోహన్ కృష్ణకు ఆరు నెలల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌కు చెందిన ఓ యువతితో పెళ్లి నిశ్చయమైనంది. ఆ సమయంలో రూ.16 లక్షలు, 6 తులాల బంగారం కట్న కానుకల కింద ఇచ్చారు. నిశ్చితార్థం తరువాత జాతకాలు కుదరడం లేదని పెళ్లికి నిరాకరించాడు. దీంతో యువతి తల్లిదండ్రులు డబ్బు, బంగారం వెనక్కు ఇవ్వాలని కోరారు. స్పందించకపోవడంతో తిరుపతి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఇంతలోనే మోహన్ కృష్ణ నంద్యాలకు చెందిన ఓ యువతితో పెళ్లికి సిద్ధమయ్యాడు. ఇక్కడా నిశ్చితార్థం సమయంలో రూ.10 లక్షలు, 12 తులాల బంగారం, రెండు భవనాలను కట్నం కింద తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న మొదటి యువతి కుటుంబ సభ్యులు కర్నూలు ఎస్పీకి, ఆ తర్వాత నంద్యాల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

### సినిమా తరహాలో..

ఈ నేపథ్యంలో నంద్యాల మహానందీశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం మోహన్ కృష్ణ వివాహం జరుగుతుండగా బాధిత కుటుంబం అక్కడికి చేరుకుంది. వధువు తలపై జీలకర్ర బెల్లం పెడుతున్న సమయంలో అడ్డుకుని అతనిపై దాడి చేసి చితకబాదారు. పెళ్లికి వచ్చిన బంధువులు ఏం జరుగుతోందో తెలియక ఎదురుదాడికి యత్నించారు. విషయం తెలిసి ఆందోళనకు గురయ్యారు. సమయానికి అడ్డుకోకపోతే తమ కూతురు జీవితం నాశనం అయ్యేదని వధువు తల్లిదండ్రులు కూడా వారికి మద్దతు పలికారు. ఆ తరువాత రంగప్రవేశం చేసిన పోలీసులు మోహన్ కృష్ణను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దీంతో నంద్యాలకు చెందిన వధువు కుటుంబం పెళ్లి రద్దు చేసుకుంది. నిశ్చితార్థం సమయంలో తీసుకున్న కట్నకానుకలు, బంగారం, ఖర్చు చేసిన డబ్బులు ఇవ్వాలని ఇద్దరు యువతుల బంధువులు డిమాండ్ చేశారు. నంద్యాలలో తమ పరువు పోయిందని అందుకుగాను పరువు నష్టం, తీసుకున్న కట్నకానుకలు కలుపుకొని రూ.30 లక్షలు ఇప్పించాలని రెండో యువతి కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మోహన్ కృష్ణ, ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ కుమార్ తెలిపారు.

### పదేళ్ల క్రితమే మోసాలు

నంద్యాల కెనరా బ్యాంక్‌లో పనిచేస్తున్న సమయంలోనే మోహన్ కృష్ణ అలియాస్ ప్రసాద్ మోసాలకు తెరతీశాడు. 2008లో వ్యాపారం పేరిట నిరుద్యోగులకు గాలం వేశాడు. నంద్యాల కేంద్రంగా ముంబాయి తరహా వ్యాపారానికి శ్రీకారం చుట్టాడు. రూ.400 కట్టితే నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదించవచ్చని డబ్బులు వసూలుచేశాడు. వందల మంది నిరుద్యోగులు రూ.400 చెల్లించారు. ఆ తరువాత మోసపోయామని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి డీఎస్పీ బాలమురళీధర్ కేసు నమోదు చేసి మోహన్‌కృష్ణను అరెస్టు చేశారు. వీటితో పాటు పలు చీటింగ్ కేసులు మోహన్ కృష్ణపై ఉన్నాయని పోలీసులు తెలిపారు.

# 'ఇరవయ్యో శతాబ్దపు ఇతిహాస'కర్తకి జ్ఞానపీఠ్

"పరుల కోసం
నేనొక కన్నీటి బొట్టు రాల్చినప్పుడు
నాలో ఉదయిస్తాయి
వేల వేల సూర్య మండలాలు
పరుల కోసం
నేనొక చిరునవ్వు చిలికితే
నా మదిలో ఊగుతుంది
నిత్య నిర్మల పున్నమి
తెలియలేదిది, ఇన్నాళ్ళు
ఇదే నిత్యానంద రహస్యమని
ఎంత నష్టపోయానో, గుర్తొచ్చి
వెక్కి వెక్కి ఏడుస్తున్నానిప్పుడు"

- 'ఇరవయ్యో శతాబ్దపు ఇతిహాసం' అనే దీర్ఘ కవిత మొదటి పేజీలోనే కవి వ్రాసిన పంక్తులు ఇవి. ఇలాంటి ఒక దృక్పథం కలిగిన కవి మానవత్వానికి పెద్ద పీట వేస్తారననేది ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు కదా. ఈ పంక్తులు వ్రాసినది 2019కి గాను జ్ఞానపీఠ పురస్కారానికి ఎన్నికైన మలయాళ కవి శ్రీ అక్కిత్తం అచ్యుతన్ నంబూదిరి. 1958లో వెలువడిన తన 'ఇరవయ్యో శతాబ్దపు ఇతిహాసం' (ఇరుపతాం నూటాంటిన్టే ఇతిహాసం) దీర్ఘ కవిత ప్రారంభంలో ఈ పంక్తులు వ్రాసారు. (ఈ పుస్తకానికి నా తెలుగు అనువాదం 2008లో ప్రచురితమైంది.)

18-3-1926లో సంప్రదాయబద్ధమైన ఒక నంబూదిరి కుటుంబంలో జన్మించారు అక్కిత్తం. అలనాటి సమాజంలో వీచిన సాంస్కృతిక సామాజిక పునరుజ్జీవపు గాలి అగ్రకులస్తులూ, భూస్వాములు అయిన నంబూదిరి సమాజాన్ని కుదిపి వేసింది. ఎన్నో కుటుంబాలను అభ్యుదయంవైపు నడిపించింది. ఆ కాలంలోనే కవిత్వం వ్రాయడం ప్రారంభించారు అక్కిత్తం. మనసులో అంకురించిన హేతువాదం, సమాజం లోని కొన్నిటిని ప్రశ్నించడానికి ప్రేరణ ఇచ్చింది. కానీ పుట్టుక వల్ల సంక్రమించిన అనుభవాలు, సంప్రదాయాలు, తమను అనుసరించమని హెచ్చరించాయి. తీవ్ర సంఘర్షణకి గురైంది అతని మనసు. తొలి దశలో వ్రాసిన 'బ్రహ్మ సూత్రం' మొదలగు కవితల్లో ఈ సంఘర్షణ కనబడుతుంది. తరువాత కాలంలో, జరిగిన వర్గపోరాటాలు తెచ్చిపెట్టిన హింస వల్ల విసుగుచెంది మనసు విరిగి నిష్కల్మష స్నేహపుబాటవైపు అడుగులు వేసాడు కవి. అప్పుడే ఇరవయ్యో శతాబ్దపు ఇతిహాసం అనే దీర్ఘ కవిత వ్రాసాడు.

ఇంచుమించు 55 పుస్తకాలు రచించారు ఈ కవి. వాట్లో కొన్ని బాల సాహిత్యానికి చెందినవి; మరి కొన్ని అనువాదాలు. మిగతా సంపుటాలన్నీ కవిత్వమే. 'బలిదర్శనం' (1973) గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం అందుకున్నారు. 'బలిదర్శనం', 'ఇరవయ్యో శతాబ్దపు ఇతిహాసం', 'నిమిష క్షేత్రం', 'ఎంపిక చేసిన కవితలు', 'ముత్యపు స్పర్శ', 'మానస పూజ', 'అమృత ఘటిక', 'గాజుల గలగలలు', 'పంచవర్ణ చిలకలు' మొదలైనవి అక్కిత్తం ముఖ్య రచనల్లో కొన్ని. అంతేకాక శ్రీమద్ భాగవతానికి మలయాళ అనువాదం కూడా రచించారు ఈ కవి .

చేసిన తప్పు చెబితే పోతుంది కదా అనేది సామెత. అక్కిత్తం దీర్ఘకవిత 'ఇరవయ్యో శతాబ్దపు ఇతిహాసం' చేసిన పని ఇదే. ఇది ఒక నేర సమ్మత పత్రం (confessional statement). తొలి దశలో అభ్యుదయం వైపు నిలబడిన ఈ కవి తరువాతి కాలంలో రాజకీయ రంగంలో జరిగిన హింసాపరమైన అతిపోకడల వల్ల విసుగుచెంది వాటిని ఖండిస్తూ, మానవత్వాన్ని వెలిగించమని కోరి వ్రాసిన దీర్ఘ కవిత ఈ పుస్తకం.



చేసినతప్పు చెబితే పోతుంది కదా అనేది సామెత. అక్కిత్తం దీర్ఘ కవిత 'ఇరవయ్యో శతాబ్దపు ఇతిహాసం' చేసిన పని ఇదే. ఇది ఒక నేర సమ్మత పత్రం (confessional statement). తొలి దశలో అభ్యుదయం వైపు నిలబడిన ఈ కవి తరువాతి కాలంలో రాజకీయ రంగంలో జరిగిన హింసాపరమైన అతిపోకడల వల్ల విసుగు చెంది వాటిని ఖండిస్తూ, మానవత్వాన్ని వెలిగించమని కోరి వ్రాసిన దీర్ఘ కవిత ఈ పుస్తకం.

"జీవన ప్రేమా!
నీ శిలువ గాయమై నా గుండె నుంచి
పశ్చాత్తాప భావనల నెత్తురు పారుతోంది
గుండెలోని నరాలు
అలసిపోతున్నాయి పూర్తిగా"

- అంటారు ఈ పుస్తకంలో.

జీవిత వాస్తవికతలను, వాటి భయంకరమూ జుగుప్సాకరమూ అయిన రీతిలోనే ఆవిష్కరించడంకోసం, గగురుపుట్టించే ప్రతీకలను వాడడానికి కూడా అసలు సందేహించరు ఈ కవి. ఉదాహరణకి: "కాకి చీలుస్తుంది రోడ్డుపైన/ చచ్చినదాని కనుపాపలు/ రొమ్ము పీకుతోంది చనుబాలు కోసం/ నర వర్గ నవాతిథి" అనే పంక్తి చూడండి. మలయాళ సాహిత్యంలోనేకాక మలయాళీల గుండెల్లో కూడా నిలిచిపోయిన: "వెలుగు దుఃఖమే బాబు/ చీకటేగా సుఖప్రథం" అనే పంక్తి వ్రాసింది కూడా ఈ కవియే.

సమకాలీన సమాజంలోని విలువల పతనం గురించి తిరువోనం (మలయాళీల ఓనం పండుగ) గురించిన పురావృత్తాన్ని నేపథ్యంగా తీసుకొని రచించిన కావ్యం 'బలిదర్శనం'. ఈ పుస్తకానికే కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. తన కవిత్వం గురించి అక్కిత్తం ఇలా అన్నారు:

" 'మనిషి అవగాహనతో అందుకునే దానికన్నా ఉన్నతంగా ఉండాలి అతని సాధనా ప్రయాస' అని అన్నాడు రాబర్ట్ బ్రౌనింగ్. అయితే నా సాధనా యత్నాలు నా అవగాహనా పరిధిని అధిగమించి ఎదిగాయా లేవా అని అడిగితే నేను చెప్పలేను. కానీ స్వర్గం మాట అంటారా- నేను దాన్ని నా రచనలో అనుభవించగలిగాను. నా జీవితం, కవిత్వం విడతీయరానిది. నేనేం చేస్తానో అదే వ్రాస్తాను; ఏం వ్రాస్తానో అదే చేస్తాను. నా జీవితాన్ని నా కవిత్వంలో చదవవచ్చు. నా ఏడున్నరేళ్ళ వయస్సులోనే సంస్కృతం, జ్యోతిశ్శాస్త్రం, ఋగ్వేదం వగైరాలు నేర్చుకోనారంభించాను. ఋగ్వేదం చివరలో 'సంపద సూక్తం' అనే సూక్తం ఒకటి వుంది. అందులో సమానం అనే మాట పది సార్లకు పైగా పునరావృతమవుతుంది. అప్పట్లో, మహాకవి వల్లథోల్ చేసిన ఋగ్వేద మలయాళ అనువాదం, ఆ సూక్తం తాలూకు అర్థమేమిటో విపులంగా తెలుసుకోవడానికి ఉపయోగపడింది. ఈ నేపథ్యంలో, ఇ.ఎం.ఎస్. వ్రాసిన 'సోషలిజం ఎందుకు', సి. అచ్యుత మీనోన్ వ్రాసిన 'సోవియట్ నాడు', వెండెల్ విల్కీ వ్రాసిన 'ఒకే ప్రపంచం' మొదలగు గ్రంథాలు నా సామాజిక దృక్పథాన్ని విస్తృత పర్చుకోవడంలో, జీవితాన్ని దర్శించే పద్ధతిని ఏర్పరుచుకోవడంలో తోడ్పడ్డాయి. ఈ రచనలు నన్ను కార్ల్‌మార్క్స్ కృషి వైపు నడిపించాయి. ఆయన వ్రాసింది నన్ను ఎక్కువగా ఆకట్టుకుంది. క్లుప్తంగా చెప్పాలంటే సంపద సూక్తమే సామ్యవాదాన్ని ప్రవచించిన మొదటి రచనయని నా నమ్మకం. సమస్త ప్రాణకోటి సమానులే అనే భారతీయ వేదదర్శనంతో మార్క్స్‌కి పరిచయం వున్నట్లు ఎటువంటి దాఖలాలూ లేవు. అయినా, మన సూక్తి దర్శమైన వసుధైక కుటుంబమనే భావాన్ని తన చింతనలో మిళితం చేసుకున్నాడు. కాలగమనంలో ఏ ప్రభుత్వాలూ పరిపాలించనవసరం లేని ఒక సమాజం ఏర్పడుతుందనే ఆలోచన అతనిది. తమని తామే పరిపాలించుకోగలిగిన క్రమశిక్షణ, సన్నద్ధత కలిగి, భారతీయ పురాచింతన నిర్వచించిన దైవత్వ దశకి చేరుకుంటారు జనం. అరబిందో దృక్కోణం వంటిదే మార్క్స్‌ది కూడా. జ్ఞానపరమైన, భౌతికపరమైన, మానసికమైన, శారీరకమైన, ఆధ్యాత్మికమైన దర్శనాల మధ్య ఎటువంటి తేడానూ ఏనాడూ నేను గుర్తించలేదు. రాజకీయం కులం మతం వగైరాలేవీ నా మానవ దృక్పథాన్ని ప్రభావితం చేయవు" అని చెప్తున్నారు అక్కిత్తం. ఈ కవిని జ్ఞానపీఠ పురస్కారం వరించడం సాహిత్య ప్రపంచానికి ఎంతో ఆనందదాయకం.

■ ఎల్. ఆర్. స్వామి
99490 75859

---

### 'అక్కన్నపేట రైల్వే స్టేషన్' కథా సంపుటి

ఎం. అయోధ్యారెడ్డి కథా సంపుటి 'అక్కన్నపేట రైల్వేస్టేషన్' ఆవిష్కరణ సభ డిసెంబర్ 9 సా.5.30ని.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. కె.శివారెడ్డి, నందిని సిధారెడ్డి, మామిడి హరికృష్ణ, ఆడెపు లక్ష్మీపతి, కస్తూరి మురళీకృష్ణ, ఏనుగు నరసింహారెడ్డి పాల్గొంటారు.

**మంజీరా రచయితల సంఘం**

### 'నవలా స్రవంతి' కార్యక్రమంలో 'కొమురం భీము' నవలపై ప్రసంగం

తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'నవలా స్రవంతి'లో భాగంగా డిసెంబర్ 13 సా.6గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సాహు, అల్లం రాజయ్యల 'కొమురం భీము' నవలపై కాత్యాయని విద్మహే ప్రసంగం నందిని సిధారెడ్డి అధ్యక్షతన ఉంటుంది.

**ఏనుగు నరసింహారెడ్డి**

### ఆటా సాహితీ సదస్సు

అమెరికా తెలుగు సంఘం 'ఆటా' ఆధ్వర్యంలో సాహితీ సదస్సు డిసెంబర్ 14 ఉ.9గం.ల. నుంచి తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముందు తరాలతో సంభాషణ కార్యక్రమంలో కె.శివారెడ్డి, నందిని సిధారెడ్డి, రాచపాళెం, కె.శ్రీనివాస్, ఓల్గా, అఫ్సర్, కసిరెడ్డి వెంకటరెడ్డి; ఇప్పటి కథకుల ఆలోచనలు, అనుభవాలు కార్యక్రమంలో కె.ఎన్.మల్లీశ్వరి, వెల్దండి శ్రీధర్, పూడూరి రాజిరెడ్డి, వెంకట సిద్ధారెడ్డి, మల్లికార్జున్, పూర్ణిమ తమ్మిరెడ్డి, స్వాతి కుమారి బండ్లమూడి పాల్గొంటారు. 12 మంది కొత్త తరం కవులతో కవి సమ్మేళనం; దేశపతి శ్రీనివాస్, చంద్రబోస్, గోరటి వెంకన్న, అనంత శ్రీరామ్, సిరాశ్రీ, శ్రేష్ఠ, ప్రొద్దుటూరి యెల్లారెడ్డి పాల్గొనే 'పద్యం, పాట, జానపదం' కార్యక్రమాలు కూడా ఉంటాయి.

**రవీందర్ వీరెల్లి**

### 'భలే మంచిరోజు' న్యూమరిక్కులు

రమణ యశస్వి 'భలే మంచి రోజు' న్యూమరిక్కుల సంపుటి ఆవిష్కరణ సభ డిసెంబర్ 14 ఉ.10.30 గం.లకు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని 'ఎం' గ్రాండ్ గెస్ట్‌హౌస్‌లో జరుగుతుంది. కొలకలూరి ఇనాక్, కోన రఘుపతి, బిక్కి కృష్ణ, శ్రీరామకవచం సాగర్ తదితరులు పాల్గొంటారు.

**కలిమిశ్రీ**

### 'కలలసౌధం' కథా సంపుటి

యం. బాలగంగాధరయ్య 'కలల సౌధం' కథా సంపుటిని డిసెంబర్ 14న హైదరాబాద్‌లోని కళాసుబ్బారావు కళావేదికలో జరుగుతుంది. కొలకలూరి ఇనాక్, గుదిబండి వెంకటరెడ్డి తదితరులు పాల్గొంటారు.

**పొత్తూరి సుబ్బారావు**

### నెలనెలా వెన్నెల

'నెలనెలా వెన్నెల' సాహిత్య కార్యక్రమం డిసెంబర్ 14 సా.5గం.లకు ఎన్.బి.టి.హాల్, ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్‌లో జరుగుతుంది. రచనలు వినిపించటానికి కవులు, రచయితలకు ఆహ్వానం.

**ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్**

### 'పదహారు గడ్డిపోచలు'

స్వాతి కుమారి బండ్లమూడి రచన 'పదహారు గడ్డిపోచలు' ఆవిష్కరణ సభ ఛాయా ఆధ్వర్యంలో డిసెంబర్ 14 సా.6గం.లకు హైదరాబాద్ స్టడీ సర్కిల్ దోమల్‌గూడాలో జరుగుతుంది. వక్తలుగా: అఫ్సర్, సింధుమాధురి మన్నెం, రవీందర్ వీరెల్లి, ప్రసూన రవీంద్రన్, శ్రీరామ్ పుప్పాల పాల్గొంటారు. నిర్వహణ అనిల్ డ్యాని.

**ఛాయా రిసోర్స్ సెంటర్**

### 'అదే నేల' పరిచయ సభ

ముకుంద రామారావు చేసిన భిన్న భారతీయ భాషల కవిత్వానువాదాల సంకలనం 'అదే నేల - భారతీయ కవిత్వం - నేపథ్యం' పుస్తక పరిచయ సభ ఛాయా ఆధ్వర్యంలో డిసెంబర్ 15 సా.6గం.లకు హైదరాబాద్ స్టడీ సర్కిల్ దోమల్‌గూడాలో జరుగుతుంది.

**కృష్ణ మోహన్ బాబు**

### రెంటాల గోపాలకృష్ణ శత జయంతి

ప్రముఖ రచయిత - జర్నలిస్టు రెంటాల గోపాలకృష్ణ (1920-1995) శతజయంతి ప్రారంభ సభ డిసెంబర్ 15 ఉ.10.30గం.లకు హైదరాబాద్ స్టడీసర్కిల్, దోమల్‌గుడాలో జరుగుతుంది. తెలకపల్లి రవి, బి. నరసింగరావు, కె. శ్రీనివాస్, అఫ్సర్, కె.పి. అశోక్ కుమార్, ఆదిత్య కొర్రపాటి పాల్గొంటారు.

**రెంటాల స్మరణోత్సవ సంఘం**

### రామా చంద్రమౌళి సాహిత్య పురస్కారం

'రామా చంద్రమౌళి సాహిత్య పురస్కారం 2019'ను కవిత్వానికి జూకంటి జగన్నాథం స్వీకరిస్తారు. పురస్కార ప్రదాన సభ డిసెంబర్ 15 ఉ.10.30గం.లకు హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పిజీ కాలేజ్‌లో జరుగుతుంది. గ్రహీతకు రూ.15వేల నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కారం ఉంటుంది. బి.ఎస్. రాములు, అంపశయ్య నవీన్, నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా రామా చంద్రమౌళి మూడు పుస్తకాల ఆవిష్కరణ కూడా ఉంటుంది.

**కె. పురుషోత్తం**

---

# మన కాలపు ప్రతిఘాత పాట!

పాటకు ప్రతిఘాత స్వభావం వుంటుందా? వుంటుంది. ఎలా? అది సామాజిక మార్పులను స్వాగతించకుండా పాత వ్యవస్థని కీర్తించినప్పుడు ప్రతిఘాత స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. సహజంగానే ఫ్యూడల్ భావజాలం మార్పును స్వాగతించదు. పాత వ్యవస్థనే కీర్తించి, పాడుతుంది. ఈ ఫ్యూడల్ వ్యవస్థ వల్ల లాభపడిన శక్తులు, వ్యక్తులు దాన్ని కీర్తించడంలో అర్థముంది. కాని ఫ్యూడల్ కులవ్యవస్థ వల్ల, దాని భావజాలం వల్ల దోపిడికి గురైన సమూహాల నుండి వచ్చిన వ్యక్తులు ఆ వ్యవస్థ ధ్వంసాన్ని శ్లాఘించడం ఏ యిజంలోకి వస్తుందో వారికే తెలియాలి. గోరటి వెంకన్న 'పల్లెకన్నీరు పెడుతుందో' అనే పాట కూడా ఈ కోవలోకే వస్తుంది. గోరటి వెంకన్న సాహిత్యాన్ని ప్రముఖ తెలుగు స్కాలర్, కోయి కోటేశ్వరరావు గొప్పగా శ్లాఘిస్తూ విశ్లేషణ చేశారు (వివిధ: 4 నవంబర్ 2019). ఈ ఇరువురు కూడా హిందూ మత కుల భూస్వామ్యానికి బలైన వర్గాల నుండి వచ్చినవారే. కోయి కోటేశ్వరరావుకు మంచి పరిశోధకుడిగా పేరుంది. కాని ఆయన వెంకన్న పాటని విశ్లేషించిన తీరు మాత్రం సామాజిక చలన సూత్రాలకు విరుద్ధంగా వుంది.

ఆయన విశ్లేషణలో ఈనాడు "వెల్లువెత్తుతున్న ప్రపంచీకరణ ప్రభావానికి ప్రత్యామ్నాయంగా దేశీయ సంస్కారాన్ని, గ్రామీణ సాంస్కృతిక గరిమను వేయి గొంతుకలతో" గోరటి వెంకన్న చాటి చెప్పినట్లు రాశారు. ఆయనకు భారతీయ గ్రామీణ జీవన విధానం తెలిసే ఇది రాశారా? భారతీయ గ్రామీణ స్వభావం మీద జాతీయోద్యమ కాలంలో రెండు స్రవంతులుగా చర్చ నడిచింది. గాంధీజీ "భారతీయ పల్లెలే అభివృద్ధికి పట్టుకొమ్మల"ని భావించారు. కాని అంబేడ్కర్ మాత్రం హిందూ మత ధర్మాన్ని నిరంకుశంగా ఆచరించే ప్రాంతాలుగా గ్రామాలను వర్ణించాడు. అంతేకాకుండా, బాహ్య ప్రపంచంతో సంబంధంలేని విధంగా అత్యంత ఒంటరితనంతో ఈ గ్రామాలు వుంటాయని, వాటిపై ఆరాధన అనేది అనవసరమని కూడా భావించాడు. కుల అసమానతలకు, అన్యాయాలకు పునాదిగా నిలుస్తున్న ఈ భారతీయ గ్రామాల పతనాన్ని అంబేడ్కర్ కోరుకున్నారు. మార్క్స్ కూడా భారత గ్రామీణ వ్యవస్థ అనేది ధ్వంసం కాక తప్పదు అని చాలా సందర్భాలలో రాశారు. మరి ఈ గ్రామీణ విధ్వంసం గురించా "మన కాలపు వైతాళికుడు" కన్నీరు కారుస్తారు? పైగా కోటేశ్వరరావుగా ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయంగా దేశీయ సంస్కారాన్ని గోరటి వెంకన్న వెయ్యి గొంతుకలతో చాటి చెప్పాడని రాశారు. ప్రపంచీకరణకు బ్రాహ్మణీయ ఫ్యూడల్ కుల సంస్కృతి ప్రత్యామ్నాయం అవుతుందా? ఇది సామాజిక చలన గతితార్కిక నియమమేనా? ఏ అంబేద్కరిస్టు లేదా మార్క్సిస్టు దీన్ని సమర్థిస్తాడా? అనేదాన్ని పరిశీలించుకోవాలి.



గోరటి వెంకన్న సాహిత్యాన్ని ప్రముఖ తెలుగు స్కాలర్ కోయి కోటేశ్వరరావు గొప్పగా శ్లాఘిస్తూ విశ్లేషణ చేశారు. ఈ ఇరువురు కూడా హిందూ మత కుల భూస్వామ్యానికి బలైన వర్గాల నుండి వచ్చినవారే. కోయి కోటేశ్వరరావుకు మంచి పరిశోధకుడిగా పేరుంది. కాని ఆయన వెంకన్న పాటని విశ్లేషించిన తీరు మాత్రం సామాజిక చలన సూత్రాలకు విరుద్ధం.

మార్క్స్ 1853లో "బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా" అనే వ్యాసంలో ఇలా అంటాడు: "భారత ఉపఖండంలో జరిగిన అన్ని పౌర యుద్ధాలు, దండయాత్రలు, కరువు కాటకాలు, స్వయంపోషక గ్రామీణ వ్యవస్థను మార్చలేకపోయాయి. కాని బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన ఆవిరి ఇంజన్, స్వేచ్ఛా వ్యాపార విధానాలు అర్ధ - అనాగరిక సంఘాల ఆర్థిక పునాదులను ధ్వంసం చేసాయి. నిజం చెప్పాల్సివస్తే ఆసియా ఖండం తన మనుగడ అంతటిలోను ఎరిగిన ఏకైక సామాజిక విప్లవాన్ని అవి తీసుకొచ్చాయి." అంటే ఏమిటన్నమాట- మనువాదం సృష్టించిన వారసత్వ కులవృత్తులు ధ్వంసం కావటాన్ని మార్క్స్ విప్లవ చర్యగా భావిస్తున్నారు. ఇది భారతదేశ పరిణామ దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ తీసుకొచ్చిన గొప్ప మార్పు. ఈ పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం నుండి నేటి ద్రవ్య పెట్టుబడిదారీ విధానంతో ఈ మార్పులలో వేగం పెరిగింది. 3 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భారతీయ గ్రామీణ కులవ్యవస్థ ధ్వంసమయ్యే ప్రక్రియకు 300 సంవత్సరాలు కూడా నిండలేదు. పెట్టుబడి నిర్వర్తించాల్సిన కర్తవ్యం ఇంకా వుంది. కాబట్టి బహుజనులు 3 వేల సంవత్సరాలుగా ఇంకా కొనసాగుతున్న బ్రాహ్మణీయ కులవ్యవస్థ గురించే ఆందోళన చెందాలి. దాని మరణాన్ని శ్లాఘిస్తూ పాటలు రాయాలి, పాడాలి. బ్రాహ్మణీయ కుల భూస్వామ్య వ్యవస్థ మరణాన్ని లిఖించడంలో పెట్టుబడి అద్భుతమైన పాత్ర నిర్వహిస్తుందని మార్క్స్ చెప్పే వున్నాడు.


అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతా మంచే జరుగుతుందని చెప్పడం లేదు. ఈ వ్యవస్థలో బహుజనులకు ఉండవలసిన ప్రజాస్వామిక హక్కుల గురించి రాజకీయ పోరాటాలు చేయాలి. బ్రాహ్మణిజం, పెట్టుబడిదారీ విధానం రెండూ శత్రువులే అన్న అంబేడ్కర్ దృక్పథం ప్రస్తుత పరిస్థితులలో సరైనది కాదు. ప్రస్తుత లక్ష్యం మూడు వేల ఏళ్ళ బ్రాహ్మణీయ వారసత్వ కులవ్యవస్థను నిర్మూలించడమే అయి వుండాలి. మనం ద్రవ్య పెట్టుబడిదారీ వ్యవస్థలో వున్నాం. ఈ పెట్టుబడిని మరింతగా పెంచేందుకు ప్రధాని మోదీ కాలికి బలపం కట్టుకుని ప్రపంచమంతా చుట్టేస్తున్నాడు. ఈ పెట్టుబడి ఇంకా మిగిలివున్న ఫ్యూడల్ ఉత్పత్తి శక్తులను ధ్వంసం చేసి తీరాల్సి వుంది. అంటే కోయి కోటేశ్వరరావు పేర్కొన్న నా ఊరు, నా ప్రాంతం, నా సంస్కృతి, నా భాష, నా కులం, (ఇది నామాట) అనే సెంటిమెంటల్స్ అన్నిటినీ ధ్వసం చేయాల్సి వుంది. ఈ అడ్డుగోడలను తుదముట్టించి జాషువా కలలు గన్న విశ్వమానవున్ని అది తయారుచేసి తీరుతుంది. అప్పుడే ప్రపంచ కార్మికులారా ఏకంకండనే మార్క్స్ సూత్రీకరణకు మార్గం సుగమం అవుతుంది.

మనం బ్రాహ్మణవాది అనుకుంటున్న మోదీ నూతన పెట్టుబడిదారీ ఉత్పత్తి శక్తులను పెంచే పనులు చేయటం వల్ల వారసత్వ కులవృత్తులు ధ్వసం అవుతుంటే- మార్క్స్‌వాదులు, అంబేద్కర్‌వాదులు మనువాదులుగా మారిపోయి- చాకలిపొయ్యిలు కూలిపోతున్నాయని, మాదిగడప్పు పగిలిపోతుందని, మనిషి మాయమైపోతున్నాడని కన్నీరు కార్చడం మనకాలపు వైపరీత్యం. పూర్వకాలమే బాగుందనే సెంటిమెంట్లు వదిలి భవిష్యత్తు గతంకంటే మెరుగ్గా వుంటుందనే సామాజిక గతితార్కిక నియమాలను అర్థం చేసుకోవాలి.

■ పట్టా వెంకటేశ్వర్లు
99596 49097

---

## రాయబారం



పగిలిన అద్దంలో కూడా ముక్కలు ముక్కలవ్వడాన్ని చూసి
దుఃఖపు వాన యింకలేని చాలీ చాలని ఇరుకు నేలైపోయావు
నువ్వాళ్ళ కోసం పస్తుండి, నిద్ర కాచి, అంటు తెగి మూలుగుతున్న
పచ్చటి బతుకు కలల్నేగా రాశావు

నీ కారణం నీకుంది
ఉన్నట్టుండేం జరగలేదు, ఉబుసుపోక్కూడా కాదు
భగవద్గీత వేరు, బైబిల్లానూ లేదు; అస్సలు నీకూపిరాళ్ళేదు
నువ్వో రాముణ్ణి కాదన్న వాడి వనవాసాన్ని చూసి
మరో వాల్మీకిలానే రాశావు; నీది మాత్రం రామాయణమెందుక్కాదు?
కిరాతుడి మూక బాణం తగిలి, నాన్న పోయాక
అమ్మ భోరు భోరున ఏడ్చినప్పుడే కదా రాశావు.

నీ బాధ్యత నీకుంది
దేశమేదైనా నీకు ప్రజలక్కడి అక్షరాల్లో దేవుళ్ళలా కనబడతారు
వాద్యాల్లోకి, వర్ణ చిత్రాల్లోకి, తెరమీది పాత్రల్లోకి
అలవోగ్గా జొరబడతారు
యుద్ధ హెచ్చరికైనా, ప్రణయ సందేశమైనా,
వాళ్ళ నిశ్శబ్దానికి రెక్కలు తొడిగి కాలాన్ని
స్వేచ్ఛగా ఎగరాలనే కదా రాశావు

నీ నమ్మకం నీకుంది
గుండె సిరాతో రాసిందెప్పుడూ తేలిగ్గా ఆరిపోదు
రాజద్రోహమనిపించుకునేంత నేరం చెయ్యడం సులువు కాదు
ఇప్పుడు నిజం మాట్లాడేవాళ్ళందర్నీ నేరస్థులేనంటున్నారు
నువ్వా నిజ పాదాలకి, ముందుగా నమస్కరించే కదా రాశావు

నేనింకేం మాట్లాడ్డానికైనా భయపడదల్చుకోలేదు
సంకెళ్ళతో నిల్చున్నవాళ్ళ వైపుకెళ్ళి నన్నొక వాగ్దానం చేసిరమ్మనే కదా
కన్నీళ్ళు దోసిలిపట్టి రాశావు

నువ్వొక ఉత్తరమే కదా రాశావు,
ఉభయకుశలోపరి అని కాకుండా
ఉరిబిగుసుకుంటోన్న పాట గొంతులోంచి
నొప్పి సలుపుతోన్న గాయం నిప్పుల పొయ్యిలోంచి
ఎర్రగా కాలి కాలి నల్ల బడ్డ కచికల్నేరుకునే కదా రాశావు

నీ రక్త సంబంధం నీకుంది
వాళ్ళింకా సాలెగూట్లోనే చిక్కుకోడాన్ని చూసి,


■ శ్రీరామ్
99634 82597

---

## "కథకుడికి దృక్పథం లేకపోతే చీకటిలో ప్రయాణిస్తాడు. అనుభవం లేకపోతే చీకటికి వెలుతురుకి తేడా తెలుసుకోలేడు."

పలకరింపు

ఉణుదుర్తి సుధాకర్



**రాయడం మొదలుపెట్టి చాన్నాళ్ళయినా చాలా ఆలస్యంగా మీ కథా సంపుటి 'ఈస్తటిక్ స్పేస్' వచ్చింది. ఎందుకీ ఆలస్యం? ఈ టైటిల్ కథలో 'ఈస్తటిక్ స్పేస్' అంటే ఏమిటి?**

నా పుస్తకం ఆలస్యంగా ప్రచురణ కావడానికి రెండు కారణాలు- ఒకటి పుస్తకానికి సరిపడా కథలు ఇంత కాలం లేకపోవడం, మరోటి కథలే ఒకదాని తరవాత ఒకటి ఆలస్యంగా రాయడం. అందరూ సాధారణంగా గమనించని, మరుగునపడిన, నాకు చాలెంజ్‌గా అనిపించిన విషయాలను కథావస్తువులుగా స్వీకరించడం. బహుశా కథ రాస్తే కథ గాని, నేను గాని పాఠకులకు గుర్తు ఉండిపోవాలనే స్వార్థం ఇందుకు కారణం అనుకుంటాను.

ఇద్దరు స్త్రీ పురుషులు ఇష్టంతో పాల్గొనేది శృంగారం అయితే, ఇద్దరిలో ఒక్కరి కోరిక మాత్రమే నెరవేరడం సెక్స్ అని నా భావన. శృంగారం అనేది రసభరితమైన అనుభవాన్ని ఇచ్చే చర్య. ఆ అనుభవం మనిషి అంతరాళంలో ఒక సౌందర్యాత్మక భావనగా స్థిరపడుతుంది. దీనినే నేను ఈస్తటిక్ స్పేస్ అని ప్రతిపాదించాను. పుస్తకానికి అదే టైటిల్ పెట్టాను.

స్త్రీలపై లైంగిక దాడులకు పాల్పడే కామోద్దీపన చర్యతాలూకు అనుభవం పేలవమైనదనీ, పరస్పర ఇష్టంతో సాగే శృంగారం అనుభవమైతే దానిని ఈస్తటిక్ స్పేస్‌లో దాచుకుని, ఎడబాటు కాలంలో పురుషుడు నేర చర్యలకు పాలు పడకుండా ఆవు గడ్డితిని తిరిగి నెమరు వేసుకున్నట్టు ఆ జ్ఞాపకాలతో జీవించడం ఒక పరిష్కారంగా ఈ కథ నేను రాశాను. ఎందుకంటే అందరికీ అన్నివేళలా శృంగారపు తాదాత్మ్యత, లేదా కోరిక తీరడం గాని సాధ్యం కాదు కాబట్టి.

**తొలిరోజుల్లో విరసంలో ఉన్నారు. కథలు రాయడం మొదటి నుంచి ఇప్పటిదాకా పోల్చి చూసుకుంటే మీలో భావజాలపరమైన మార్పు ఏమన్నా వచ్చిందా?**

విరసంలో నేను దశాబ్దం పైగా ఉన్నాను. సమాజం అనేది పట్టించుకోదగినది అని, దానిని మనం పట్టించుకోకపోయినా అది మనల్ని పట్టించుకుని తన దారిన ప్రతివారిని లాక్కునిపోతుందని, ఇంకా సమాజ గమనాన్ని నిర్దేశించడంలో వ్యక్తి చైతన్యం పాత్ర కూడా అనివార్యం అని నేను విరసం ద్వారా నేర్చుకున్నాను. అయితే కాలక్రమంలో సంస్థ నాయకత్వంలోని వ్యక్తులు అంతగా సమాజం పట్ల పట్టింపుని ఆచరణలో కనపరచడం లేదని, ఆచరణలో చాలా క్యాజువల్‌గా ఉన్నారని గ్రహించాక బయటకు వచ్చేసాను. స్త్రీ దళిత ఉద్యమాల పట్ల చాల మమేకం కలిగి ఉండి రచనలు చేశాను. కాలక్రమంలో ఈ ఉద్యమాలపై నా అభిప్రాయాలు మారాయనడం నిజం. ఆత్మాభిమానం, వ్యక్తిత్వం పక్కకిపోయి పురుష ద్వేషం, లైంగికస్పృహ అనే విషయాల చుట్టూ స్త్రీవాద కథలు తిరగడం మొదలయ్యాక స్త్రీవాదం మీద ఆసక్తిపోయింది. లైంగిక అవసరం, లైంగిక హక్కు, లైంగిక స్వేచ్ఛ, లైంగిక విశృంఖలత అనే తేడాలను నిర్వచించుకోకపోవడంతోనే అవి ఆగిపోయాయని నా ఉద్దేశ్యం.

ఇద్దరు స్త్రీ పురుషులు ఇష్టంతో పాల్గొనేది శృంగారం అయితే, ఇద్దరిలో ఒక్కరి కోరిక మాత్రమే నెరవేరడం సెక్స్ అని నా భావన. శృంగారం అనేది రసభరితమైన అనుభవాన్ని ఇచ్చే చర్య. ఆ అనుభవం మనిషి అంతరాళంలో ఒక సౌందర్యాత్మక భావనగా స్థిరపడుతుంది. దీనినే నేను ఈస్తటిక్ స్పేస్ అని ప్రతిపాదించాను. పుస్తకానికి అదే టైటిల్ పెట్టాను.

దళిత ఉద్యమాలు కూడా తమమధ్య ఉన్న అంతరాలను ఇంకా కొనసాగించుకోవడం, ఇంకా చెప్పాలంటే అసలు ఆ సమస్య ఉన్నట్టే గమనించుకోకపోవడం వల్ల ఆయా ఉద్యమాలపై నా పరిశీలన మరింత పెరిగింది. దళిత స్త్రీవాద కథలు ఇంతకుముందు రాసినా ఈ మారుతున్న అనుభవాలతో రాయడం మరింత సంక్లిష్టం అయ్యింది.

**కథకుడికి దృక్పథం ముఖ్యమా, లేక అనుభవం ముఖ్యమా?**

కథకుడికి దృక్పథం లేకపోతే చీకటిలో ప్రయాణిస్తాడు. అనుభవం లేకపోతే చీకటికి వెలుతురుకి తేడా తెలుసుకోలేడు. ■

సెలబ్ ఫిట్



# 'స్క్వేర్ డాన్సింగ్'తో...

**సెలబ్రిటీ ఫిట్‌నెస్ అనగానే, సుస్మితా సేన్, కరీనా కపూర్‌లు గుర్తుకొచ్చేవారు. కానీ ఇప్పుడు వారి స్థానాన్ని దిశా పఠానీ ఆక్రమించింది. కెరీర్ ప్రారంభం నుంచే ఫిట్‌నెస్‌ను నియమానుసారం అనుసరిస్తున్న దిశా 'ఆకర్షణీయమైన తన రూపానికి క్రమం తప్పని వ్యాయామమే కారణం' అంటోంది!**

నా వ్యాయామంలో డాన్స్, ఈత, వెయిట్ ట్రైనింగ్, యోగా ఉంటాయి. నా ఫిట్‌నెస్‌లో డాన్స్‌ది ప్రధాన పాత్ర అనే చెప్పాలి. 'కుంగ్ ఫు యోగా' సినిమాలో జాకీ చాన్ సరసన నటించే సమయంలో, 'స్క్వేర్ డాన్సింగ్' కొత్త నాట్యం నేర్చుకున్నాను. ఆ నాట్యం చేస్తే మనసు తేలికవడంతో పాటు, శరీరానికి చక్కని వ్యాయామం కూడా అందుతుంది. పైగా ఆ డాన్స్ చేయడం సరదాగానూ ఉండడం నేను గమనించాను. దాంతో ఈ డాన్స్‌ను కూడా నా ఫిట్‌నెస్ ప్రక్రియకు జోడించాను.

**జిమ్నాస్ట్‌ను కూడా!**

నేను సుశిక్షుతురాలినైన జిమ్నాస్ట్‌ను కూడా! వారంలో నాలుగు రోజుల పాటు జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేస్తాను. రోజంతా శరీరాన్ని చలాకీగా ఉంచాలంటే ప్రతి రోజూ వ్యాయామం చేయాలి. అందుకే సమయం దొరికితే రోజుకు రెండు పూటలా జిమ్‌కు వెళ్లడానికీ వెనకాడను. జిమ్‌లో కార్డియోతో పాటు, వెయిట్ ట్రైనింగ్ కూడా చేస్తాను. ఉదయాన్నే ఓ గంట పాటు యోగా సాధన చేస్తాను.

**ఈ జాగ్రత్తలూ పాటించాలి!**

నాలో ఉన్న ప్రత్యేకత నా చదునైన పొట్ట. నిజానికి యాబ్స్ మెయింటెయిన్ చేయడం చాలా కష్టం. ఈ రోజు కనిపించిన బిగుతైన యాబ్స్ మరుసటి రోజుకు మాయం అవవచ్చు. అందుకే యాబ్స్ కోసం ప్రతి రోజూ ప్రత్యేకమైన వర్కవుట్స్ చేస్తూ ఉంటాను. కష్టతరమైన వర్కవుట్స్ చేయడంతో పాటు, నియమబద్ధమైన ఆహారనియమాలు పాటిస్తేనే యాబ్స్ ఏర్పడతాయి. అలాగే రోజుకు 8 గంటల పాటు కంటి నిండా నిద్రపోగలిగినప్పుడే ఫిట్‌నెస్ సొంతమవుతుంది. ఒంట్లో కొవ్వు పేరుకోకుండా ఉండాలంటే మెటబాలిజం వేగంగా ఉండాలి. అందుకోసం నేను తరచుగా నీళ్లు తాగుతూనే ఉంటాను. ఇవే నా ఫిట్‌నెస్ రహస్యాలు!



అతిథి



ఆధునిక జీవనశైలితో మధుమేహం, అధిక రక్తపోటు, కేన్సర్లు వంటి దీర్ఘకాలిక జబ్బుల తాకిడి ఎక్కువవుతోంది. స్థూలకాయం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏం తినాలి? ఏది తినకూడదు? మన ఆహార పద్ధతులు సరైనవేనా? రోజుకో సిద్ధాంతం, వారానికో వాదన పుట్టుకొస్తున్న ఈ తరుణంలో... 'మన పూర్వీకులు పాటించిన ఆహార పద్ధతుల్ని అనుసరించడమే బెస్ట్' అంటున్నారు డాక్టర్ సత్యలక్ష్మి. పుణేలోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేచురోపతీ' సంస్థకు ఆమె డైరెక్టర్. ఆ పదవిని అందుకున్న తొలి తెలుగు మహిళ. సుస్థిరమైన ఆరోగ్యం కోసం, సహజమైన ఆహారం గురించీ ఆమె ఏం చెబుతున్నారంటే...



# తృణమే ఘనం!

"ఆరోగ్యవంతమైన జీవనంలో ఆహారం ప్రధానపాత్ర పోషిస్తుంది. మీరు తినే ఆహారాన్ని బట్టే మీ శారీరకస్థితి ఉంటుందని ఆయుర్వేదం చెబుతోంది. అందుకే మన పొట్ట రెండో మెదడులా పనిచేస్తోందని ప్రకృతి వైద్యశాస్త్రం నిర్వచిస్తోంది. మనం తీసుకునే ఆహారానికి, మన ఆలోచనలకు అవినాభావ సంబంధం ఉందని ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు నిరూపించాయి. జీర్ణక్రియ పనితీరులో గట్ మైక్రోబయోటా, బ్యాక్టీరియా కీలకపాత్ర పోషిస్తుంది. యాంటీ బయోటిక్స్ ఎక్కువగా తీసుకున్నప్పుడుగానీ, క్రిమిసంహారక మందుల అవశేషాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకున్నప్పుడు గానీ ఆ గట్ బ్యాక్టీరియా రసాయన చర్య మందగిస్తుంది. అది మెదడులోని రసాయన చర్యలపై ప్రభావం చూపుతుంది. దీనివల్ల కోపం, చిరాకు, నిస్సత్తువ, భావోద్వేగాలు అదుపు తప్పడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని పరిశోధనల్లో వెల్లడైంది. అందుకే వీలైనంతవరకూ సాత్విక ఆహారం తీసుకోవాలని యోగ శాస్త్రం సూచిస్తోంది.

## బియ్యం, గోధుమలు హాని చేస్తాయి!

బియ్యం, గోధుమలను ఆహారంలో ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికే కాదు, పర్యావరణానికి కూడా మంచిది కాదు. వరి, గోధుమల్లో ఆరోగ్యానికి హాని కలిగించే ఆర్సెనిక్ అనే పదార్థం ఉందని ఒక పరిశోధనలో వెల్లడైంది. ఆర్సెనిక్ వల్ల గోధుమ, బియ్యంలో థయామిన్ (విటమిన్ బీ1) చాలా తక్కువగా ఉంటోందని గుర్తించారు. నిజానికి శరీరంలో బ్లడ్ గ్లూకోజ్‌ను అదుపుచేసే ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో థయామిన్‌ది కీలకపాత్ర.



బియ్యం, గోధుమల్లో కన్నా తృణధాన్యాల్లో ఈ థయామిన్ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా కొర్రల్లో 'విటమిన్ బీ1' సమృద్ధిగా ఉంటుంది. మన దేశంలో అరవై శాతం వర్షాధార పంటలు పండే భూమి ఉంది. వరి, గోధుమ సాగుకు నీటి అవసరం ఎక్కువ. అందుకే రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, ఒరగలు వంటి తృణధాన్యాల సాగు పెరగడం వల్ల రైతులకు, పర్యావరణానికి లాభం. ఏది ఏమైనా మన బామ్మలు, తాతయ్యలు అవలంబించిన ఆహార పద్ధతుల్ని ఇప్పుడు మనం అనుసరిస్తే నేటి జీవనశైలి వల్ల వచ్చే ఊబకాయం, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలను అదుపుచేయవచ్చు. ఈ విషయాన్నే మేము ప్రచారం చేస్తున్నాం. మన పూర్వీకుల ఆహార పద్ధతులను తిరిగి మనం పాటించాల్సిన అవసరం ఉందని చెబుతున్నాం.

## తృణధాన్యాలే పరిష్కారం!

అత్యధిక పోషక విలువలు ఉన్న తృణధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవడమే ప్రస్తుతం అనేక ఆరోగ్య సమస్యలకు పరిష్కారం. కొన్నిరోజుల క్రితం మేము తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న ఆహారం తింటున్న కొంత మంది పిల్లల మీదా, తృణధాన్యాలతో చేసిన ఆహారాన్ని తీసుకుంటున్న మరికొంతమంది చిన్నారుల మీదా అధ్యయనం చేశాం. తృణధాన్యాలు తీసుకుంటున్న పిల్లల ఎదుగుదలలో మార్పులను గమనిస్తే, వారు చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నారు.

## మట్టి పాత్రలే మేలు!



తినే తిండితో పాటు మనం ఆహారాన్ని వండే పద్ధతి కూడా మార్చుకోవాలి. వంటకు అల్యూమినియం పాత్రలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల నరాలకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువ. స్టీలు పాత్రలు కొంతవరకు నయమే. మట్టి పాత్రల్లో వండటం వల్ల ఆహార పదార్థాల్లోని ఆర్సెనిక్‌ను ఆ పాత్ర గ్రహిస్తుంది. అందుకే మట్టి పాత్రలను వంటకు ఉపయోగించడం ఉత్తమం అని చెప్పొచ్చు. నల్ల నువ్వులు, అవిసె గింజలు, పల్లీలు వంటి వాటితో తయారు చేసిన వంట నూనెలను వాడటం మంచిది. తక్కువ ధరకే ఇంట్లోనే వంట నూనె తయారుచేసుకునే యంత్రాలు కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.

## 'కీటో డైట్' విషయంలో...


కొవ్వును కొవ్వుతోనే కరిగించవచ్చన్న ప్రచారం ఈ మధ్య ఎక్కువగా వినిపిస్తోంది. దీన్నే ప్రకృతి వైద్యశాస్త్ర పరిభాషలో 'కీటో డైట్' అంటారు. దీనిలో భాగంగా కొవ్వు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకుంటాం. ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్స్‌ను పూర్తిగా మానేస్తాం. మనం తీసుకునే కొవ్వు పదార్థాల్లో ఎంతో కొంత ప్రొటీన్లు ఉంటాయి కాబట్టి అవి మన శరీరానికి సరిపోతాయి. అయితే, దీని వల్ల శరీరం ఒక రకమైన ఒత్తిడికి గురవుతుంది. తద్వారా కాలేయం, మూత్రపిండాలపై భారం ఎక్కువవుతుంది.



కిడ్నీ, లివర్ సమస్యలు ఉన్నవారు ఎట్టి పరిస్థితిలో ఇలాంటి ఆహారం తీసుకోకూడదు. అందుకే ఎవరు పడితే వాళ్ళు కీటో డైట్ పాటించవచ్చని చెప్పడం సరైంది కాదు. ఇలాంటి ఆహారపుటలవాట్లను వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే పాటించాలి.

## శాకాహారమే ఉత్తమం!

'శాకాహారమే ఉత్తమం' అని ప్రకృతి వైద్యశాస్త్రం చెబుతోంది. ప్రకృతి నుంచి ఎనర్జీని అందుకోవడంలో మొక్కలు తొలి దశలో ఉంటే, జంతువులు, పక్షుల లాంటి వాటితోపాటు మనుషులమైన మనం రెండో దశలో ఉన్నాం. పశువులు గడ్డి తిని జీవిస్తాయి. పులులు, సింహాలు మాంసాహారం తిని మనుగడ సాగిస్తాయి. అంటే వాటి శరీరాకృతికి అనుగుణంగా ఆహార అలవాట్లు ప్రకృతి నియమం ప్రకారం సాగుతున్నాయి. ప్రొటీన్ల కోసం మాత్రమే మాంసం తినాలనడం కూడా సరైందికాదు. మేకలు, ఇతర జంతువులు, కోళ్ల పొట్టలో కొన్నిరకాల విషపదార్థాలు (టాక్సిన్స్) ఉంటాయి. వాటి మాంసం తినడం ద్వారా అవి మన శరీరంలోకి చేరి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.



'మనుషులు శాకాహారం మాత్రమే ఎందుకు తినాలి?' అనే అంశంపై అడాల్ఫ్ 'రిటర్న్ టు నేచర్' అనే పుస్తకంలో ప్రత్యేకంగా వివరించారు. ఆ పుస్తకం మహాత్మాగాంధీని అత్యంత ప్రభావితం చేసింది. ఆ తర్వాతే గాంధీ నేచురోపతిని తన జీవితంలో భాగం చేసుకున్నారు."

• కె. వెంకటేశ్

## 'సహజాహార పండుగ' లక్ష్యం అదే!

'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి' (ఎన్.ఐ.ఎన్) దేశంలోని మరికొన్ని ప్రకృతి చికిత్సాలయాలతో కలిసి ప్రతి ఏటా 'సహజాహార పండుగను నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ, ముఖ్యంగా హైదరాబాద్‌లో ఈ పండుగ నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా జాతీయ స్థాయి తృణధాన్యాల ప్రదర్శన ఏర్పాటు చేశాం. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రకృతి వైద్యశాలల విద్యార్థినులూ తమ రాష్ట్రాల్లో సుస్థిరారోగ్యం కోసం అక్కడి వారు అవలంబిస్తున్న ఆహార పద్ధతులను ఈ పండుగలో వివరిస్తుంటారు. ఆధునిక జీవనశైలితో తలెత్తే జబ్బుల ధాటిని ఎదుర్కోవడానికి... వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా తృణధాన్యాల వాడకమే పరిష్కారమని ఎన్నో అధ్యయనాల్లో తేలింది. ఈ విషయాల గురించి ప్రచారం చేయడంతోపాటు సహజాహారం అంటే ఏమిటో, దాన్ని తీసుకోవడం వల్ల కలిగే లాభాలు ఎలాంటివో చెబుతున్నాం. తృణధాన్యాలతో రకరకాలైన వంటల్ని రుచికరంగా ఎలా వండుకోవచ్చో కూడా వివరిస్తున్నాం.

ఆదర్శం

**23 ఏళ్ల వయసులో ఆమెపైన యాసిడ్‌దాడి జరిగింది. అయినా ధైర్యం కోల్పోలేదు. ఆత్మస్థైర్యంతో 250 మంది యాసిడ్ దాడి బాధిత మహిళల జీవితాల్లో మార్పునకు కారణమయ్యారు. ఆమె పేరు ప్రజ్ఞాసింగ్. 'నేను అంటే నా ముఖం మాత్రమే కాదు' అంటూ వారిలో ధైర్యం నింపుతూ, చదువు చెబుతూ, ఉద్యోగావకాశాలు కల్పిస్తూ సాటి యాసిడ్ బాధిత మహిళల బతుకుల్లో కొత్త వెలుగులు నింపుతున్న ఆ సేవామూర్తి విశేషాలివి...**



ప్రధాని మోదీతో...

# 'నేను' అంటే... నా ముఖం మాత్రమే కాదు!

'యాసిడ్ దాడి జరిగితే జీవితం అంతమైపోయినట్టు కాదు'... ఈ మాట చెప్పటానికి బాగుండొచ్చు కానీ, తలుచుకుంటేనే వెన్నులో వణుకు పుట్టిస్తుంది. ఆ బాధ అనుభవించిన వారికే తెలుస్తుంది. కొన్ని యాసిడ్ చుక్కలు జీవితంపైన పెట్టుకున్న ఎన్నో ఆశలను నిర్దాక్షిణ్యంగా కుప్పకూల్చేస్తాయి. పచ్చని బతుకును బుగ్గి చేస్తాయి. అయినా 'యాసిడ్ దాడి జరిగితే జీవితం అంతమైపోయినట్టు కాదు. మళ్లీ జీవితాన్ని కొత్తగా ప్రారంభించాల'ని చెప్పడానికి చాలా ధైర్యం కావాలి. అందుకే ప్రజ్ఞాసింగ్ యాసిడ్ బాధితుల బాగుకోసం పాటుపడుతున్నారు.



రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటూ..

## అర్థరాత్రి యాసిడ్ దాడి!

2006లో ప్రజ్ఞా పైన యాసిడ్ దాడి జరిగింది. అప్పటికి ఆమె వివాహమై 12 రోజులు మాత్రమే. ఆ రోజు ఆమె ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేయడానికి తన సొంతూరు వారాణాసి నుంచి ఢిల్లీ వెళుతున్నారు. అర్థరాత్రి సమయం. ఆమె నిద్రలోకి జారుకున్నారు. కొంతసేపటికి ప్రజ్ఞా అరుపులతో ఒక్కసారిగా బోగీలోని ప్రయాణికులందరూ నిద్ర లేచారు. ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారిపోయారు. ప్రజ్ఞా చర్మం ఊడిపోయింది. దుస్తులు కాలిపోయాయి. డాక్టర్ తన దుపట్టాను ఆమె చుట్టూ చుట్టి ముఖంపైన నీళ్లు చిలకరించాడు. రైల్లో ఒక వ్యక్తి ఆమె ముఖంపైన యాసిడ్ పోశాడు. కారణం గతంలో అతను పెళ్లి ప్రస్తావన తెస్తే ఆమె తిరస్కరించారు. దాన్ని మనసులో పెట్టుకొని ఆ రోజు యాసిడ్ దాడికి తెగబడ్డాడు.

15 సర్జరీలు జరిగాక ఆమె బతికారు. తిరిగి కోలుకోవడానికి ఏణ్నార్థం పట్టింది. యాసిడ్ దాడి నుంచి కోలుకున్నాక 'అతిజీవన్' అనే సంస్థను స్థాపించారామె. వందలాది మంది యాసిడ్ దాడి బాధితురాళ్లకు ఆశ్రయం కల్పించి సాయపడుతున్నారు. యాసిడ్ దాడి బాధితులకు ఈ సంస్థ ద్వారా ఉచితంగా సర్జరీలు నిర్వహిస్తున్నారు. చికిత్సకు సాయపడుతున్నారు. వారిలో మనోధైర్యం కల్పించేందుకు కౌన్సెలింగ్ ఇవ్వడం, తమ కాళ్ల మీద తాము నిలబడి కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు రకరకాల నైపుణ్యాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆమె తన జీవితంలో తెచ్చుకున్న అర్థవంతమైన మార్పును సమాజంలోనూ చూసేందుకు తన వంతు ప్రయత్నిస్తున్నారు. తన సేవా ప్రయాణం గురించి ఆమె ఏమంటున్నారంటే...

"ఆ దాడి జరిగిన మొదటి రెండేళ్లు నాకూ, నా భర్తకూ చాలా క్లిష్టమైన సమయం. నా నుంచి దూరంగా వెళ్లి బతకమని ఆయన్ను కోరేదాన్ని. నావల్ల ఆయన కూడా బాధపడడం నాకు ఇష్టం లేదు. నా కూతురును స్కూల్లో స్నేహితురాళ్లు "మీ అమ్మ ఎందుకు అలా ఉంది?" అని అడిగేవారు. అయితే నాకు ఎన్ని ఇబ్బందులు ఉన్నా అవన్నీ భరించే శక్తిని నాకు ఇచ్చిన కుటుంబ సభ్యులు నా వల్ల కుంగిపోకూడదు అని నిర్ణయించుకున్నాను. క్రమంగా మామూలు మనిషినయ్యాను.



యాసిడ్ బాధితురాలితో...

నాకు సర్జరీలు చేసిన డాక్టర్లు కాలిన గాయాలతో బాధపడే పేషంట్లు వచ్చినప్పుడు, నన్ను పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇవ్వమని చెప్పేవారు. మంటల్లో కాలడం, యాసిడ్ దాడి వల్ల గాయపడిన బాధితుల్లో చాలామంది పేదవాళ్లే. వారంతా నాతో ఒకమాట అనేవారు. 'మేడమ్, మీ కుటుంబం మీకు మద్దతుగా నిలుస్తోంది. మీకు సర్జరీలు చేయడానికి అవసరమైన ఖర్చును మీ కుటుంబం భరించింది. కానీ మా ఇళ్లలో అది సాధ్యం కాదు' అని. అప్పుడే యాసిడ్ దాడులు, మంటల్లో కాలిన గాయాలు అయిన వారిని ఆదుకోవాలనే ఆలోచనతో నేను 'అతిజీవన్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాను.

## 250 మందికి కొత్త జీవితం...

ఈ సంస్థను నడపడానికి నా కుటుంబం, స్నేహితులు, డాక్టర్ల సాయం తీసుకున్నాను. మంటల్లో కాలినవారికి, యాసిడ్ దాడికి గురైన వారికి పునరావాసం కల్పిస్తాం. వారికి సర్జరీలు చేయించడం, ఆర్థిక, న్యాయ సహాయం అందించడం, చదువు, నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా సాయపడుతున్నాం. చదువుతో పాటు వృత్తివిద్యల్లోనూ శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు ఇప్పిస్తాం. రోజంతా పనిచేయలేనివారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తాం. వారు ఇంటివద్దనే ఉండి హస్తకళల ద్వారా జీవనోపాధిని పొందుతారు. వారందరికీ మేము చెప్పొదొక్కటే... 'మీపైన మీరు నమ్మకం ఉంచండి. ముందుకు అడుగేయండి'. ఇప్పటిదాకా నేను కలసిన ప్రతి బాధితురాలి విషయంలోనూ నా నమ్మకం నిజమైంది. జీవించాలనే కోరిక, కష్టాలకు ఎదురొడ్డి పోరాడాలనే తపనా ప్రతి మనిషిలోనూ ఉంటుంది. 'అతిజీవన్' ద్వారా ఇప్పటిదాకా 250 మంది బాధితులకు సాయమందించాం. ఇప్పుడు వాళ్లంతా ఆత్మవిశ్వాసంతో బతుకుతున్నారు. వారిని చూసినప్పుడు 'నేను అంటే... నా ముఖం మాత్రమే కాదు' అని చెబుతున్నట్టు అనిపిస్తుంది."

వినూత్నం

# పొలంలో జ్ఞాపకాలు పదిలం!




మనుషులే కాదు... మంచి మనసున్న జంతువులూ మన ఆత్మీయులే కదా! అలా తన మంచితనంతో గురువాయూర్ కేశవన్ ఏ ఒక్క ఇంటికో కాదు, మొత్తం గురువాయూర్ పట్టణ ప్రజలందరికీ సొంత మనిషి అయ్యాడు. అంతగా వారి అభిమానాన్ని పొందిన కేశవన్ ఎవరంటే... ఒక గున్న ఏనుగు! గురువాయూర్ దేవాలయానికి చెందిన సెలెబ్రిటీ ఏనుగు! అది 1976లోనే చనిపోయినా, గురువాయూర్ ప్రజల మనస్సులో ఇప్పటికీ సజీవంగానే ఉంది.

ఏళ్లు గడిచినా తమ మనసులో ఉన్న గురువాయూర్ కేశవన్ జ్ఞాపకాలను ప్రజలు తమ పైరులో పదిలపరుచుకున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లా, థయ్యిల్‌కు చెందిన ప్రసీద్ కుమార్ అనే ఆదర్శ రైతు రైస్ ప్యాడీ ఆర్ట్‌ను ఉపయోగించి పచ్చని వరి పైరును కాన్వాస్‌గా మలచుకొని కేశవన్ చిత్రాన్ని కళ్లముందు ఆవిష్కరించారు. నంబిక్కోల్లిలోని తన వరిపొలంలో 20 సెంట్ల విస్తీర్ణంలో ఈ ఏనుగు చిత్రాన్ని మలిచారు. దీనికి ఐదు వేల రూపాయలు ఖర్చు అయింది. బాస్మతీ రకం కృష్ణకామోద్, దేశీ వరి రకం కారువాచితో చిత్రానికి చక్కటి రూపం ఇచ్చారు. బోర్డర్‌గా గంధకశాల, జీరకశాల వరి రకాలను ఉపయోగించి కేశవన్ రూపాన్ని కళ్లముందు సృష్టించారు. ప్రస్తుతం ఇదొక పర్యాటక ఆకర్షణగా మారింది.

బ్యూటీ

# మెడ అందంగా!



మేకప్ వేసుకునేప్పుడు మెడ భాగంలో ఉండే మృదువైన చర్మం మీద చాలామంది దృష్టిపెట్టరు. దాంతో అక్కడ గీతలు ఏర్పడి వయసు పెరిగినట్టుగా కనిపిస్తారు. మెడ భాగంలో గీతల్ని మాయం చేయాలంటే...

**సన్‌స్క్రీన్:** ఎండలో బయటకు వెళ్లేటప్పుడు ముఖంతో పాటు మెడకు కూడా సన్‌స్క్రీన్ రాసుకోవడం మర్చిపోవద్దు. సన్‌స్క్రీన్ వాడడం వల్ల చర్మం మీద ముడతలు, గీతలు ఏర్పడవు. దాంతో చర్మం యవ్వనంగా కనిపిస్తుంది.

**మాయిశ్చరైజర్:** స్నానం చేసిన తరువాత మెడకూ మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఇలాచేస్తే మెడ భాగంలోని చర్మానికి పోషణ, తేమ అందుతుంది.

**నెక్‌ప్యాచ్:** ముఖ సౌందర్యానికి ఫేస్ మాస్క్ వాడతారు కదా. అలాగే మెడకు కూడా నెక్ ప్యాచెస్ వేసుకోవాలి. ఈ ప్యాచెస్ మెడ మీది గీతల్ని, ముడతల్ని తగ్గిస్తాయి. చర్మానికి తాజాదనాన్ని ఇస్తాయి.



స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నిర్వహించే పరీక్షల్లో అత్యంత ఆదరణ కలిగిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (10+2, సీహెచ్ఎస్ఎల్ఈ) నోటిఫికేషన్-2019 వెలువడింది. దేశవ్యాప్తంగా లక్షల మంది ఔత్సాహికులు ఈ పరీక్ష కోసం పోటీ పడుతుంటారు. కొద్దిగా కష్టపడితే కేంద్ర ప్రభుత్వంలో కొలువు సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలు తెలుసుకుందాం...

# ఇంటర్‌తో.. కేంద్ర కొలువులు

దేశంలో అత్యధిక మంది హాజరయ్యే పోటీ పరీక్షల్లో సీహెచ్ఎస్ఎల్ఈ ఒకటి. ప్రస్తుతానికి భర్తీ చేస్తున్న పోస్టులను మాత్రమే ప్రకటించారు. ఖాళీల వివరాలను పేర్కొనలేదు. ఆయా ప్రభుత్వ విభాగాల నుంచి వచ్చే సమాచారం మేరకు ఖాళీలను వెబ్‌సైట్‌లో సమయానుకులంగా అప్‌డేట్ చేస్తుంటారు. ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్న పోస్టులు..

**లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ) / జూనియర్ సెక్రటరీయెట్ అసిస్టెంట్ (జేఎస్ఏ)**
పేస్కేల్: రూ. 19,900 - 63,200

**పోస్టల్ అసిస్టెంట్ (పీఏ) / సార్టింగ్ అసిస్టెంట్ (ఎస్ఏ)**
పేస్కేల్: రూ. 25,500 - 81,100

**డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ)**
పేస్కేల్: రూ. 25,500 - 81,100

**డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్-ఏ**
పేస్కేల్: రూ. 25,500 - 81,100

## అర్హత - వయసు

గుర్తింపు పొందిన బోర్డు / యూనివర్సిటీ నుంచి 12వ తరగతి / తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత. కాగ్ ఆఫీసులో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు మాత్రం మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా సైన్స్ స్ట్రీమ్‌లో ఇంటర్.

- **వయసు:** జనవరి 1, 2020 నాటికి 18 - 27 ఏళ్లు (జనవరి 2, 1993-జనవరి 1, 2002 మధ్య జన్మించి ఉండాలి). రిజర్వ్‌డ్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఈబీసీ కేటగిరీకి ఎటువంటి మినహాయింపులు ఉండవు.

## ఎంపిక విధానం

మొత్తం మూడు దశలుగా ఎంపిక ప్రక్రియను విభజించారు. ఈ దశలను టయర్-1, టయర్-2, టయర్-3గా వ్యవహరిస్తారు.

- **టయర్-1:** ఇందులో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అవి.. ఇంగ్లీష్ లాంగ్వేజ్ (25 ప్రశ్నలు, 50 మార్కులు), జనరల్ ఇంటెలిజెన్స్ (25 ప్రశ్నలు, 50 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (25 ప్రశ్నలు, 50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ (25 ప్రశ్నలు, 50 మార్కులు). మొత్తం మీద 200 మార్కులకు ఉండే ఈ పేపర్‌లో 100 ప్రశ్నలు వస్తాయి. వీటికి 60 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. నెగిటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పునకు 0.50 మార్కు కోత విధిస్తారు.
- **టయర్-2:** టయర్-1లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేస్తారు. వీరికి మాత్రమే టయర్-2కు హాజరయ్యే అవకాశాన్ని కల్పిస్తారు. ఈ దశ డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. దీన్ని పేపర్-పెన్ పద్ధతిలో నిర్వహిస్తారు. ఈ దశకు కేటాయించిన మార్కులు 100, సమయం 60 నిమిషాలు. ఇందులో అభ్యర్థుల లాంగ్వేజ్, రైటింగ్ స్కిల్స్‌ను పరీక్షించేదుకు ఎస్సే / లెటర్ / ప్రెసిస్ / అప్లికేషన్ రైటింగ్ అంశాలు ఉంటాయి. వీటికి హిందీ / ఇంగ్లీష్ భాషల్లో సమాధానాన్ని రాయాలి. ఈ క్రమంలో 200 - 250 పదాల నిడివితో ఒక ఎస్సే, 150 - 200 పదాల పరిమితితో లెటర్ / అప్లికేషన్‌ను రాయాల్సి ఉంటుంది. ఇందులో సాధించాల్సిన కనీస అర్హత మార్కులు 33. మెరిట్ లిస్ట్ ప్రిపరేషన్‌లో కూడా టయర్-2లో చూపిన ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు.
- **టయర్-3:** ఈ దశలో నిర్వహించే పరీక్షలు పోస్టులను బట్టి వేర్వేరుగా ఉంటాయి. టయర్-1, 2లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి మాత్రమే టయర్-3 దశకు హాజరయ్యే అవకాశాన్ని కల్పిస్తారు. టయర్-3 కేవలం అర్హత పరీక్ష మాత్రమే (మెరిట్ లిస్ట్ ప్రిపరేషన్‌లో దీన్ని పరిగణనలోకి తీసుకోరు).
- **డేటా ఎంట్రీ ఆపరేటర్:** ఈ పోస్టు కోసం టయర్-3లో భాగంగా స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో డేటా ఎంట్రీ స్పీడ్ టెస్ట్ ఉంటుంది. ఈ టెస్ట్‌లో 60 నిమిషాల్లో 8 వేల పదాల (కీ డిప్రెషన్స్)ను కంప్యూటర్‌లో కంప్యూటర్‌లో ఎంటర్ చేయగలగాలి. ఈ క్రమంలో 2000 - 2200 పదాలతో ఉండే ఇంగ్లీష్ ప్యాసేజ్‌ను 15 నిమిషాల్లో కంప్యూటర్‌లో టైప్ చేయాలి. అదే కాగ్ ఆఫీస్‌లో డేటార్ ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు మాత్రం 60 నిమిషాల్లో 15 వేల పదాల (కీ డిప్రెషన్స్)ను వేగంగా కంప్యూటర్‌లో ఎంటర్ చేసే నైపుణ్యం ఉండాలి. ఈ క్రమంలో 3700 - 4000 పదాలతో ఉండే ఇంగ్లీష్ ప్యాసేజ్‌ను 15 నిమిషాల్లో కంప్యూటర్‌లో టైప్ చేయాలి.
- **ఎల్‌డీసీ / జేఎస్ఏ / పీఏ / ఎస్ఏ:** ఈ పోస్టులకు నిర్వహించే టైపింగ్ టెస్ట్ ఇంగ్లీష్ / హిందీ భాషల్లో ఉంటుంది. అభ్యర్థులు ఈ రెండు భాషల్లో ఏదో ఒక దాన్ని ఎంచుకోవాలి. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తు సమయంలోనే వెల్లడించాలి. ఇంగ్లీష్ భాషను ఎంచుకున్న వారు నిమిషానికి 35 పదాల వేగం, హిందీ భాషలోనైతే నిమిషానికి 30 పదాల వేగంతో టైప్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. మొత్తమ్మీద గంటకు 9000 - 10500 పదాల ఎంటర్ చేయగలగాలి. ఈ క్రమంలో ఇచ్చిన ఇంగ్లీష్ ప్యాసేజ్‌ను 10 నిమిషాల్లో ఎంటర్ చేయాలి.

**చివరగా**

టయర్-1, టయర్-2, టయర్-3లలో సాధించిన మార్కులను బట్టి మెరిట్ లిస్ట్‌ను రూపొందిస్తారు. కాబట్టి అభ్యర్థులు మూడు దశల్లో నిర్దేశించిన అర్హతను సాధించాల్సి ఉంటుంది. వీరికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. దీని ఆధారంగా ఆయా కేటగిరీల వారీగా ఎస్ఎస్‌సీ ఆల్ ఇండియా మెరిట్ లిస్ట్‌ను విడుదల చేస్తుంది.

## ఉపయోగపడే పుస్తకాలు

- మోడ్రన్ అప్రోచ్ టు వెర్బల్ - నాన్ వెర్బల్ రీజనింగ్ - ఆర్ఎస్ అగర్వాల్
- ఫాస్ట్ ట్రాక్ ఆబ్జెక్టివ్ అర్థమెటిక్ - అర్హింత్ పబ్లికేషన్స్
- ఎస్ఎస్‌సీ మ్యాథమెటిక్స్ 1999 - 2016: రాకేశ్ యాదవ్
- అనలిటికల్ రీజనింగ్ - ఎంకే పాండే
- వర్డ్ పవర్ మేడ్ ఈజీ - నార్మన్ లూయిస్
- ఆబ్జెక్టివ్ ఇంగ్లీష్ - ఎస్‌పి భక్షి
- రెన్ అండ్ మార్టిన్ ఇంగ్లీష్ గ్రామర్ బుక్
- మనోరమ / ఇండియా ఈయర్ బుక్
- జనరల్ నాలెడ్జ్ - ల్యూసెంట్ పబ్లికేషన్స్
- ఎన్‌సీఈఆర్‌టీ - హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ పుస్తకాలు
- సూపర్ ఫాస్ట్ ప్రాక్టీస్ ఫర్ సీహెచ్ఎస్ఎల్ - కిరణ్ ప్రకాశణ్
- గైడ్ ఫర్ సీహెచ్ఎస్ఎల్ - దిశా పబ్లికేషన్స్.

## కటాఫ్ ఎంత

కటాఫ్ అనేది ఎంచుకున్న పోస్టు, కేటగిరీని బట్టి మారుతూ ఉంటుంది. 2107 కటాఫ్ జనరల్ విభాగంలో 143.50, ఓబీసీ 139, ఎస్సీ 122, ఎస్టీ 112గా ఉంది. అయితే పోటీ దృష్ట్యా ప్రతి ఏటా కటాఫ్ మార్కులు పెరుగుతూనే ఉన్నాయి. జనరల్ విభాగంలో కటాఫ్ 2016లో 127.50గా ఉంటే 2015లో 119గా నమోదైంది. ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే టయర్-1 నుంచి టయర్-2కు అర్హత సాధించాలంటే 140 నుంచి 160 మధ్యలో స్కోర్ సాధించే విధంగా ప్రయత్నించాలి. అయితే పోటీని బట్టి ఈ మార్కులు మరింత పెరగవచ్చు / తగ్గొచ్చు.

## ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 10, 2020.
- వెబ్‌సైట్: http://ssc.nic.in/

## సన్నద్ధత ఇలా

- **జనరల్ ఇంటెలిజెన్స్:** అభ్యర్థుల తార్కిక శక్తిని పరీక్షించే విభాగం ఇది. ఇందులో 15 - 20 ప్రశ్నలు సులువుగా చేసేలా ఉంటాయి. ప్రశ్నల క్లిష్టత పదో తరగతి స్థాయిలో ఉంటుంది. ఈ విభాగంలో ఎక్కువ స్కోర్ చేయాలంటే వేగంతోపాటు కచ్చితత్వం కూడా అవసరం. కాబట్టి సమయాన్ని నిర్దేశించుకొని ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయడం నేర్చుకోవాలి. ప్రశ్నలో ఉన్న సమాచారం మొత్తం వినియోగిస్తూ సమాధానాన్ని తీసుకురావాలి. వెర్బల్, నాన్ వెర్బల్, క్రిటికల్ థింకింగ్, సోషల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అనాలజీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, బ్లడ్ రిలేషన్స్, రీజనింగ్, అర్థమెటిక్, నెంబర్ సిరీస్, కోడింగ్- డికోడింగ్, డేటా సఫిషియెన్సీ, డైరెక్షన్ సెన్స్, ర్యాంకింగ్స్, సీట్ అరేంజ్‌మెంట్స్, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రామ్స్, స్పేస్ విజువలైజేషన్, మ్యాచింగ్ వంటి టాపిక్స్‌పై దృష్టి సారించాలి. ఈ విభాగం కోసం బేసిక్ మ్యాథమెటిక్స్, ఆల్ఫాబెట్ టెస్ట్ అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. తద్వారా సిలబస్‌పై ఒక అవగాహన వస్తుంది. ప్రిపరేషన్‌లో ఒక టాపిక్‌ను తీసుకుంటే.. దానికి సంబంధించి ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో ముందే ఊహించుకొని ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం మాక్ టెస్ట్‌లు, ప్రీవియస్ పేపర్లను కూడా ఉపయోగించుకోవచ్చు.
- **జనరల్ అవేర్‌నెస్:** ఈ విభాగం కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో చోటు చేసుకుంటున్న పరిమాణాలను నిశితంగా గమనించాలి. ముఖ్యంగా ఇతర దేశాలతో భారత్ చేసుకుంటున్న ఒప్పందాలు, ప్రధాని పర్యటనలు, అవార్డులు, క్రీడలు, శాస్త్ర-సాంకేతిక పరిశోధనలు, ఎన్నికలు, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, చట్టాలు, వార్తల్లో వ్యక్తులు, నియామకాలను సమగ్రంగా ఫాలో కావాలి. పరీక్ష తేదీకి ముందు 6 నుంచి 8 నెలల కాలంలో చోటు చేసుకున్న పరిణామాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. భారతదేశ చరిత్ర, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధిస్తే కనీసం 50 శాతం ప్రశ్నలకు సమాధానాలను రాబట్టవచ్చు. కంప్యూటర్ సంబంధంగానూ ప్రశ్నలు వస్తాయి. కరెంట్ అఫైర్స్ కోసం రోజువారీ దిన పత్రికలను చదవాలి.
- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** ఇందులో భిన్నాలు, దశాంశాలు, శాతాలు, లాభ - నష్టాలు, నిష్పత్తి, డిస్కౌంట్, పార్ట్‌నర్‌షిప్, వ్యాపార గణితం (వడ్డీ), కాలం-దూరం, కాలం-పని, గ్రాఫ్స్, త్రిభుజాలు, సర్కిల్స్, స్తూపాలు, చతురస్రం, ధీర్ఘచతురస్రం, పిరమిడ్, ఎత్తు-దూరం, కోణాలు, బార్-చార్ట్ డయాగ్రామ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగంలో ఎక్కువ స్కోరింగ్ చేయాలంటే టేబుల్స్, స్క్వేర్స్, క్యూబ్స్, స్క్వేర్ రూట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా టాపిక్స్‌కు సంబంధించిన ఫార్ములాలను గుర్తు పెట్టుకోవాలి. ప్రాబ్లమ్ సాల్వింగ్‌కు షార్ట్‌కట్ మెథడ్స్‌ను ఉపయోగించడం నేర్చుకోవాలి. దాంతో సమాధానాన్ని గుర్తించడంలో వేగం, కచ్చితత్వం అలవడతాయి.
- **జనరల్ ఇంగ్లీష్:** తక్కువ సమయంలో ఎక్కువ స్కోర్ చేసే అవకాశం ఉన్న విభాగం ఇది. కాబట్టి ప్రిపరేషన్‌లో ఈ టాపిక్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఎర్రర్ స్పాటింగ్, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, వొకాబ్యులరీ, స్పెల్లింగ్, బేసిక్ గ్రామర్, సెంటెన్స్ స్ట్రక్చర్, ఫ్రేజెస్, యాంటినామ్స్-సినామ్స్, కాంప్రెహెన్షన్ వంటి వాటి నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రీవియస్ పేపర్లను ప్రాక్టీస్ చేయడం మంచిది. తద్వారా ఏయే టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో తెలుస్తుంది. మాక్ టెస్ట్‌లు రాయడం, బేసిక్ గ్రామర్ అంశాలపై దృష్టిసారిస్తే ఇందులో మెరుగైన స్కోర్ సాధించవచ్చు.

# జాబ్ కార్నర్

## అసిస్టెంట్ మేనేజర్

**ఖాళీలు: 35**

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కి చెందిన హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్ఎల్) అసిస్టెంట్ మేనేజర్ (లీగల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- అర్హత: ఎల్ఎల్‌బీ, కంప్యూటర్ పరిజ్ఞానం.
- రాత పరీక్ష తేదీ: జనవరి 27, 2020
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 16, 2019
- వెబ్‌సైట్: www.lichousing.com/

## అసోసియేట్ ప్రొఫెసర్

**ఖాళీలు: 39**

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను)- హైదరాబాద్, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- భర్తీ చేసే పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తదితరాలు.
- అర్హత: పోస్టుని అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, అనుభవం. నెట్ / సెట్ / స్లెట్ క్వాలిఫై అయి ఉండాలి.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 24, 2019.
- వెబ్‌సైట్: http://manuu.edu.in

## అసోసియేట్ ప్రొఫెసర్

**ఖాళీలు: 60**

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ బిహార్ (సీయూఎస్‌బీ) - గయ, టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- భర్తీ చేసే పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
- సబ్జెక్టులు: మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్స్, జాగ్రఫీ, ఎకానమిక్స్, పొలిటికల్ స్టడీస్, సైకాలాజికల్ స్టడీస్, తదితరాలు.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, పీహెచ్‌డీ, నెట్ / స్లెట్ / సెట్ క్వాలిఫై, అనుభవం.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 18, 2019.
- వెబ్‌సైట్: http://cusb.ac.in/




## పూసల దండ

**చేసేయండి!**

**కావలసినవి**


- రంగుల కాగితాలు
- పెన్సిల్
- జిగురు
- దారం



**తయారీ**

- రంగు కాగితాలను త్రిభుజాకారంలో చిన్న ముక్కలుగా కత్తిరించాలి.
- కాగితం ముక్కలను బొమ్మలో చూపించిన విధంగా పెన్సిల్ చుట్టూ బిగుతుగా తిప్పి అంచును జిగురుతో అతికించాలి.
- జిగురు ఆరిన తరువాత పెన్సిల్ నుంచి వాటిని తీసి పక్కన పెట్టుకోండి. దండలో వీటిని పూసలుగా వాడండి.
- ఒక దారం తీసుకొని అందులో ఈ పూసలు ఎక్కించండి. తరువాత దారం చివర ముడేయండి. పూసల దండ రెడీ.

## రంగులు వేయండి




## పదాలను పట్టికలో కనిపెట్టండి?

letter B

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| P | S | A | N | A | N | C | H | O | B | P |
| L | P | B | L | E | A | P | R | A | L | Y |
| B | B | I | L | A | K | P | L | Y | A | R |
| A | E | C | B | U | T | T | O | N | C | A |
| G | H | Y | O | D | C | T | K | T | K | N |
| P | O | C | S | C | B | C | E | R | B | T |
| Z | J | L | M | K | O | P | R | O | E | D |
| S | N | E | R | I | O | R | U | C | R | S |
| L | A | M | B | U | K | A | N | C | R | H |
| B | E | E | T | E | N | G | I | D | Y | I |
| E | A | S | C | O | B | R | E | A | D | P |




## దారి కనుక్కోండి?




## సరైన నీడను గుర్తించండి




## డైలీ సుడోకు - 218

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 2 | | 7 | | | 1 | | 3 |
| | | | | 4 | 3 | | | 8 |
| | | | 6 | | | 7 | 4 | |
| | 8 | | | 9 | | 4 | | |
| | | 9 | | | | 3 | | |
| | | 3 | | 1 | | | 9 | |
| | 9 | 8 | | | 5 | | | |
| 5 | | | 9 | 6 | | | | |
| 7 | | 1 | | | 4 | | 2 | |

**సుడోకు- 217 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 1 | 8 | 3 | 2 | 5 | 4 | 6 | 7 |
| 2 | 6 | 4 | 8 | 7 | 1 | 3 | 5 | 9 |
| 3 | 5 | 7 | 9 | 6 | 4 | 2 | 8 | 1 |
| 6 | 7 | 2 | 4 | 9 | 3 | 8 | 1 | 5 |
| 5 | 8 | 3 | 2 | 1 | 7 | 6 | 9 | 4 |
| 1 | 4 | 9 | 5 | 8 | 6 | 7 | 3 | 2 |
| 7 | 3 | 5 | 1 | 4 | 8 | 9 | 2 | 6 |
| 8 | 9 | 6 | 7 | 5 | 2 | 1 | 4 | 3 |
| 4 | 2 | 1 | 6 | 3 | 9 | 5 | 7 | 8 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.
























నైజాం : V సినిమాస్, సీడెడ్ : శ్రీ వెంకటేశ్వర ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్, వైజాగ్ : శ్రీ బాలాజీ ఫిలింస్, ఈస్ట్ : శ్రీ బాలాజీ ఫిలింస్, వెస్ట్ : ఉషా పిక్చర్స్, క్రిష్ణ : శ్రీ విజయ ఫిలింస్, గుంటూరు : పద్మావతి పిక్చర్స్, నెల్లూరు : శ్రీ శ్రీడిస్ట్రిబ్యూటర్స్, కర్ణాటక : చంద్రు ఎంటర్ప్రైజెస్



# విదేశీ కంపెనీగా ఎయిర్‌టెల్?

## రూ. 4,900 కోట్ల ఎఫ్‌డీఐకి అనుమతివ్వండి

### ప్రభుత్వాన్ని కోరిన భారతీ టెలికాం




న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ ప్రమోటర్‌గా ఉన్న భారతీ టెలికాం రూ.4,900 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) ప్రతిపాదనకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ సొమ్ము సింగపూర్‌కు చెందిన సింగ్‌టెల్, ఇతర విదేశీ కంపెనీల నుంచి రానుంది. ఒకవేళ ప్రభుత్వం అనుమతి లభించి పెట్టుబడులు పొందితే ఈ టెలికాం కంపెనీ విదేశీ కంపెనీగా మారనుంది. ఎఫ్‌డీఐ ద్వారా నిధులు వస్తే భారతీ టెలికాంలో విదేశీ షేర్ హోల్డింగ్ 50 శాతం దాటుతుందని, అప్పుడు విదేశీ కంపెనీగా మారడానికి అవకాశం ఉందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. "రూ.4,900 కోట్ల నిధుల రాకకోసం భారతీ టెలికాం దరఖాస్తు చేసుకుంది. ఇందులో సింగ్‌టెల్‌తోపాటు ఇతర విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడి కూడా ఉంది. ఈ పెట్టుబడులతో విదేశీ ఇన్వెస్టర్ల వాటా పెరిగి భారతీ టెలికాం విదేశీ కంపెనీగా మారుతుంది. ఈ నెలలోనే టెలికాం విభాగం (డాట్) ఈ పెట్టుబడికి అనుమతిచ్చే అవకాశం ఉంది" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం భారతీ టెలికాంలో సునిల్ భారతీ మిట్టల్, ఆయన కుటుంబానికి దాదాపు 52 శాతం వాటా ఉంది. భారతీ ఎయిర్‌టెల్‌లో భారతీ టెలికాంకు దాదాపు 41 శాతం వాటా ఉండగా.. విదేశీ ప్రమోటర్ సంస్థల వాటా 21.46 శాతంగా ఉంది. దాదాపు 37 శాతం వాటా పబ్లిక్ చేతిలో ఉంది. కాగా ఇంతకు ముందు భారతీ ఎయిర్‌టెల్ ఎఫ్‌డీఐ దరఖాస్తును డాట్ వెనక్కి పంపింది. విదేశీ ఇన్వెస్టర్‌కు సంబంధించి స్పష్టత ఇవ్వకపోవడమే ఇందుకు కారణం. ఇప్పుడు మాత్రం అనుమతి లభించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా చూస్తే ప్రస్తుతం భారతీ ఎయిర్‌టెల్‌లో విదేశీ వాటా 43 శాతంగా ఉంది. ప్రమోటర్ సంస్థ భారతీ టెలికాం విదేశీ సంస్థగా మారితే కంపెనీలో విదేశీ వాటా 84 శాతం దాటే అవకాశం ఉందని అంటున్నారు.

కాగా విదేశీ ప్రమోటర్ గ్రూప్ నుంచి నిధులను సమీకరించనున్నట్టు గత ఆగస్టులోనే స్టాక్ ఎక్స్ఛేంజీలకు భారతీ టెలికాం తెలిపింది. దీని ద్వారా కంపెనీలో విదేశీ వాటా 50 శాతం విదేశీ కంపెనీగా మారే అవకాశం ఉందని పేర్కొంది.

**ఆగస్టులోనే సమాచారం**

కాగా ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచుకునేందుకు ఇప్పటికే భారతీ ఎయిర్‌టెల్ దరఖాస్తు చేసుకుంది. ఎయిర్‌టెల్ ప్రభుత్వానికి రూ.43,000 కోట్లు చెల్లించాల్సి ఉన్న విషయం తెలిసిందే. ఇందుకు గాను 300 కోట్ల డాలర్లు సమీకరించే ప్రతిపాదనకు గత వారంలో ఎయిర్‌టెల్ బోర్డు అనుమతిచ్చింది. క్యూఐపీ, వాటా విక్రయం, రుణ పత్రాల ద్వారా ఈ నిధులు సమీకరించనుంది. 200 కోట్ల డాలర్ల సమీకరణకు కంపెనీ ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ క్యూఐపీలు లేదా ఆఫర్ ఫర్ సేల్ లేదా రెండింటినీ ప్రకటించే అవకాశం ఉంది. మరో 100 కోట్ల డాలర్లు డిబెంచర్లు, బాండ్ల ద్వారా సమకూర్చుకోనుంది.

## కాగితం పరిశ్రమకు మంచి రోజులు!

న్యూఢిల్లీ: వాడి పారేసే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తున్న నేపథ్యంలో.. కాగితమే దానికి సరైన ప్రత్యామ్నాయంగా నిలవనుందని ఒక అధ్యయనం వెల్లడించింది. ఫైవ్ ఇండియా ఆధ్వర్యంలో ఇక్కడ జరిగిన పేపరెక్స్ కార్యక్రమంలో ఈ అధ్యయన నివేదికను విడుదల చేశారు. వాడి పారేసే ప్లాస్టిక్‌కు భారత్‌లో ప్రస్తుతం రూ.80 వేల కోట్ల మార్కెట్ ఉంది. ఈతరహా ప్లాస్టిక్‌పై నిషేధం విధించాలన్న యోచనలో భారత సర్కారు ఉందని.. అదే జరిగితే ప్లాస్టిక్ మార్కెట్‌లో 25శాతాన్ని 2025కల్లా కాగితం తయారీ రంగం కైవసం చేసుకుంటుందని నివేదిక వెల్లడించింది.

ప్లాస్టిక్‌కు కాగితం మంచి ప్రత్యామ్నాయమని, పర్యావరణ హితమని కొనియాడింది. కాగితం తయారీలో పరిశ్రమలు 46 శాతం పాత కాగితాలను, 29 శాతం వ్యవసాయ వ్యర్థాలు, 29 శాతం కర్రలను వినియోగిస్తున్నాయని వివరించింది. ప్యాకేజింగ్‌తోపాటు టిష్యూ పేపర్, ఫిల్టర్ పేపర్, టీ బ్యాగులు, కార్డ్ బోర్డుల వంటి వాటికి డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోందని, మున్ముందు కాగితం పరిశ్రమకు చాలా డిమాండ్ ఉంటుందని అధ్యయనం స్పష్టం చేసింది.

## ఎఫ్‌పీఐలు మళ్లీ వెలుపలికి

న్యూఢిల్లీ: దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు బలహీనంగా ఉండడంతో విదేశీ పోర్ట్‌ఫోలియో (ఎఫ్‌పీఐ) ఇన్వెస్టర్లు మరోసారి అమ్మకాలు ప్రారంభించారు. డిసెంబరు నెలలో ఇప్పటి వరకు వారు రూ.244 కోట్లు ఉపసంహరించారు. డిసెంబరు మొదటి వారంలో ఎఫ్‌పీఐలు రూ.1668.8 కోట్లు ఇన్వెస్ట్ చేసి రూ.1424.6 కోట్లు ఉపసంహరించినట్టు డిపాజిటరీ గణాంకాలు చెబుతున్నాయి. గత రెండు నెలలో వారు నికరంగా కొనుగోళ్లు సాగించారు. అక్టోబరులో రూ.16,037.6 కోట్లు, నవంబరులో రూ.22,871.8 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. దేశీయ స్థూల ఆర్థిక గణాంకాల్లో బలహీనత ఏర్పడిన కారణంగా వారు రానున్న కొంత కాలం పాటు పరిశీలన ధోరణినే అనుసరించవచ్చునంటున్నారు.




### ఫెడ్ నిర్ణయం కీలకం

ఈ వారంలో వెలువడనున్న స్థూల ఆర్థిక గణాంకాలతో పాటుగా అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వచ్చే గురువారం వడ్డీరేట్ల విషయంలో ప్రకటించనున్న నిర్ణయం మీద మార్కెట్ కదలికలు ఆధారపడవచ్చు. అలాగే అమెరికా-చైనా వాణిజ్య చర్చలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేసే ఆస్కారం ఉంది. అయితే దేశీయంగాను, విదేశాల నుంచి కూడా కీలక సంఘటనలు ఉన్న కారణంగా ఈ వారంలో మార్కెట్‌లో ఆటుపోట్లు అధికంగా ఉండవచ్చునన్నది విశ్లేషకుల అభిప్రాయం. గురువారం నాడు పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడనున్నాయి.

# అంపశయ్యపై ఆర్థిక వ్యవస్థ

- ప్రస్తుతం 'వృద్ధి మాంద్యం'లో ఉన్నాం
- పీఎంఓలో అధికార కేంద్రీకరణ
- ఉత్సవ విగ్రహాలుగా కేంద్ర మంత్రులు
- సద్విమర్శ చేసినా రాజకీయ ముద్ర : ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలపై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ విమర్శలు గుప్పించారు ప్రభుత్వ విధానాలతోనే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర అనారోగ్యానికిలోనై అంపశయ్యపైకి చేరిందన్నారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ 'వృద్ధి మాంద్యం'లో పయనిస్తోందని 'ఇండియా టుడే' పత్రికలో రాసిన ఒక వ్యాసంలో పేర్కొన్నారు. 'గ్రామీణ ప్రాంతాలు తీవ్ర దురవస్థలో ఉన్నాయి. దీంతో ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ 'వృద్ధి మాంద్యం'లో ఉంది' అని ఆయన అన్నారు.



### పెత్తనమంతా పీఎంఓలోనే..

'కనిష్ఠ ప్రభుత్వం, గరిష్ఠ పాలన' నినాదంతో అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్.. అధికారమంతా ప్రధాని కార్యాలయం (పీఎంఓ)లోని కొద్ది మంది దగ్గరే కేంద్రీకృతం చేయడాన్ని రాజన్ తప్పుబట్టారు. ఈ విధానం దేశానికి ఏ మాత్రం మంచిది కాదన్నారు. అధికారాలు లేకపోవడంతో కేంద్ర మంత్రులు ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. పీఎంఓలోని నిపుణుల సలహాలు, సూచనలు పార్టీ రాజకీయ, సామాజిక లక్ష్యాలకు పనికొస్తాయే తప్ప, ఆర్థిక సంస్కరణలకు మాత్రం పనికి రావన్నారు. అధికార కేంద్రీకరణతో, పీఎంఓ దృష్టి పెడితే తప్ప ఆర్థిక సంస్కరణలు ముందుకెళ్లే పరిస్థితి లేకుండాపోయిందన్నారు.

### సమస్యనీ గుర్తించడం లేదు

ఆర్థిక వ్యవస్థ తీవ్ర సమస్యల్లో ఉన్నా మోదీ సర్కార్ ఇప్పటి వరకు సమస్య తీవ్రతను గుర్తించకపోవడాన్నీ రాజన్ తప్పుబట్టారు. 'ముందు సమస్య తీవ్రతను గుర్తించాలి. సమస్యను తెలియజెప్పే వారికి రాజకీయ దురుద్దేశాలు అంటగట్టడం సరికాదు. అలాగే ఆర్థిక మందగమనం తాత్కాలికమనే నమ్మకం నుంచీ ప్రభుత్వం బయటపడాలి. దీనికి సంబంధించి వచ్చే ప్రతికూల వార్తలు, సర్వేలను తొక్కిపెట్టడమూ సరికాదు' అన్నారు.

### నిరుద్యోగం పెరుగుతోంది

నిరుద్యోగం ముఖ్యంగా యువతలో నిరుద్యోగం పెరిగిపోవడంపైనా రాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చేయిదాటితే యువకులో అశాంతి చెలరేగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పెట్టుబడులు పడకేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇది సమస్య తీవ్రతకు సంకేతమన్నారు. 2024 నాటికి భారత ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం, కలేనని రాజన్ స్పష్టం చేశారు. ఆ స్థాయిని అందుకోవాలంటే ఇప్పటి నుంచైనా జీడీపీ వృద్ధి రేటు ఏటా 8-9 శాతం చొప్పున పెరగాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అది జరిగే పని కాదన్నారు.

### సమస్యల్లో రుణదాతలు

వీరు వారని లేకుండా ప్రస్తుతం ప్రతి రంగమూ సమస్యల్లో ఉందని రాజన్ పేర్కొన్నారు. నిర్మాణ రంగం, మౌలిక సదుపాయాలు, స్థిరాస్తి రంగం, ఎన్‌బీఎఫ్‌సీలు తీవ్ర సమస్యల్లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ రంగాల కష్టాలతో మొండి బకాయిల (ఎన్‌పీఏ) భయం పెరిగి, బ్యాంకులు ప్రస్తుతం రుణాలు ఇచ్చేందుకే భయపడుతున్నట్టు తెలిపారు. ఎన్‌బీఎఫ్‌సీల ఆస్తుల నాణ్యతపైనా సమీక్ష జరగాలని రాజన్ కోరారు. కంపెనీలతో పాటు, గృహ రుణాలు పెరిగిపోవడంపైనా ఆర్‌బీఐ మాజీ గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక రంగం తీవ్ర కష్టాల్లో ఉందనేందుకు ఇవి సూచికలన్నారు.

### లోతైన సంస్కరణలు తప్పదు

ప్రస్తుత కష్టాల నుంచి బయటపడాలంటే పెట్టుబడులు, భూసేకరణ, కార్మిక చట్టాల్లో లోతైన సంస్కరణలు తప్పనిసరని రాజన్ స్పష్టం చేశారు. ఇంకా పన్నులు, రెగ్యులేటరీ నిబంధనల్లో స్థిరత్వం, దివాలా కేసుల సత్వర పరిష్కారమూ అవసరమన్నారు. విద్యుత్ సరఫరాకు సరైన ధరలు నిర్ణయించడంతోపాటు టెలికాం రంగంలో పోటీని కాపాడాలని కోరారు. రైతులకు రుణాలతోపాటు సరైన ఉత్పాదకాలూ అందుబాటులో ఉంచాలన్నారు. అయితే ఈ సంస్కరణల విషయంలో మోదీ సర్కార్ ఎందుకో ధైర్యం చేయలేకపోతోందన్నారు.

**5 శాతం కూడా కష్టమే : ఐహెచ్‌ఎస్ మార్కిట్**

*ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ రేటు 5 శాతం దాటడం కూడా కష్టమనే అంచనాలు వినిపిస్తున్నాయి. గురువారం ప్రకటించిన ద్రవ్య, పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ 2019-20 ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు అంచనాలను 6.1 శాతం నుంచి 5 శాతానికి కుదించింది. ఐహెచ్‌ఎస్ మార్కిట్ అనే సంస్థ మాత్రం ఈ సంవత్సరం వృద్ధి రేటు 5 శాతం కంటే తక్కువగానే ఉంటుందని తన తాజా నివేదికలో పేర్కొంది.*

**గమనిక**

ఆదివారంనాటి సంచికలో ప్రచురితమైన 'ఈ-వే బిల్ జనరేట్ కావట్లేదా? అనే వార్తలో మొదటి పేరాలో 'కాంపోజిషన్ స్కీమ్‌లో ఉన్న వారు'కు బదులుగా 'సాధారణ పన్ను చెల్లింపుదారులు" అని చదువుకోగలరు.

## 9 నెలల తర్వాత 4% పెరిగిన మారుతి ఉత్పత్తి

న్యూఢిల్లీ: కార్లకు గిరాకీ లేకపోవడంతో సెప్టెంబరు వరకు 9 నెలలపాటు ఉత్పత్తిని గణనీయంగా తగ్గించుకున్న మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) నవంబరులో ఉత్పత్తిని పెంచింది. గత ఏడాది నవంబరులో 1,35,946 కార్లను ఉత్పత్తి చేసిన మారుతి ఈసారి 4.33 శాతం వృద్ధితో 1,41,834 కార్లను ఉత్పత్తి చేసింది. ప్యాసెంజర్ వాహనాల ఉత్పత్తి 3.67 శాతం పెరిగి 1,39,084 యూనిట్లు, మినీ, కాంపాక్ట్ విభాగంలోని ఆల్టో, న్యూ వ్యాగన్‌ఆర్, సెలేరియో, ఇగ్నీస్, స్విఫ్ట్, బాలెనో, డిజైర్ కార్ల ఉత్పత్తి 6.5 శాతం పెరిగి 1,02,185 యూనిట్లు, యుటిలిటీ వాహనాలైన విటారా బ్రెజ్జా, ఎర్టిగా, ఎస్-క్రాస్‌ల ఉత్పత్తి 18 శాతం పెరిగి 27,187 యూనిట్లు, మిడ్-సెడాన్ విభాగంలో సియాజ్ కార్ల ఉత్పత్తి 1830 యూనిట్లకు చేరింది. వాణిజ్య వాహనాల విభాగంలో గత ఏడాది నవంబరులో 1,797 కార్లు ఉత్పత్తి చేసిన మారుతి, ఈసారి 2,750 కార్లను తయారు చేసింది. అయితే.. మినీ సెగ్మెంట్ కార్లైన ఆల్టో, ఎస్‌ప్రెస్సోల ఉత్పత్తి మాత్రం గత ఏడాదితో పోలిస్తే పడిపోయింది.

## టెక్ వ్యూ

## ప్రధాన మద్దతు 11800

నిఫ్టీ గత వారం 12000కన్నా పైన పాజిటివ్‌గానే ప్రారంభమైనా తదుపరి దిగజారుతూ చివరికి శుక్రవారం 100 పాయింట్ల బలమైన కరెక్షన్ సాధించింది. చివరికి వీక్లీ చార్టుల్లో కూడా వారం కనిష్ఠ స్థాయిలో క్లోజ్‌కావడం మరింత అప్రమత్త సంకేతం. గత కొద్ది రోజుల ర్యాలీ అనంతరం ఆరోగ్యకరమైన సాధారణ కరెక్షన్ ఏర్పడింది. ముందు వారంలో 12000 వద్ద బ్రేకౌట్ సాధించిన అనంతరం గత వారం పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో పడడం స్వల్పకాలిక అప్రమత్త వైఖరి సంకేతం. అలాగే ఇది బుల్‌ట్రాప్ పాటర్న్ కూడా కావడం వల్ల మరింత స్వల్పకాలిక బలహీనతకు ఆస్కారం ఉంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. టెక్నికల్‌గా ప్రధాన ట్రెండ్ ఎగువకే ఉంది. 11800 వద్ద స్వల్పకాలిక బలహీనత మాత్రం కనిపిస్తోంది. అంతకన్నా దిగజారితే రెండో దశ కరెక్షన్‌లో ప్రవేశిస్తుంది. ఈ రెండో దశ కరెక్షన్‌లోనే బలమైన కరెక్షన్ ఏర్పడే అవకాశం కూడా ఉంది. ఇప్పుడు అత్యంత కీలక స్థాయి 11800 వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. భద్రతకు, మరింత కరెక్షన్ నివారించుకోవడానికి ఈ స్థాయిలో బలంగా రికవరీ సాధించి తీరాలి.



వి సుందర్ రాజా

**బుల్లిష్ స్థాయిలు :** మరింత అప్‌ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 12020 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మరో ప్రధాన నిరోధం 12100. కొద్ది రోజుల క్రితం సాధించిన టాప్ ఇదే. ఆ పైన మాత్రమే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తుంది.

**బేరిష్ స్థాయిలు :** గతంలో ఏర్పడిన మైనర్ కనిష్ఠ స్థాయి 11870కన్నా దిగజారితే మరింత కరెక్షన్‌లో ప్రవేశిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి




11800. ఇదే కొద్ది వారాల క్రితం ఏర్పడిన ప్రధాన బాటమ్. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక డౌన్‌ట్రెండ్ మరింతగా కొనసాగుతుంది.

**బ్యాంక్ నిఫ్టీ :** మరింత అప్‌ట్రెండ్‌లో ప్రవేశించాలంటే ప్రధాన నిరోధం 31650 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

**స్వల్పకాలిక వ్యూహం :** 11800కన్నా పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక ట్రేడర్లు గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక బై పొజిషన్లు తీసుకోవాలి.

**పాటర్న్ :** 11800 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. గత వారం నిఫ్టీ స్వల్పకాలిక 20 డీఎంఏ కన్నా దిగజారి ప్రస్తుతం 50 డీఎంఏ వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. ఓవర్‌బాట్ స్థితిని కూడా నిఫ్టీ సద్దుబాటు చేసుకుంటోంది.

**టైమ్ :** ఈ సూచీ ప్రకారం గురువారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.


**సోమ వారం స్థాయిలు**
నిరోధం: 11970,12020
మద్దతు: 11870, 11800
www.sundartrends.in

## మా ప్లాన్లతో కస్టమర్లకు అధిక ప్రయోజనం : జియో

న్యూఢిల్లీ: సగటు వినియోగదారులకు అవసరమైన దానికన్నా ఐదు రెట్లు ఎక్కువగా ఉచిత ఔట్‌గోయింగ్ కాల్స్ పరిమితిని అందిస్తున్నట్టు రిలయన్స్ జియో వెల్లడించింది. కాబట్టి ఈ వినియోగదారులు కాల్స్ కోసం చెల్లింపులు చేయాల్సిన అవసరం ఉండదని తెలిపింది. తమ కొత్త ప్లాన్లు పోటీ కంపెనీలకన్నా 25 శాతం అధికంగా కస్టమర్లకు విలువను అందిస్తున్నట్టు పేర్కొంది. భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఔట్‌గోయింగ్ కాల్స్‌పై పరిమితిని తొలగించిన నేపథ్యంలో రిలయన్స్ జియో తాజా ప్రకటన చేసింది. ఈ రెండు కంపెనీలు తమ కొత్త ప్లాన్లను ప్రకటించిన తర్వాత జియో తన ప్లాన్లను వెల్లడించింది. ఈ ప్లాన్లు ఇంతకు ముందటి ప్లాన్ల ధరలతో పోల్చితే 40 శాతం వరకు అధికంగా ఉన్నాయి. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు 28 రోజుల కాలపరిమితి కలిగిన ప్లాన్‌లో భాగంగా ఇతర నెట్‌వర్క్‌లకు ఔట్‌గోయింగ్ కాల్స్‌పై 1,000 ఉచిత నిమిషాలు, 84 రోజుల ప్లాన్‌పై 3,000 నిమిషాలు, 365 ప్లాన్‌పై 12,000 నిమిషాలు అందించాయి. ఈ పరిమితి దాటితే ఔట్‌గోయింగ్ కాల్స్‌పై నిమిషానికి 6 పైసలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే అపరిమిత ప్లాన్ల కింద అపరిమిత కాలింగ్ సదుపాయాన్ని అందిస్తున్నట్టు శుక్రవారంనాడు ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ప్రకటించాయి. వీటిపై ఎలాంటి షరతులు లేవని వెల్లడించాయి. ఈ నేపథ్యంలో జియో తన ప్లాన్ల ద్వారా వినియోగదారులకు కలిగే ప్రయోజనాన్ని ప్రకటించింది.

**ఫారం గేటు అమ్మకం ధరలు ( నెక్100 గుడ్లు)**

| | | | |
|---|---|---|---|
| 8వ తేదీకి.. | | విజయవాడ | 452 |
| హైదరాబాద్ | 428 | విశాఖపట్నం | 460 |
| 9వ తేదీకి.. | | వరంగల్ | 431 |
| చిత్తూరు | 453 | డజను గుడ్లు రూ. | 66 |
| గోదావరి | 452 | | |



**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 83 | విజయవాడ | 93 |
| వరంగల్ | 83 | గుంటూరు | 93 |
| మహబూబ్‌నగర్ | 83 | ఒంగోలు | 95 |
| కరీంనగర్ | 83 | చిత్తూరు | 80 |
| కర్నూలు | 83 | నెల్లూరు | 80 |
| విశాఖపట్నం | 88 | అనంతపురం | 76 |
| గోదావరి | 88 | | |



## ఆస్ట్రో గైడ్

## 12150 పైన ముగిస్తే బుల్లిష్

**(డిసెంబరు 9-13 తేదీల మధ్య వారానికి)**

**గత వారం నిఫ్టీ : 11922 (-135)**



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం పాయింట్ల 12137-11889 పాయింట్ల మధ్యన కదలాడి 135 పాయింట్ల నష్టంతో 11922 వద్ద వారం కనిష్ఠ స్థాయిలో నెగెటివ్‌గా ముగిసింది.

- గత మంగళ, శుక్రవారాల నడుమ (2, 6 తేదీలు) చంద్రుడు కుంభ, మీన రాశుల్లో సంచరించిన సమయంలో ఏర్పడిన పరిధి 12069-11889. ఇది రాబోయే మూడు వారాలకు కీలకం. గరిష్ఠ స్థాయికి పైన బుల్లిష్‌గాను, కనిష్ఠ స్థాయికి దిగువన బేరిష్‌గాను భావించాలి.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 11979, 11734, 11425, 11463 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం అన్ని డీఎంఏల కన్నా పైన ఉంది. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్) పైకి రావడం దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్ అయిందనేందుకు సంకేతం. ఈ వారాంతంలో 12150 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి :** 12150 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 11700
**నిరోధ స్థాయిలు :** 12075, 12150 (12000 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు :** 11775, 11700 (11850 దిగువన బేరిష్)

### ఇన్వెస్టర్లకు సూచన...

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు

**గ్రహగతులు**

- మేషంలోని భరణి పాదం 1 నుంచి మిథునంలోని ఆర్ద్ర పాదం 2 మధ్యలో చంద్ర సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 2-4 మధ్యలో రవి సంచారం
- వృశ్చికంలోని అనూరాధ పాదం 1-3 మధ్యలో బుధ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 3 నుంచి ఉత్తరాషాఢ పాదం 1 మధ్యలో శుక్ర సంచారం
- తులలోని స్వాతి పాదం 4 నుంచి విశాఖ పాదం 1 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 4లో వృశ్చిక నవాంశలో శని సంచారం
- ధనుస్సులోని మూల పాదం 3లో మిథున నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 3లో రాహువు, ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1లో కేతువు సంచారం

### ఉదయం సెషన్ మెరుగు (సోమవారానికి)

**తిథి :** మార్గశిర శుక్ల త్రయోదశి; నక్షత్రం : భరణి

**అప్రమత్తం :** మృగశిర, చిత్త, ధనిష్ట, నక్షత్ర జాతకులు, వృషభ, కన్య రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 9.54**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా/మెరుగ్గా ప్రారంభమై 9.30 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 1.30 మెరుగ్గా ఉండి తదుపరి 3.15 వరకు నిలకడ/నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది. తిరిగి చివరిలో మెరుగ్గా ట్రేడ్ కావచ్చు.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ఎటిపి కన్నా పైన ఉంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 11965, 12000**

**మద్దతు స్థాయిలు : 11885, 11850**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.



# సభకు సై

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలా.. వారం సరిపోతుందా అనే అంశంపై ఆ పార్టీ పెద్దలు తర్జనభర్జన పడుతున్నారు. ఆరు నెలల పాలనలోనే.. నవరత్నాల పేరిట ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చామని.. అమలు చేసిన ఒక్కో పథకం గురించి ఒక్కో రోజు ప్రస్తావించినా.. తొమ్మిది రోజులూ సరిపోతాయని ముఖ్యమంత్రి జగన్ భావిస్తున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి. సోమవారం స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశమవుతుంది. దీనికి సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆర్థిక, శాసన సభావ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంతరెడ్డి తదితరులు హాజరవుతారు. సభలో చర్చనీయాంశాలు, ఎన్నిరోజులు సమావేశాలు నిర్వహించాలో తుది నిర్ణయం తీసుకుంటారు.

### అస్త్రశస్త్రాలు సిద్ధం..

సభలో ప్రతిపక్షంపై రాజకీయ దాడికి వైసీపీ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంది. ప్రతిపక్షానికి చెందిన శాసనసభ్యులను తనవైపునకు లాక్కునే మంత్రాంగానికి ఇప్పటికే తెరలేపింది 'మినిస్టర్ బ్రదర్స్' పేర్ని నాని, కొడాలి నాని ఇప్పటికే గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని తమవైపు తెచ్చుకున్నారు. మరో ఆరుగురు శాసనసభ్యులను ఆకర్షిస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా, టీడీపీకి ప్రధాన విపక్ష హోదా ఉండదని అధికార పక్షం ఎత్తులు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు టీడీపీ ఎమ్మెల్యేలతో మంతనాలు సాగిస్తున్నారని.. ఆర్థిక మూలాలను దెబ్బ తీసే తంత్రంతో వారిని తమ వైపు లాక్కునే రాజకీయానికి తెరలేపారని వార్తలు వస్తున్నాయి. సభలో ప్రజాప్రాముఖ్య అంశాల కంటే తన వారిని కాపాడుకోవడంలోనే చంద్రబాబు నిమగ్నమయ్యేలా చూడాలన్నదే వైసీపీ ఎత్తుగడగా తెలుస్తోంది.

### టీడీపీ హయాంపై కన్ను..

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన 'దిశ' హత్యాచారం, నిందితుల ఎన్‌కౌంటర్ అంశాల నేపథ్యంలో.. శీతాకాల సమావేశాల తొలిరోజున రాష్ట్రంలో మహిళా రక్షణ అంశాన్ని స్వల్ప వ్యవధి చర్చకు పాలకపక్షం తీసుకోనుంది. మహిళల భద్రతకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాటు.. గతంలో తెలుగుదేశం పాలనలో చోటు చేసుకున్న ఉదంతాలనూ ప్రస్తావించాలని భావిస్తోంది.

## 11న మంత్రివర్గ సమావేశం

▸▸ పలు కీలక బిల్లులకు ఆమోదం

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. పలు కీలక అంశాలపై సత్వర నిర్ణయం తీసుకునే విధంగా ప్రతి నెలా రెండు, నాలుగో బుధవారాల్లో కేబినెట్ సమావేశం నిర్వహించాలని సీఎం జగన్ నిర్ణయించారు. సోమవారం నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయడం, ప్రైవేటు వాహన చార్జీల నియంత్రణ, మహిళల భద్రత, లైంగిక వేధిపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు, దేవాలయ కమిటీ సభ్యుల సంఖ్య పెంపు వంటి అంశాలపై రూపొందించిన బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. వాటితో పాటు మరికొన్ని టేబుల్ ఐటంలకూ మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభిస్తుందని అధికారులు చెప్తున్నారు.



నేటి నుంచి అసెంబ్లీ

# ప్రభుత్వాన్ని నిలదీద్దాం

## రోజుకో అంశంపై నిరసన.. తొలి రోజు ఉల్లి, నిత్యావసర ధరలు

▸▸ అసెంబ్లీ ఆవరణ నుంచి పాదయాత్ర

▸▸ రైతు సమస్యలు, కార్మికుల ఆత్మహత్యలు..


▸▸ ఆర్థిక సంక్షోభం, పథకాల కోతపై పట్టు

▸▸ 15 రోజులు సభ జరపాలని డిమాండ్

▸▸ టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిర్ణయం

▸▸ వారితో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను శాసనసభ సమావేశాల్లో లేవనెత్తి సమర్థంగా చర్చించాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. రోజుకో అంశంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని.. మొత్తంగా 21 అంశాలను ప్రస్తావించాలని నిశ్చయించింది. తొలిరోజు సోమవారం ఉల్లి ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంపై నిరసన చేపట్టనుంది. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారం తన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా పై నిర్ణయాలు తీసుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం ఉదయమే బయల్దేరి వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి శాసనసభకు వెళ్తారు. నిత్యావసర వస్తువుల పెరుగుదలపై నిరసన వ్యక్తం చేస్తూ అసెంబ్లీ ఆవరణ బయటి నుంచి పాదయాత్రగా వెళ్తారు. రోజుకో అంశంపై ఈ రకంగా నిరసన తెలపాలని నిర్ణయించారు. ఈ మధ్యకాలంలో ప్రజలు ఎదుర్కొన్న 21 అంశాలపై చర్చకు పట్టుబట్టనున్నారు. 'ఈ ఆరు నెలల్లో రాష్ట్రం దళారుల రాజ్యంగా మారిపోయింది. ఉల్లి నుంచి నిత్యావసర వస్తువుల వరకు ధరలు ఆకాశాన్నంటాయి. దీనిపై ప్రభుత్వం సకాలంలో స్పందించి ధరలు తగ్గించాలని డిమాండ్ చేద్దాం. రూ.3 వేల కోట్లతో ఏర్పాటు చేస్తానన్న ధరల స్థిరీకరణ నిధి ఏమైందని ప్రశ్నిద్దాం. ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకోకపోవడం వల్ల ప్రజలు అధిక ధరలు పెట్టి ఇబ్బందులు పడుతున్నారు. రైతుల సమస్యలు, రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంపైనా సభలో చర్చిద్దాం. వేరుశనగ, పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడం, ధాన్యం కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా నిర్వహించడం తదితర అంశాలపై నిలదీద్దాం. వేరుశనగ ధర క్వింటాలుకు రూ.8,200 నుంచి 4,100కి పడిపోయింది. మొక్కజొన్న ధర క్వింటాలుకు రూ.600 వరకు తగ్గిపోయింది. భారీ వర్షాలతో ఉత్పత్తి దెబ్బతిన్నది. మహిళలకు రక్షణ లేదు. వారిపై అఘాయిత్యాలు.. ఇసుక కొరత, భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్యలు.., ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు-వారి ఆత్మహత్యలు.. నదుల అనుసంధానం-పోలవరం.. అమరావతి, నూతన మద్యం విధానం, స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం, ఉపాధి హామీ పనుల బిల్లుల పెండింగ్, రైతుల రుణమాఫీ, గృహనిర్మాణం అంశాలపై చర్చకు పట్టుబడదాం. మన పార్టీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెట్టడంపైనా చర్చకు డిమాండ్ చేద్దాం. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును సీబీఐకివ్వాలని వైసీపీ గతంలో డిమాండ్ చేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక నోరుమెదపడం లేదు. ఆ కేసు దర్యాప్తుపైనా చర్చకు పట్టుబడదాం. రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోవడం, ఆర్థిక సంక్షోభం-దుబారా ఖర్చులు, నవరత్నాల పేరుతో ఉన్న పథకాల రద్దు, పథకాల్లో కోతలు, పత్రికా స్వాతంత్ర్యాన్ని మంటగలిపేలా జీవో 2430 జారీ తదితర అంశాలన్నీ లేవనెత్తుదాం. వీటన్నిటిపై చర్చ జరగాలంటే కనీసం 15 రోజులు సమావేశాలు జరపాలి. ఆ మేరకు బీఏసీ సమావేశంలో పట్టుబడదాం' అని నిర్ణయించినట్లు తెలిసింది.



# రంగు పోతుందా?

(మొదటి పేజీ తరువాయి)

కొట్టుకుంటున్నారు. జనవరి 10న ప్రారంభించి మార్చి నాటికి స్థానిక ఎన్నికలు పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు విన్నవించింది. ఈ సమయంలో ఎన్నికల నియమావళి అమలులో ఉంటుంది. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వ భవనాలు, ఆస్తులపైన పార్టీలకు చెందిన రంగులు, నేతల చిత్రాలు కనిపించవద్దు. మరి... ఇప్పటికే రంగులు పూసేసిన గ్రామ సచివాలయాలు, ట్యాంకులను ఏం చేయాలి? పైగా పంచాయతీ భవనాల్లో పోలింగ్ బూత్‌లు కూడా ఏర్పాటవుతాయి. విగ్రహాలో, జెండా దిమ్మెలో అయితే ముసుగులు కప్పేయవచ్చు. భవనాల చుట్టూ వేసిన ఆకుపచ్చ-తెలుపు-నీలం రంగులను కవర్ చేసేది ఎలా? మరి ట్యాంకులను మూసేదెలా? ఇవేవీ కుదిరేవి కావు. ఎన్నికల నియమావళిని నిక్కచ్చిగా అమలు చేయాలంటే... ఆయా రంగులను చెరిపివేసి, మళ్లీ తెల్ల రంగు వేయాల్సిందే! అంటే... వేయడానికి ఒక ఖర్చు, తీసేయడానికి మరో ఖర్చు! ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మళ్లీ రంగులు వేయాల్సిందే అంటే... మళ్లీ మళ్లీ ఖర్చు.

### ఇలా చెల్లుతుందా?

గ్రామీణ ప్రజలకు పలు రకాల సేవలందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 12,918 గ్రామ పంచాయతీలను 12వేల పైచిలుకు సచివాలయాలుగా మార్పు చేసింది. పంచాయతీ భవనాలను సచివాలయ భవనాలుగా మార్చే క్రమంలో ఆ భవనాలకు రంగులు వేస్తున్నారు. అదికూడా... ఆకుపచ్చ, నీలం, తెలుపు రంగులో ఉండాలంటూ నమూనా ఫొటోలను కూడా ఉత్తర్వుల తోపాటు జత చేశారు. ఈ రంగులు అచ్చంగా వైసీపీ జెండాను పోలి ఉన్నాయి. ప్రభుత్వ భవనాలకు రాజకీయ రంగులు వేయాలని అధికారిక ఉత్తర్వులు ఇవ్వడం ఇదే మొదటిసారి. సర్కారు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీ నిధులతో ఆ భవనాలకు ఈ రంగులు వేయించారు. ఇది వాటికి భారంగా మారింది. దీంతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్-ఇన్-చీఫ్ కూడా మరో మెమో జారీచేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులన్నింటినీ ఆకుపచ్చ, నీలం, తెలుగు రంగులోకి మార్చాలని అన్ని జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలకు ఆదేశాలిచ్చారు. ఆయన ఆదేశాలను అమలు చేసే క్రమంలో గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వాటర్‌ట్యాంకులను వైసీపీ జెండా రంగులోకి మారుస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా పంచాయతీ, ప్రభుత్వ ఆస్తులన్నీ వైసీపీ జెండా రంగులోకి మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాలకు ఒక పార్టీకి పోలిన రంగులు వేయడంపై అభ్యంతరాలు వ్యక్తం చేసినా ప్రభుత్వ అధికారులు లెక్కచేయడం లేదు. దీనిపై ఎవరైనా కోర్టుకు వెళ్తే పంచాయతీరాజ్‌శాఖ ఇచ్చిన మెమో రద్దయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఆ సంగతి పక్కనపెడితే... ఎన్నికల నియమావళి వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

## స్పీకర్ మాట నిలబెట్టుకోవాలి

▸▸ అసెంబ్లీ కవరేజీకి అందరికీ పాస్‌లు ఇవ్వాలి: ఏపీయూడబ్ల్యూజే

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల కవరేజీకి కొన్ని చానళ్లకు పాస్‌లు ఇవ్వకపోవడాన్ని ఏపీయూడబ్ల్యూజే ఖండించింది. అందరికీ పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయంలో స్పీకర్ తమ్మినేని సీతారాం మాట తప్పారని, ఆయన నిర్ణయం గర్హనీయమని పేర్కొంది. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మూడు చానళ్లకు లైవ్ కవరేజీని నిలిపివేసిన స్పీకర్, తర్వాత ఆ నిర్ణయంపై పునరాలోచన చేస్తున్నామని స్పష్టంగా తెలిపారని గుర్తుచేసింది. సమావేశాలకు ఆ చానళ్ల ప్రతినిధులకు పాస్‌లు ఇవ్వకపోతే రాష్ట్రంలో స్పీకర్ పర్యటనను అడ్డుకుంటామని యూనియన్ అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ ఓ ప్రకటనలో తెలిపారు.

## చార్జీలతో వెయ్యికోట్ల భారం: యనమల

▸▸ జగన్ రెండోసారి మడమ తిప్పారు: కన్నా

▸▸ 11న రాష్ట్రవ్యాప్త నిరసనలు: వామపక్షాలు

అమరావతి, హైదరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ చార్జీలు పెంచడం వల్ల పేదలపై అదనంగా వెయ్యికోట్ల భారం పడుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు విమర్శించారు. 'ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం. ఆర్టీసీ బకాయిలు, అప్పులు, నష్టాలు ప్రభుత్వమే భరిస్తుందని జగన్ కోతలు కోశారు. ఇప్పుడు ఆర్టీసీ చార్జీలు పెంచి పేదలపై వెయ్యికోట్ల భారం వేశారు' అని ఆదివారం అన్నారు. రేట్లభారం పేదలపై పడకుండా చేయాలని డిమాండ్ చేశారు.

### రివర్స్ గేర్‌లో.. జెట్ స్పీడుతో వెనక్కి..

మాట తప్పను.. మడమ తిప్పను అని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి సీఎం అయ్యాక జగన్ ఆర్టీసీ చార్జీలు పెంచి రెండో యూటర్న్ తీసుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ట్విటర్‌లో ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని రివర్స్ గేర్‌లో జెట్ స్పీడ్‌తో వెనక్కిపరుగెత్తిస్తున్నారని విమర్శించారు.

### అసలే ఆర్థిక మాంద్యం..

మరోవైపు పెంచిన ఆర్టీసీ చార్జీలను ఉపసంహరించుకోవాలని, ఉల్లి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు తెలిపారు. రైతు బజార్లలో ఉల్లి కిలో రూ.25కే అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందే, తప్ప అమలు చేయలేకపోయిందన్నారు. నిరసనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

## అసెంబ్లీలో నిలదీస్తాం: దేవినేని ఉమ

విజయవాడ, డిసెంబరు 8: వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణ చార్జీలను పెంచడం వల్ల ప్రజలపై సంవత్సరానికి రూ.700 కోట్ల భారం పడుతుందని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. జగన్ చేతకానితనం, అసమర్థత వల్లే చార్జీలు పెంచారని విమర్శించారు. ఆదివారం విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బస్సు చార్జీల పెంపుపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. అమరావతి ప్రాంతంలో 144, రాష్ట్రవ్యాప్తంగా 30 పోలీస్ సెక్షన్లు ఎందుకు విధించారని ఆయన ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఉల్లిపాయల కోసం ప్రజలు కిలోమీటర్ల మేరకు లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. రాష్ట్రంలో బెల్టు షాపులు, బెట్టింగ్, ఇసుక మాఫియా యథేచ్ఛగా నడుస్తున్నాయని ఆరోపించారు. ఏ జిల్లాలోనూ ఎస్పీలు గత ఆరునెలల నుంచి పనిచేసే పరిస్థితి లేదన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ సామాన్యుడు బతకలేని విధంగా జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. మొన్నటి వరకూ ఇసుక భారం మోపిన ప్రభుత్వం... ఇక ఆర్టీసీ చార్జీల భారం మోపనుందని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యేలు, మంత్రులను అచ్చోసిన అంబోతుల్లా సీఎం జగన్ గ్రామాలపైకి వదిలారని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విమర్శించారు. వారి తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నారు.



ఆంధ్ర భవన్ వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు

## కేసులకు భయపడే 'హోదా' మరిచారా?

▸▸ సీఎం జగన్‌పై ఎన్ఎస్‌యూఐ ఆగ్రహం

▸▸ ఏపీ భవన్ వద్ద విద్యార్థుల ధర్నా

న్యూఢిల్లీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'సీఎంగారూ! మీ అవినీతి కేసులకు భయపడే.. ప్రత్యేక హోదా హామీని మరిచారా' అని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంస్థ ఎన్ఎస్‌యూఐ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆగ్రహం వ్యక్తంచేసింది. హోదా ఇస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారమిక్కడ ఆంధ్ర భవన్‌వద్ద ప్లకార్డులు, జెండాలు, బ్యానర్లు చేతపట్టి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కొందరు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. అనంతరం నాగమధు, ధ్రువకుమార్‌రెడ్డి తదితరులు మీడియాతో మాట్లాడారు. '20 మంది ఎంపీలను గెలిపిస్తే, ప్రధానిపై ఒత్తిడి తెచ్చి, ప్రత్యేక హోదా సాధించి తీరతామని ఎన్నికల ముందు మీరు (జగన్) ప్రగల్భాలు పలికితే.. ప్రజలంతా నమ్మి.. మరో రెండు స్థానాలు ఎక్కువగా.. 22 మందిని గెలిపిస్తే మీరు చేస్తున్నదేంటి? మీ స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడతారా? కేంద్రంపై పోరాడే దమ్మూ, ధైర్యం లేవా? హోదా తేవడం చేతకాకపోతే మీ ఎంపీలతో తక్షణమే రాజీనామాలు చేయించండి' అని జగన్‌పై విరుచుకుపడ్డారు. లేకుంటే సోమవారం నుంచి వారం రోజులపాటు ఢిల్లీలో వైసీపీ ఎంపీల ఇళ్లను ముట్టడిస్తామని, వారి వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. జగన్ తన అవినీతి కేసుల కోసమే ప్రధానితో పోరాడలేక హోదాను తాకట్టు పెడుతున్నారని, ఆయన ముందు మోకరిల్లుతున్నారని ధ్వజమెత్తారు. ప్రధానిని కలిసినప్పుడు ఏమడుగుతున్నారో మీడియాకు కూడా చెప్పకుండా ముఖం చాటేస్తున్నారని ఎద్దేవాచేశారు. మోదీని కలవడానికి లోపలకు వెళ్లి ఏంమాట్లాడుతున్నారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా కోసమే ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నేతలు అనురేఖ, తిరుమలేశు, అమృత్‌తేజ, చందు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక తప్పిదాలు .. 'లెఫ్ట్'కు అలవాటే!

▸▸ బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ధ్వజం

న్యూఢిల్లీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చారిత్రక తప్పులు చేయడం వామపక్షాలకు సర్వసాధారణమైన విషయమేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. దిశ హత్య కేసులో దోషులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తొలుత స్వాగతించి.. తర్వాత యూటర్న్ తీసుకోవడంపై ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. వామపక్షాలు చేసిన కోట్ల తప్పుల్లో ఇదొకటని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ విషయంలో తన అభిప్రాయానికి వ్యతిరేకంగా అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి.. ముందుచేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నారాయణకు పార్టీలో వ్యక్తిగత స్వేచ్ఛలేదని దీనినిబట్టి తెలుస్తోందని చెప్పారు. ఆయన ముక్కుసూటి మనిషి.. రాజకీయాలకు అతీతంగా తాను అభిమానించే వ్యక్తి అని.. అందుకే తన అభిప్రాయాన్ని వెలిబుచ్చానని తెలిపారు.

## రైతులకు ఆత్మహత్యలే శరణ్యం!

మండపేట బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్లో జరిగిన రైతు సదస్సులో పవన్ ప్రసంగించారు. అధికారం కోసం ప్రజలకు ముద్దులు పెడితేనో, పాదయాత్రలు చేస్తేనో రైతుల కడుపు నిండదని అన్నారు. అన్నదాతల్లో 60శాతం మంది కౌలురైతులే ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని కొందరు రైతులకే పరిమితం చేయడం అన్యాయమని పవన్ అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ 30 ఏళ్లు పాలిస్తే రైతులు మిగలరని, వారికి ఆత్మహత్యలే శరణ్యమని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ పాలన సక్రమంగా ఉంటే తాను నిలదీయనని, రోడ్డుల వెంట ఎందుకు తిరుగుతామని ఆయన ప్రశ్నించారు. రైతులను నిర్లక్ష్యం చేస్తే మాత్రం సహించబోమని హెచ్చరించారు. వైసీపీకీ ఉన్న 151 మంది ఎమ్మెల్యేలు రైతుల రక్తం కూడు తింటున్నారని పవన్ ధ్వజమెత్తారు. పిచ్చి మాటలు, వక్రీకరణలను మానేసి రైతులకు పనికి వచ్చేది మాట్లాడాలని హితవు పలికారు.



వెలగతోడులో రైతులతో భేటీ అయిన పవన్ కల్యాణ్

# పొట్టగొడితే పతనమే!

## వేలకోట్లు ఉన్నా సీఎం జగన్.. సొంత ఇంటికి ప్రభుత్వ సొమ్ములా?

▸▸ అన్నదాతల ధాన్యానికి చెల్లింపుల్లో జాప్యమా?

▸▸ రైతుల రక్తం కూడు తింటున్న వైసీపీ ఎమ్మెల్యేలు

▸▸ జగన్ 30 ఏళ్లు పాలిస్తే రైతులంతా ఆత్మహత్యే

▸▸ గిట్టుబాటు ధర రూ.2500లకు పెంచాలి

▸▸ 3 రోజుల్లో కర్షకుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ లేదంటే కాకినాడలో ఈ నెల 12న దీక్ష చేస్తా

▸▸ మండపేట సభలో ప్రభుత్వానికి పవన్ హెచ్చరిక

కాకినాడ(ఆంధ్రజ్యోతి), మండపేట, డిసెంబరు 8: 'రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. రైతులంటే మీకంత చులకనా? రైతుల పొట్ట కొడితే ప్రభుత్వం కూలిపోవడం ఖాయం' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుబిడ్డగా అన్నదాతల సమస్యల పరిష్కారానికి తాను నడుం కట్టానని, ప్రభుత్వాన్ని ప్రశ్నించి రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడతానని చెప్పారు. కుంగిపోకుండా ఉండాలని రైతులకు ధైర్యం చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా మండపేటలో ఆదివారం పవన్ పర్యటించారు. రైతులతో భేటీ, రైతు సదస్సుతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా వెలగతోడులో రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి కష్టాలు తెలుసుకున్నారు. ఎరువులు, కూలీల ధరలు పెరిగిపోయాయని, ఈ నేపథ్యంలో ధాన్యానికి గిట్టుబాటు ధర కనీసం రూ.2,500 ఇవ్వాలని పవన్ డిమాండ్ చేశారు. పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే చాలని, అంతకుమించిన రైతుభరోసా పథకాలు అక్కర్లేదని అన్నారు. రైతు సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని తమ పార్టీ ప్రశ్నిస్తుందని చెప్పారు. ఈ దిశగా ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌కు దిశానిర్దేశం చేశారు. అనంతరం వెలగతోడులోని ఓ పొలాన్ని పరిశీలించారు. ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన చాలా రోజుల వరకూ తమ బ్యాంకు ఖాతాలో డబ్బులు పడడం లేదని రైతులు చెప్పారు. మిల్లర్లు కనీసం రశీదులు కూడా ఇవ్వడం లేదని వారు వాపోయారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'వేల కోట్ల రూపాయలు ఉన్నా సొంత ఇంటికి జగన్ ఏమీ చేసుకోలేరా? మరమ్మతుల కోసం ప్రభుత్వ బిల్లులు ఇస్తున్నారు. రైతులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యమెందుకు?' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వానికి మూడు రోజుల గడువు ఇస్తున్నట్లు అల్టిమేటం జారీ చేశారు. ఈ లోగా సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 12న కాకినాడలో నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు.



తూర్పుగోదావరి జిల్లా మండపేట పర్యటనలో ఓ రైతును సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జనసేనాని

### జగనన్న ఉల్లిపాయ పథకం పెట్టుకో..

"జగన్ గెలిస్తే అద్భుత రాజ్యం వస్తుందని అన్నారు. కానీ జరుగుతోంది ఇంకొకటి. నేను తిరుపతి వెళ్తే కిలో ఉల్లిపాయలు రూ.180 వరకూ అమ్ముతున్నట్లు చెబుతున్నారు. అందుకే జగన్‌కు ఒకటే చెబుతున్నా. కిలో ఉల్లి రూ.25కి ప్రజలకు సరఫరా చేసి 'జగనన్న ఉల్లిపాయ పథకం' అని పేరు పెట్టుకోండి" అని పేర్కొన్నారు. అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలోనూ పవన్‌ప్రసంగించారు. కుల, మత అంశాలతోపాటు దిశ ఘటనపై తాను చేసిన వ్యాఖ్యలను వైసీపీ నేతలు ఎలా వక్రీకరించారో వివరించారు. రైల్వేకోడూరులో తమ పార్టీకి చెందినవారి బత్తాయి తోటలు నరికివేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ జరిగిన ఓ సమావేశంలో తమ పార్టీ నాయకుడు మాట్లాడిన మాటలకు కులం రంగు పులిమి తనను ఓ సామాజికవర్గానికి శత్రువుగా చూపిస్తున్నారని ఆరోపించారు. తనకు అందరూ సమానమేనని చెప్పారు.

## క్రమశిక్షణ లేకే ఓడిపోయాం

▸▸ కార్యకర్తల తీరుపై పవన్ అసహనం

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడానికి జనసైనికుల్లో క్రమశిక్షణ లేకపోవడమే కారణమని పవన్‌కల్యాణ్ అన్నారు. క్రమశిక్షణతో ఎన్నికల్లో పనిచేసి ఉంటే పార్టీ గెలిచేదని కేడర్‌ను ఉద్దేశించి ఆగ్రహంగా వ్యాఖ్యానించారు. రైతుల కష్టాలపై మండపేటలో పవన్ ప్రసంగిస్తుండగా కార్యకర్తలు అరుపులు, కేకలతో అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో పవన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'అన్నంపెట్టే రైతు కష్టాలు చెబుతున్నపుడు మీరు అరుస్తుంటే నాకు ఎలా వినిపిస్తుంది? నిజంగా ఇబ్బందిగా ఉంది. క్రమశిక్షణ లేకపోతే మీరేమీ చేయలేరు. మీరు సరిగ్గా లేకపోవడం వల్లే నేను ఓడిపోవాల్సి వచ్చింది. అది మర్చిపోకండి. క్రమశిక్షణతో వ్యవహరించి ఉంటే జనసేన గెలిచి ఉండేది' అని ఆగ్రహంగా వ్యాఖ్యానించారు.

## వైసీపీలోకి గోకరాజు!

▸▸ నేడు జగన్ సమక్షంలో చేరిక



అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఆ పార్టీకి షాకిచ్చారు. ఆయన సోమవారం తన కుటుంబ సభ్యులతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరనున్నారు. సోమవారం అసెంబ్లీ తొలిరోజు ముగిశాక ముఖ్యమంత్రి తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. అక్కడ గంగరాజు, కుమారుడు రంగరాజు, సోదరులు నరసింహరాజు, రామరాజు, పశ్చిమగోదావరి జిల్లా నేతలు ఆయన్ను కలుస్తారు. మధ్యాహ్నం సీఎం అధికారులతో పలు శాఖలపై సమీక్షలు జరుపుతారు. సాయంత్రం ఆయన సమక్షంలో గంగరాజు బృందం వైసీపీ తీర్థం పుచ్చుకుంటుంది. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలని.. వచ్చే ఎన్నికల్లో అధికార సాధనే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీకి ఈ పరిణామం పెద్ద షాకేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న గంగరాజు కుటుంబ సభ్యులతో వైసీపీలో చేరుతుండడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## వివేకా కేసు సీబీఐకి అప్పగించాలి: కన్నా

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌కు ఆదివారం లేఖ రాశారు. ఈ ఏడాది మార్చిలో హత్య జరిగితే, ఇప్పటి వరకు నిందితులను పట్టుకోలేదని, దర్యాప్తులో పోలీసులు విఫలమయ్యారని పేర్కొన్నారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా పరిగణించటం లేదన్నారు. అందువల్ల ఈ కేసును సీబీఐకి అప్పగించటమే ఉత్తమమని సూచించారు.

## ఉద్యోగులకు రాజకీయాలెందుకు?

▸▸ అభివృద్ధికి సహకరించండి: మంత్రి కన్నబాబు

కాకినాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాలకు రాజకీయాలు అవసరమా? అని మంత్రి కురసాల కన్నబాబు ప్రశ్నించారు. ఉద్యోగ జేఏసీలు ఏర్పడింది ధర్నాలు చేయడానికి కాదని, తమ సమస్యల పరిష్కారానికి మాత్రమేనని అన్నారు. ఏ ఉద్యోగీ పార్టీ జెండాలతో తిరగకూడదని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, తద్వారా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అర్హులైన పేదలకు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేయాలన్నారు. అలాంటి వారిని సత్కరించడానికి సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఆదివారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలు తమ పరిధి దాటకూడదని సూచించారు. ప్రతిదాన్నీ రాజకీయాలు చేయకుండా తోటి ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి న్యాయం చేయాలని సంఘాలకు సూచించారు. ఉద్యోగులకు ఉద్యోగులే శత్రువులని, అలా కాకుండా సంఘాలన్నీ సంఘటితంగా ఉండాలని సూచించారు. గత పదేళ్ల నుంచి రాష్ట్రంలో కారుణ్య నియామకాలు తప్ప, కొత్త ఉద్యోగాలు రాలేదని, జగన్ సీఎం కాగానే 4నెలల్లో 4 లక్షల ఉద్యోగాలిచ్చి చరిత్ర సృష్టించారని కొనియాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ, 2010లో తమ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించామని, ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారరావు, కార్యదర్శి శ్రీకాంత్‌రాజు పాల్గొన్నారు.



## మిన్నంటిన రోదనలు

ఒకరిదేమో ఉత్తరప్రదేశ్.. మరొకరిదేమో బిహార్.. ఇలా అనేక ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా తమ వారికోసం మిన్నంటిన రోదనలతో వెతుకులాడుతున్నారు. ఢిల్లీలోని ఎల్‌హెచ్‌ఎంసీ ఆస్పత్రిలో ఆదివారం కనిపించిన దృశ్యాలివి. అనాజ్ మండి ఫ్యాక్టరీ ప్రమాద విషయం తెలిసి.. మృతులు, క్షతగాత్రుల బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. బిహార్‌కు చెందిన వాజిద్ అలీ(20) ఆస్పత్రి మార్చురీ వద్ద తన సోదరుడి మృతదేహాన్ని చూసి కుప్పకూలిపోయాడు. మహ్మద్ సహ్మత్ (14), మహ్మద్ మహబూబ్ (13) అనే బాలుర కోసం ఆ ఊరి వాళ్లు వెతుకుతున్నారు. వారిలో మహబూబ్ చనిపోయాడు. ఈ ప్రమాదంలో ఇమ్రాన్ (32), ఇక్రాన్ (35) అనే తన ఇద్దరు బంధువులు గాయపడ్డారని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్ తెలిపాడు. 18 ఏళ్ల మహ్మద్ అతాముల్ చనిపోగా.. సాజిద్ (23), వాజిర్ (17) జాడ తెలియాల్సి ఉంది.

# బతుకులు బుగ్గి

(మొదటి పేజీ తరువాయి)

బ్యాగుల తాలూకు పొగ గాఢమైన వాసనతో దట్టంగా కమ్ముకుంది. బయట పడే మార్గం కనిపించలేదు. పైగా... చలికాలం కావడంతో కిటికీలన్నీ మూసేసి పడుకున్నారు. దీంతో... పొగ బయటికిపోయే మార్గమే కనిపించలేదు. ఫలితంగా ఎక్కువమంది ఊపిరి ఆడకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారు. బాధితులంతా బిహార్‌తోపాటు ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న రాష్ట్రాల నుంచి బతుకుతెరువుకోసం వచ్చిన వలస జీవులే! అందులోనూ... 14 నుంచి 20 ఏళ్లలోపు వయసున్న వారే ఎక్కువమంది.

### ఇరుకు గల్లీలు... మూసిన కిటికీలు

తెల్లవారుజామున 5 గంటల సమయంలో మంటలు మొదలవగా... 5.22 గంటలకు అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. 30కి పైగా అగ్నిమాపక వాహనాలు... 150 మంది సిబ్బంది అనాజ్‌మండీకి బయలుదేరారు. కానీ... ఇరుకు ఇరుకు గల్లీలు కావడంతో మంటలు వ్యాపించిన భవంతిని చేరుకోవడానికి చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. మూసి ఉన్న కిటికీల గ్రిల్స్ కత్తిరించడానికి మరికొంత సమయం పట్టింది. ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రులందరినీ వివిధ ఆస్పత్రులకు తరలించారు. వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉంది.



అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన భవంతి లోపలి వస్తువులు



అగ్ని ప్రమాదం జరిగిన భవంతి దగ్గర భారీగా గుమిగూడిన జనం

### కాటేసిన కార్బన్ మోనాక్సైడ్

కాలిన గాయాలకంటే... అలుముకున్న పొగే ఎక్కువమందిని బలితీసుకుంది. 3, 4 అంతస్తుల్లో పూర్తిగా దట్టమైన పొగ వ్యాపించిందని, అందులోనూ ప్రమాదకరమైన కార్బన్ మోనాక్సైడ్ (సీవో) అత్యధికంగా ఉందని ఎన్డీఆర్ఎఫ్ అధికారులు తెలిపారు. "అవన్నీ ఇరుకు గల్లీలు. భవంతికి సరైన వెంటిలేషన్ లేదు. ఉన్న కిటికీలను కూడా చాలా వరకు మూసి వేశారు. బాధితుల్లో అత్యధికులు ఊపిరి ఆడకపోవడం వల్లే మరణించారు" అని ఎన్డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండర్ ఆదిత్య ప్రతాప్ సింగ్ తెలిపారు. "కార్బన్ మోనాక్సైడ్ చాలా ప్రమాదకరం. దీనికి రంగు, వాసన ఉండదు. గ్యాస్, నూనెలు, బొగ్గు, కలప వంటివి పూర్తిగా కాలనప్పుడు కార్బన్ మోనాక్సైడ్ వెలువడుతుంది" అని చెప్పారు. ఎక్కువమందిని మూడో అంతస్తు నుంచే రక్షించామని చెప్పారు. "ఈ అంతస్తులో ఒక గదిలో చాలా మంది కార్మికులు నిద్రిస్తున్నారు. మొత్తం గదికి ఒకే ఒక్క చిన్న కిటికీ ఉంది" అని తెలిపారు.

### కారణం ఏమిటి?

అగ్ని ప్రమాదం జరిగిన భవంతి కింది అంతస్తులోని విద్యుత్ మీటర్లు భద్రంగా ఉన్నాయని, మంటలు అక్కడి నుంచి వ్యాపించలేదని విద్యుత్ సరఫరా సంస్థ బీవైపీఎల్ ప్రకటించింది. 'అంతర్గత వ్యవస్థ' లోపంవల్లే మంటలు వ్యాపించి ఉంటాయని తెలిపింది. మరోవైపు... ఈ భవంతికి అగ్నిమాపక శాఖ 'ఫైర్ సేఫ్టీ' అనుమతి కూడా లేదు. అందులో నడుస్తున్న కర్మాగారాలకూ అనుమతుల్లేవు. అవన్నీ చట్ట విరుద్ధంగానే ఏర్పడ్డాయి. ఈ ప్రమాదంతర్వాత భవనం యజమాని రెహాన్‌ను, ఆయన మేనేజర్ ఫర్కాన్‌ను పోలీసులు అరెస్టుచేశారు. వీరిపై ఐపీసీ 304, సెక్షన్ 285 కింద కేసులు పెట్టారు.

## అతి భయానకం

- ఢిల్లీ అగ్నిప్రమాదంపై మోదీ ట్వీట్
- బాధితులను ఆదుకోవాలి: సోనియాగాంధీ
- ఘటన తీవ్రంగా కలచివేసింది: రాహుల్



ఢిల్లీలోని అనాజ్ మండీ ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని అతి భయానక ఘటనగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఎంతో మంది ఆప్తులను కోల్పోవడం ఆందోళన కలిగించిందని ట్విటర్‌లో పేర్కొన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు. మృతులకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సంతాపం తెలిపారు. బాధితులకు యుద్ధ ప్రాతిపదికన తక్షణ సాయం అందించాలని అధికారులను అమిత్‌షా ఆదేశించారు. బాధితులకు, మృతుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివిధాలా సహాయం అందించాలని సోనియాగాంధీ కోరారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రాహుల్ గాంధీ హిందీలో ట్వీట్ చేశారు.

## 'అనాజ్'లో రాజకీయ మంటలు

- కేజ్రీవాల్ సర్కారుదే బాధ్యత: బీజేపీ
- కాదు.. మీ మున్సిపాలిటీదే: ఆప్
- ఆ రెండింటి నిర్లక్ష్యమే కారణం: కాంగ్రెస్

అనాజ్ మండీ అగ్ని ప్రమాదంపై రాజకీయ రచ్చ మొదలైంది. 'భారీ సంఖ్యలో ప్రాణాలు పోయిన ఈ ఘటనకు మీరే బాధ్యులు'.. అంటూ ఆప్, బీజేపీ పరస్పరం ఆరోపించుకున్నాయి. ప్రమాద ప్రాంతాన్ని సందర్శించిన బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు మనోజ్ తివారీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ పురి.. కేజ్రీవాల్ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. ఈ ప్రాంతంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని పలుమార్లు ఫిర్యాదులు అందినా ప్రభుత్వ సంస్థలు స్పందించలేదని తివారీ విమర్శించారు. అసలు ఈ పరిశ్రమ ఇక్కడ ఉండకూడదని, దీనిని తరలించడంలో ఢిల్లీ ప్రభుత్వం విఫలమైందని హర్దీప్ పురి ఆరోపించారు. నివాస ప్రాంతాల్లో అక్రమంగా ఉన్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ సీనియర్ నాయకుడు విజయ్ గోయల్ తప్పుబట్టారు. ఈ ఆరోపణలను ఆప్ ఖండించింది. పరిశ్రమలు అక్రమంగా కొనసాగుతున్నాయని గుర్తిస్తే వాటిని మూసివేయాల్సిన బాధ్యత మున్సిపాలిటీదేనని, బీజేపీ ఆ పని చేయకుండా ప్రమాదం నుంచి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం సిగ్గు చేటు అని ఆప్ నేత సంజయ్ సింగ్ ఎదురుదాడి చేశారు. కాగా, ఈ ప్రమాదానికి కేజ్రీవాల్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు.. బీజేపీ నేతృత్వంలోని మున్సిపాలిటీది కూడా సమాన బాధ్యత అని కాంగ్రెస్ ఢిల్లీ అధ్యక్షుడు సుభాష్ చోప్రా ఆరోపించారు.



బాధితులను పరామర్శించేందుకు ఢిల్లీలోని ఆస్పత్రిలో ఎదురుచూస్తున్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కేంద్ర మంత్రి హరిదీప్‌సింగ్ పురి, బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు మనోజ్ తివారీ తదితరులు

## నాడు ఉపహార్.. నేడు అనాజ్‌మండీ..

- దేశ రాజధానిని కుదిపేసిన అగ్నిప్రమాదాలు

అది 1997 జూన్ 13.. దేశ రాజధాని ఢిల్లీలోని గ్రీన్‌పార్క్ ప్రాంతం.. అక్కడి ఉపహార్ థియేటర్ అత్యంత ఘోరమైన అగ్ని ప్రమాదానికి సాక్షిగా నిలిచింది. సినిమాహాల్ సెల్లార్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో రేగిన అగ్నికీలల్లో 59మంది బుగ్గయిపోయారు. మరో 100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం తర్వాత ఢిల్లీలో ఆదివారం ఆ స్థాయిలో మరో ఘోరం చోటు చేసుకుంది. అనాజ్ మండీ ప్రాంతంలో రాణీ ఝాన్సీ రోడ్‌లో ఉన్న ఓ కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదం పదుల సంఖ్యలో ప్రాణాలను హరించింది. ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. ఢిల్లీలో జరిగిన కొన్ని అగ్ని ప్రమాదాల వివరాలు కాల క్రమానుసారంగా...

**2019 ఫిబ్రవరి:** కరోల్‌బాగ్ ప్రాంతంలో ఓ హోటల్‌లో మంటలు చెలరేగిన ఘటనలో 17మంది మరణించగా 8మంది గాయాలపాలయ్యారు.

**2018 నవంబరు:** కరోల్‌బాగ్‌లోని ఓ పరిశ్రమలో నలుగురు మృతిచెందారు.

**2018 ఏప్రిల్:** కోహత్ ఎన్‌క్లేవ్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మైనర్లు సహా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

**2018 జనవరి:** బవానాలోని బాణసంచా గోడౌన్‌కు మంటలు అంటుకొన్న ఘటనలో 17మంది జీవితాలు బుగ్గయ్యాయి.

**2011 నవంబరు:** నంద్ నగరి ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో 14మంది మృతిచెందగా, మరో 30మంది గాయాలపాలయ్యారు.

**1999 మే:** పాత ఢిల్లీలోని లాల్ కువాన్ ప్రాంతంలో ఉన్న ఓ రసాయనాల గోదాములో జరిగిన అగ్ని ప్రమాదం 57 మంది ప్రాణాలను హరించింది. ఈ ఘటనలో 23మంది క్షతగాత్రులయ్యారు.

## సాయం ప్రకటన..

*అగ్నిప్రమాద బాధితులకు కేంద్రం, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించాయి. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు ఇస్తామని ప్రధాని మోదీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.లక్షతోపాటు, చికిత్స ఖర్చు మొత్తం భరిస్తామని తెలిపారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించామని, వారంలోపు నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశామని చెప్పారు. ఇదే అంశంపై కేంద్ర హోంశాఖ కూడా ఢిల్లీ పోలీసుల నుంచి నివేదిక కోరింది.*

## ప్లీజ్ అబ్బు.. నన్ను కాపాడండి!.. మృతుడి చివరి ఫోన్‌కాల్

*'నేనున్న బిల్డింగ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. నేను సజీవంగా బయటకు రాలేను. ప్లీజ్ అబ్బు (నాన్న) నన్ను కాపాడండి'.. అంటూ ఢిల్లీ అగ్ని ప్రమాద మృతుడు ఇమ్రాన్ (35) తన తండ్రికి చేసిన చివరి ఫోన్ కాల్ అందరి హృదయాలనూ పిండేస్తోంది. తండ్రితో అతని చివరి మాటలను బట్టి ప్రమాద సమయంలో భవనంలో చిక్కుకుపోయిన కార్మికులు పడిన వేదన అర్థమవుతోంది. ఎగసి పడుతున్న అగ్నికీలల నుంచి తప్పించుకునే మార్గం లేక వారు ఆహుతైపోయినట్టు తెలుస్తోంది. బిహార్‌కు చెందిన షకీర్ హుస్సేన్ (28) కూడా చనిపోయే ముందు 'నేను మంటల్లో చిక్కుకున్నాను. సజీవంగా బయటకు రాలేను' అంటూ గర్భవతి అయిన తన భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. షకీర్‌కు ఇప్పటికే ముగ్గురు పిల్లలు ఉన్నారు. మార్చురీలో తన 22 ఏళ్ల సోదరుని మృతదేహాన్ని చూసిన హైదర్ అలీ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. 'బిహార్‌లో ఉన్న తల్లిదండ్రులకు నేనేం చెప్పాలి' అంటూ రోదించాడు. ప్రమాదంలో చనిపోయిన మహ్మద్ అఫ్సాద్(14)ను చూసి అతని సోదరుడు మహ్మద్ ముస్తాకీన్(18) చలించిపోయాడు. 'రేపు ఉదయమే అఫ్సాద్ మా సొంతూరు వెళ్లాలి. ఇంట్లోకి కావాల్సిన వస్తువులు కొనమని నాతో చెప్పాడు. బతుకుదెరువు కోసం ఢిల్లీ వచ్చిన అన్న గత పండగకు కూడా ఇంటికి రాలేదు. ఈ సారి రాలేడు' అని ముస్తాకీన్ ఏడుస్తూ చెప్పాడు.*

## శభాష్ శుక్లా..

ఒక్కడే 11 మందిని కాపాడాడు

భారీగా ఎగసిపడుతున్న మంటలు.. దట్టంగా కమ్ముకున్న పొగ.. లోపల ఎంతమంది చనిపోయారో.. ఎంతమంది బతికున్నారో తెలియని గందరగోళ పరిస్థితుల్లో రంగంలోకి దూకిన అగ్నిమాకప దళ సభ్యుడు రాజేశ్ శుక్లా.. ఒక్కడే 11 మందిని ప్రాణాలతో కాపాడి శభాశ్ అనిపించుకున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకోగానే ముందుగా శుక్లానే ఫ్యాక్టరీ లోపలికి వెళ్లారు. మంటల్ని ఛేదించుకుంటూ 11 మందిని బయటకు తీసుకొచ్చాడు. ఈ క్రమంలో అతని కాళ్లకు మంటలు అంటుకుని గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా.. ఆపత్కాలంలో శుక్లా చూపించిన ధైర్య సాహసాలను ఢిల్లీ హోంమంత్రి సత్యేంద్ర జైన్ కొనియాడారు. 'రాజేశ్ శుక్లా నిజమైన హీరో. ముందుగా ఆయనే లోపలికి వెళ్లి.. 11 మందిని కాపాడారు. కాళ్లకు గాయాలైనా వెరవకుండా తన విధిని నిర్వర్తించారు. అతని ధైర్యసాహసాలకు హ్యాట్సాఫ్' అంటూ జైన్ ట్వీట్ చేశారు.

## తలుపు దగ్గరే.. అందుకే బతికాం!

'మేం నిద్రిస్తున్న గదికి మంటలు వ్యాపించాయి. దాంతో నా పక్కనే ఉన్న కార్మికులను లేపి అప్రమత్తం చేశాను. మాకు నాలుగు మీటర్ల దూరంలో తలుపులు ఉండడంతో మేం ఐదుగురం ప్రాణాలతో బయటపడ్డాం. దూరంగా నిద్రిస్తున్న వారిలో చాలామంది మంటల్లో చిక్కుకున్నారు. వారు బయటపడ్డారో లేదో తెలీదు'

- ఫిరోజ్ ఖాన్, ప్రమాదం నుంచి బయటపడిన వ్యక్తి





## 85 లక్షల విలువైన అరటి పండును తిన్నాడు

*న్యూఢిల్లీ, డిసెంబరు 8: ఒక అరటి పండు ఖరీదెంతుంటుంది? మహా అయితే, నాలుగు రూపాయలు. ఆ వ్యక్తి మాత్రం రూ.85లక్షల ఖరీదు చేసే అరటి పండును తిన్నాడు. అదీ దాని 'ఖరీదు'ను తెలియకుండా తాపీగా అక్కడే తొక్క తీసి ఆబగా తినేశాడు. 'హ్మ.. ఈ పండు చాలా రుచిగా ఉంది' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ కూడా పెట్టాడు. అమెరికాలోని మియామీ బీచ్ బేసల్ షోలో ఈ ఘటన జరిగింది. అక్కడ గోడపై టేప్‌తో ఓ అరటి పండును అతికించారు. అది 1.2లక్షల డాలర్ల (రూ.85లక్షలు)కు అమ్ముడైపోయింది. డేవిడ్ డటునా అనే ఓ కళాకారుడు అక్కడికొచ్చాడు. గబుక్కున గోడకు అతికించిన ఆ అరటిపండును తీసుకొని ఆరగించాడు. డేవిడ్ చేష్టకు అక్కడి నిర్వాహకులు షాక్ అయితే, చూసేందుకు వచ్చిన ప్రజలు నవ్వు ఆపుకోలేకపోయారు. అయితే, డేవిడ్‌పై నిర్వాహకులు ఎలాంటి న్యాయపరమైన చర్యలు తీసుకోలేదు. కాకపోతే అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలని అతడిని ఆదేశించారు. అదే గోడపై అదే చోట టేప్‌తో మరో అరటి పండును అతికించినా అది అమ్ముడవలేదు.*

## నేడే కర్ణాటక ఉపఎన్నికల ఫలితాలు

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఐదు నెలల బీజేపీ ప్రభుత్వం మనుగడ సోమవారం తేలిపోనుంది. రాష్ట్రంలోని 15 స్థానాలకు ఈ నెల ఐదో తేదీన పోలింగ్ జరగ్గా ఓట్ల లెక్కింపు సోమవారం ప్రారంభం కానుంది. ఉదయం 11 గంటలలోపే ఫలితాలు వెల్లడి కానున్నాయి. అన్ని సర్వేలు బీజేపీకి పది సీట్లు రావడం ఖాయమని ప్రకటించాయి. బీజేపీకి ఏడు స్థానాలు దక్కితే యడియూరప్ప ప్రభుత్వానికి ఇబ్బంది ఉండదు. అలా కాకుంటే 14 నెలలు పాలన సాగించిన కాంగ్రెస్, జేడీఎస్‌లు మరోసారి చేతులు కలిపినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు.

# పార్లమెంటుకు నేడే పౌరసత్వ సవరణ బిల్లు

ప్రవేశపెట్టనున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. ఒక్కరోజులోనే చర్చ.. ఆమోదం కూడా

న్యూఢిల్లీ, డిసెంబరు 8: ఆరు దశాబ్దాల పౌరసత్వ చట్టంలో సవరణకు రంగం సిద్ధమైంది. పౌరసత్వ (సవరణ) బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దీనిపై అదే రోజు చర్చించి, బిల్లుకు ఆమోదం కూడా తెలపాలని నిర్ణయించారు. ఈ బిల్లు ఆమోదం పొందితే, పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లో మత పీడనకు గురై అక్కడి నుంచి భారత్‌కు వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు భారత పౌరసత్వం లభిస్తుంది. ఆ మూడు దేశాల నుంచి 2014 డిసెంబరు 31వ తేదీలోపు వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులను అక్రమ వలసదారులుగా పరిగణించరు. వారికి భారత పౌరసత్వం కూడా ఇస్తారు. గతంలో 11 ఏళ్లపాటు దేశంలో ఉంటేనే పౌరసత్వం ఇచ్చేవారు. సవరణ చట్టంలో దానిని ఐదేళ్లకు కుదించారు. అక్రమ వలసదారులుగా వారిపై నమోదైన కేసులను కూడా ఎత్తివేయాలని బిల్లులో పేర్కొన్నారు. కేసులు ఉన్నాయన్న కారణంగా పౌరసత్వాన్ని నిరాకరించడానికి లేదని స్పష్టం చేశారు. అయితే, ఈ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల్లో నిరసన వ్యక్తమవుతోంది. బిల్లును వ్యతిరేకిస్తూ వివిధ సంఘాలు, పెద్దఎత్తున ప్రజలు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. సవరణ చట్టం 1985లో కుదిరిన అసోం ఒప్పందాన్ని నిర్వీర్యం చేస్తుందని స్పష్టం చేస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో శక్తిమంతమైన నార్త్ ఈస్ట్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (నెసో) డిసెంబరు 10న 11 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. అక్రమంగా వచ్చిన శరణార్థులను శాశ్వత నివాసులుగా పరిగణిస్తే, ఈ ప్రాంత జనాభా వివరాల్లో మార్పులు వస్తాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే, ఈశాన్య రాష్ట్రాల్లో గిరిజనులకు భరోసా ఇచ్చేలా సవరణ చట్టంలో కేంద్రం నిబంధన విధించింది. ఈ సవరణ చట్టం అసోం, మేఘాలయ, మిజోరాం, త్రిపురల్లోని గిరిజన ప్రాంతాలకు వర్తించదని, అవి ఇప్పటికే రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో ఉన్నాయని తెలిపింది. అలాగే, ఇన్నర్ లైన్ పర్మిట్ (ఐఎల్‌పీ) అమల్లో ఉన్న ప్రాంతాలకు కూడా ఈ చట్టం అమలు కాదని వివరించింది.

### పౌరసత్వం ఇవ్వడం మన విధి: రాం మాధవ్

పొరుగు దేశాల్లో మత పీడనకు గురై శరణార్థులుగా వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని, దేశాన్ని మతపరంగా విభజించాలన్న నిర్ణయానికి వారంతా బాధితులని బీజేపీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ వ్యాఖ్యానించారు. ఈ బిల్లును కొందరు విమర్శిస్తున్నారని, కానీ, 1950లో నెహ్రూ ప్రభుత్వం కూడా ఇటువంటి చట్టాన్నే చేసిందని గుర్తు చేశారు. అణచివేతకు గురైన మైనారిటీలకు భారత్ ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంచుతుందన్నారు

### జిన్నా వైఖరిదే విజయమవుతుంది: శశిథరూర్

పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదిస్తే.. గాంధీ ఆలోచనా సరళి కంటే మహ్మద్ ఆలీ జిన్నా ఆలోచనా సరళి విజయం సాధించినట్లు అవుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ విమర్శించారు. మతం ఆధారంగా పౌరసత్వం ఇస్తే.. భారత దేశం పాకిస్థాన్‌కు హిందుత్వ వెర్షన్ అవుతుందని వ్యాఖ్యానించారు. 'ఒక వర్గాన్ని' వేరు చేయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, వారు కూడా అణచివేతకు గురైనా ఆశ్రయం ఇవ్వడానికి నిరాకరిస్తోందని ఆరోపించారు. ఒకవేళ, ఈ బిల్లును పార్లమెంటు ఆమోదించినా.. రాజ్యాంగ మౌలిక సూత్రాలను అత్యంత దారుణంగా ఉల్లంఘించిన ఈ చట్టాన్ని సుప్రీం కోర్టులోని ఏ ధర్మాసనమూ అంగీకరించదని ధీమా వ్యక్తం చేశారు.

### చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీ కోటా పొడిగింపు బిల్లు నేడు లోక్‌సభలో

చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌ను పొడిగించాలన్న బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో ఇండియన్ వర్గాలకు చట్టసభల్లో 70 ఏళ్ల పాటు రిజర్వేషన్‌ను కల్పించారు. ఇవి 2020 జనవరి 25న ముగియనున్నాయి. ఆంగ్లో ఇండియన్లను మినహాయిస్తూ ఎస్సీ, ఎస్టీలకు మరో పదేళ్ల వరకు రిజర్వేషన్లను పొడిగించాలని నిర్ణయించారు.

## పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తాం


- ఎన్‌కౌంటర్లన్నీ చట్టవ్యతిరేక హత్యలే: రాజా
- ఉరి, ఎన్‌కౌంటర్లు పరిష్కారం కావు: చాడ

హైదరాబాద్, డిసెంబర్8 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్సీ, పౌరసత్వ సవరణ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్టు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. రాజ్యాంగవిరుద్ధంగా బిల్లును పవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. ఆదివారం నాడిక్కడ జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాలతో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయని విమర్శించారు. దిశ హత్యాచారం కేసులో నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం సరికాదని, ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ వ్యతిరేక హత్యలే అని ఆయన ఆరోపించారు. ఎన్‌కౌంటర్లు, ఉరిశిక్షలు సమస్యలకు పరిష్కారం కాదని, సమాజంలో పరివర్తన రావాలని సీపీఐ తెలంగాణ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు.

### ఎన్‌కౌంటర్‌ను సమర్థించినందుకు క్షమించండి: నారాయణ


దిశ హత్యాచారం కేసులో నిందితులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని సమర్థించినందుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ క్షమాపణ చెప్పారు. నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడాన్ని తాను మొదట స్వాగతించానని, అయితే తమ పార్టీ విధానాలకు తన చర్య వ్యతిరేకమని ఆయన తెలిపారు. పార్టీ లోపల, వెలుపల వామపక్షాలు, ఇతర ప్రజాస్వామిక వాదులు తన చర్యను వ్యతిరేకించారని, వారికి క్షమాపణ చెబుతున్నానని ఆయన పేర్కొన్నారు.

### ● అరుణ్ శౌరీకి ప్రధాని మోదీ పరామర్శ




మెదడుకు సంబంధించిన సమస్యతో పుణెలోని రూబీ హాల్ క్లినిక్‌లో చికిత్సపొందుతున్న బీజేపీ సీనియర్ నేత అరుణ్‌శౌరీని ప్రధాని మోదీ ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 15 నిమిషాల పాటు శౌరీతో ముచ్చటించారు. కాగా, ఐజీలు, డీజీపీల మూడు రోజుల సదస్సుకు హాజరయ్యేందుకు ప్రధాని పుణెకు వచ్చారు.

### మళ్లీ రాహులే అధ్యక్షుడిగా రావాలి: భూపేశ్



న్యూఢిల్లీ, డిసెంబరు 8: కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేసినప్పటి నుంచి నిష్కపటంగా మాట్లాడే ఒక నేతను ప్రజలు మిస్ అవుతున్నారని ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాఘెల్ అన్నారు. పార్టీని నడిపించేందుకు ఆయన కచ్చితంగా మళ్లీ ముందుకు రావాలని పేర్కొన్నారు. ఈ నెల 14న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న ర్యాలీలో రాహుల్ తిరిగి పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారన్న వార్తల నేపథ్యంలో బాఘెల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### ఉల్లి ఘాటు.. ప్రభుత్వ వైఫల్యం: సుబ్రమణ్యస్వామి



చెన్నై, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోదీకి సరైన అవగాహన లేదని బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి విమర్శించారు. ఆదివారం ఆయన చెన్నై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. దేశంలో ఉల్లి ధరలు విపరీతంగా పెరగడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. కేంద్రం వద్ద సరైన పణాళికలు లేకపోవడం వల్ల ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. తరచూ చెన్నైలో పర్యటిస్తున్న ఆర్థిక మంత్రి నిర్మలను ఉల్లి ధరల పెంపుపై అందరూ ప్రశ్నించాలన్నారు. ఉల్లి ధరలపై ప్రధాని మోదీకి ఆరు లేఖలు రాసినట్టు తెలిపారు. చిదంబరం ఆర్థికనేరస్థుడని, ఆయన మాటలు పట్టించుకోవల్సిన అవసరం లేదన్నారు.

# స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 9 డిసెంబరు 2019



కోచ్ సోమనాథ్ ఘోష్‌తో స్నేహిత్

# స్నేహిత్ సంచలనం

- టీటీ యూత్ ఫైనల్లో శ్రేయాన్స్‌పై గెలుపు
- 60వ దశకం తర్వాత ఈ టైటిల్ నెగ్గిన తెలుగు ఆటగాడు

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** జాతీయ యూత్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌ను నెగ్గిన తెలుగు క్రీడాకారుడిగా సూరావఝ్జుల ఫిడేల్ రఫిక్ స్నేహిత్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. కొంత కాలంగా రాష్ట్ర స్థాయి టీటీ పోటీల్లో నిలకడగా రాణిస్తున్న స్నేహిత్..తాజాగా జమ్ముకశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో యూత్ సింగిల్స్ టైటిల్ కైవసం చేసుకొని సంచలనం సృష్టించాడు. ఆదివారం జమ్ములోని ఎంఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో స్నేహిత్ 4-0తో శ్రేయాన్స్ గోయల్ (న్యూఢిల్లీ)పై తిరుగులేని విజయం సాధించి చాంపియన్‌గా నిలిచాడు. కెరీర్‌లో అతడికిదే తొలి జాతీయ టైటిల్. ఈ టోర్నీ ప్రారంభం నుంచే దూకుడైన ఆటతో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ టైటిల్ సంగ్రామంలోకి అడుగుపెట్టిన స్నేహిత్..ఫైనల్లోనూ అదే జోష్‌తో విజృంభించాడు. ఈ 19 ఏళ్ల తెలుగు కెరటం ధాటికి శ్రేయాన్స్ కనీస ప్రతిఘటన లేకుండానే నాలుగు గేమ్‌లను చేజార్చుకున్నాడు. పదునైన స్మాష్‌లు, మెరుపు సర్వీస్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసిన స్నేహిత్ అన్ని గేమ్‌లను (11-4, 11-6, 11-5, 11-7) ఏకపక్షంగానే గెలిచాడు. అంతకు ముందు జరిగిన సెమీస్‌లో 7-11, 11-6, 11-5, 11-5, 11-9తో పార్థ్ వీర్‌మణి (న్యూఢిల్లీ)పై నెగ్గి తుదిపోరుకు అర్హత సాధించాడు. కొద్ది నెలల కిందట గోవాలో జరిగిన జాతీయ పోటీల్లో క్వార్టర్స్‌లో ఓడి టైటిల్ కోల్పోయిన స్నేహిత్ ఆ లోటును తాజా విజయంతో భర్తీ చేశాడు. ఇక, టోర్నీ అర్హత పోటీలో నెగ్గి క్వాలిఫయర్‌గా బరిలోకి దిగిన దివ్య చిటేల్ (మహారాష్ట్ర) అనూహ్యంగా జూనియర్స్, బాలికల యూత్ సింగిల్స్ రెండు టైటిళ్లను కైవసం చేసుకొని అదరగొట్టింది. బాలికల యూత్ ఫైనల్లో దివ్య 12-14, 11-8, 19-17, 11-6, 11-6తో సురభి పట్వారిపై నెగ్గి టైటిల్ దక్కించుకుంది. జూనియర్స్ విభాగంలో ఐదు గేమ్‌లపాటు జరిగిన ఫైనల్లో దివ్య 4-1 తేడాతో స్వస్తికా ఘోష్‌పై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది.

### సుదీర్ఘకాలం తర్వాత

60వ దశకంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీటీ దిగ్గజం మీర్ ఖాసీమ్ అలీ జాతీయ యూత్ టీటీ టైటిల్‌ను నెగ్గాడు. హైదరాబాద్‌కు చెందిన ఖాసిమ్ అలీ తర్వాత మళ్లీ ఈ టైటిల్‌ను సొంతం చేసుకున్న తెలుగు క్రీడాకారుడిగా స్నేహిత్ రికార్డు సృష్టించాడు. గతంలో డిఫెన్స్‌లో కొంచెం బలహీనంగా ఉన్న స్నేహిత్.. కోచ్ సోమనాథ్ ఘోష్ శిక్షణలో రాటుదేలి తన టెక్నిక్‌ను మరింత మెరుగుపర్చుకోవడంతో తాజా టోర్నీలో అతడికి ఎదురు లేకుండా పోయింది. సుదీర్ఘ ర్యాలీలు ఆడడంలో దిట్టయిన స్నేహిత్ ఎటాకింగ్ గేమ్, టాలెంట్‌ను చూస్తుంటే భవిష్యత్‌లో భారత టీటీలో కీలక ఆటగాడిగా ఎదుగుతాడనడంలో సందేహం లేదని కోచ్ సోమనాథ్ చెప్పాడు.

## ఒక్క మ్యాచ్‌పై రూ.225 కోట్ల బెట్టింగ్

**ముంబై:** ఐపీఎల్ స్టయిల్‌లో ఆయా రాష్ట్ర క్రికెట్ సంఘాలు నిర్వహిస్తున్న టీ20 లీగ్‌లు అవినీతికి చిరునామా మారుతున్నాయి. ఇదే కారణంతో ఇప్పటికే కర్ణాటక ప్రీమియర్ లీగ్ (కేపీఎల్)ను బీసీసీఐ నిలిపివేసింది. తాజాగా తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్)లోనూ భారీ ఎత్తున బెట్టింగ్ జరిగినట్టు తేలింది. ట్యూటీ పేట్రియాట్స్-మధురై పాంథర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌పై అంతర్జాతీయ గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్ అయిన బెట్‌ఫెయిర్‌లో ఏకంగా రూ.225 కోట్ల బెట్టింగ్ జరిగినట్టు యాంటీ కరప్షన్ యూనిట్ (ఏసీయూ)...బీసీసీఐకి నివేదిక అందించింది. ఇలాంటి వ్యవహారాలను పర్యవేక్షించే రెండు రీసెర్చ్ కంపెనీల నుంచి తమకు ఈ సమాచారం వచ్చినట్టు ఏసీయూ పేర్కొంది. అయితే ఆ తర్వాత ట్యూటీ పేట్రియాట్స్ ఆడిన మ్యాచ్‌లపై బెట్టింగ్‌ను ఆ సైట్ నిషేదించినట్టు తెలిపింది. మరోవైపు బుకీలతో సంబంధాలున్నందుకు ఈ లీగ్‌లోని రెండు ఫ్రాంచైజీలను సస్పెండ్ చేసినట్టు బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ గత వారం పేర్కొన్నాడు. అలాగే ట్యూటీ పేట్రియాట్స్‌కు చెందిన ఇద్దరు సహ యజమానులను ఇదివరకే తొలగించారు.




## జూనియర్ హాకీ టైటిల్ మనదే!

**కాన్‌బెర్రా:** ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత జట్టు మూడు దేశాల జూనియర్ మహిళల హాకీ టైటిల్ కైవసం చేసుకుంది. హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న భారత్ తమ చివరి మ్యాచ్‌లో మాత్రం 1-2 గోల్స్‌తో ఆతిథ్య ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. అయితే నాలుగు మ్యాచ్‌ల్లో 7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టీమిండియా ట్రోఫీ దక్కించుకుంది. ఆసీస్‌కూ ఏడు పాయింట్లే ఉన్నా, భారత్‌కంటే ఒక గోల్ తక్కువగా ఉండడంతో రెండోస్థానానికి పరిమితమైంది. న్యూజిలాండ్ (3 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచింది. కాగా, తొలి మూడు మ్యాచ్‌ల్లో అదరగొట్టిన టీమిండియా ఆసీస్‌తో పోరులో తేలిపోయింది. అబిగైల్ విల్సన్ (15, 56వ నిమిషం) రెండు గోల్స్‌తో ఆసీస్ జట్టును గెలిపించింది. భారత్ తరఫున గగన్‌దీప్ కౌర్ (53వ నిమిషం) ఏకైక గోల్ సాధించింది. టీమిండియా డిఫెన్స్ బలహీనంగా ఉండడంతో తొలి క్వార్టర్‌లో ఆసీస్ పలు మార్లు గోల్ పోస్ట్‌పై దాడులు చేసింది. 15వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను అబిగైల్ గోల్‌గా మలచడంతో ఆసీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. అయితే 22, 26వ నిమిషాల్లో భారత్‌కు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. రెండు, మూడు క్వార్టర్స్‌లో ఇరు జట్లు ఒక్క గోల్ కూడా నమోదు చేయలేకపోయాయి. ఇక చివరి క్వార్టర్‌లో గగన్‌దీప్ కౌర్ గోల్‌తో భారత్ 1-1తో స్కోరు సమం చేసింది. కానీ, ఆఖర్లో అబిగైల్ గోల్‌తో ఆసీస్ 2-1తో మ్యాచ్‌ను ముగించింది.




### ధోనీ ఫ్యాన్స్ హంగామా

వన్డే ప్రపంచకప్ తర్వాత భారత జట్టుకు దూరంగా ఉంటున్నప్పటికీ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ అభిమానులు మాత్రం అతడి పేరును స్మరిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా దక్షిణాదిలో 'తలా'కు అభిమాన గణం కాస్త ఎక్కువే. తిరువనంతపురంలో తాజాగా జరిగిన రెండో టీ20లో ఇది స్పష్టంగా కనిపించింది. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియానికి ఎదురుగా కేరళ ఫ్యాన్స్ ఏకంగా అతడి 40 అడుగుల పోస్టర్‌ను ఉంచారు. ఇక ధోనీకిష్టమైన ఏడో నెంబర్ బ్లూ జెర్సీలను ధరిస్తూ హంగామా చేశారు. మ్యాచ్ చూసేందుకు 'ఆల్ కేరళ ధోనీ అభిమానుల సంఘం' పేరిట బ్యానర్‌తో పాటు డప్పు వాయిద్యాలతో పెద్ద ఎత్తున ర్యాలీగా బయల్దేరి స్టేడియానికి తరలివచ్చారు.

### సంజూ.. సంజూ

అద్భుత నైపుణ్యం కలిగినప్పటికీ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న సంజూ శాంసన్‌కు కేరళీయులు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి క్రికెటర్లు తమ టీమ్ బస్‌లోకి వెళుతుండగా శాంసన్ చూడగానే ఒక్కసారిగా చప్పట్లతో హోరెత్తించారు. అలాగే మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సందర్భంగా వాటర్ బాటిళ్లను తీసుకొస్తుండగా స్టేడియమంతా సంజూ.. సంజూ నామస్మరణంతో మారుమోగింది. దీంతో అతడి ఫ్యాన్స్‌ను చూసి అక్కడే ఉన్న కోచ్ రవిశాస్త్రి నవ్వుతూ అతడి భుజం తట్టాడు.

# బ్రేక్ వేశారు..

## రెండో టీ20లో విండీస్ ఘన విజయం

### సిమ్మన్స్ అర్ధసెంచరీ ● రాణించిన శివమ్ దూబే

**భారత్ చేతిలో వరుసగా ఏడు మ్యాచ్‌ల ఓటమికి తెర దించుతూ.. మూడు టీ20ల సిరీస్‌ను విండీస్ వీరులు రసవత్తరంగా మార్చేశారు. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో జూలు విదిల్చారు. సిమ్మన్స్, లూయిస్ మెరుపు ఆరంభం.. హెట్‌మయెర్, పూరన్ ఫినిషింగ్ టచ్‌తో భారత బౌలర్లు బేజారెత్తారు. అంతకు ముందు విరాట్, రోహిత్, రాహుల్ విఫలమైన చోట డాషింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే శివాలెత్తిపోయాడు. సూపర్ షాట్లతో విరుచుకుపడి కెరీర్‌లో తొలి అర్ధసెంచరీ సాధించాడు. అయితే బౌలర్ల వైఫల్యం నిరాశ కలిగించింది.**



సిమ్మన్స్ (45 బంతుల్లో 67 నాటౌట్)

**తిరువనంతపురం:** చాలా రోజుల తర్వాత వెస్టిండీస్ స్థాయికి తగ్గ ఆటతీరుతో ఆల్‌రౌండ్ షోను కనబర్చింది. బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఓమాదిరి స్కోరుకే పరిమితమైన భారత్‌పై ఆతర్వాత తమ పవర్ హిట్టింగ్‌తో విండీస్ బ్యాట్స్‌మెన్ ఓ ఆటాడుకున్నారు. ఓపెనర్ సిమ్మన్స్ (45 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 67 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో కీలకపాత్ర పోషించాడు. ఫలితంగా రెండో టీ20లో పర్యాటక జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచి 1-1తో సిరీస్ సమం చేసింది. నిర్ణాయక మ్యాచ్ 11న ముంబైలో జరుగుతుంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముం దుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 170 పరుగులు చేసింది. శివమ్ దూబే (30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 54) అర్ధసెంచరీ సాధించగా రిషభ్ పంత్ (33 నాటౌట్) రాణించాడు. ఆతర్వాత ఛేదనలో విండీస్ 18.3 ఓవర్లలో 2 వికెట్లకు 173 పరుగులు సాధించింది. లూయిస్ 40, పూరన్ 38 (నాటౌట్) రాణించారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా సిమ్మన్స్ నిలిచాడు.

**అలవోకగా...:** ఛేదన కోసం బరిలోకి దిగిన విండీస్‌కు ఈసారి అదిరే ఆరంభం దక్కింది. ఓపెనర్లు లూయిస్, సిమ్మన్స్ ఎలాంటి ఇబ్బంది లేకుండా భారత బౌలర్లను ఎదుర్కొన్నారు. ఇక హెట్‌మయెర్, పూరన్ ధాటికి చివర్లో బౌలర్లు ధారాళంగా పరుగులివ్వడంతో భారత్ ఏ దశలోనూ పోటీనివ్వలేకపోయింది. దీనికి తోడు ఐదో ఓవర్‌లోనే ఓపెనర్లిద్దరి క్యాచ్‌లను వాషింగ్టన్ సుందర్, పంత్ వదిలేశారు. ఈ అవకాశాన్ని వదలకుండా మరుసటి ఓవర్‌లో లూయిస్ రెండు భారీ సిక్సర్లతో విరుచుకుపడి 15 రన్స్ రాబట్టాడు. ఆతర్వాత సిమ్మన్స్ కూడా బ్యాట్ ఝుళిపిస్తూ చాహల్‌ను 4,6తో దెబ్బతీశాడు. అయితే పదో ఓవర్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన లూయిస్ పంత్ చేతిలో స్టంపయ్యాడు. దీంతో తొలి వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ ఏడాది ఆడిన 11 టీ20ల్లో విండీస్ పవర్‌ప్లేలో వికెట్ కోల్పోకపోవడం ఇదే తొలిసారి కాగా మొదటి వికెట్‌కు కూడా ఇదే అత్యధిక భాగస్వామ్యం. అయితే సిమ్మన్స్‌కు జత కలిసిన హెట్‌మయెర్ (23) భారీ సిక్సర్లతో ఆందోళన పెంచాడు. కానీ బౌండరీ లైన్ దగ్గర బ్యాలెన్స్‌ను అదుపు చేసుకుంటూ కోహ్లీ అద్భుత క్యాచ్‌తో అతడికి షాక్ ఇచ్చాడు. ఇక డెత్ ఓవర్లలో భారత బౌలర్లపై రెచ్చిపోతూ సిమ్మన్స్, నికోలస్ పూరన్ బౌండరీల వరద పారించడంతో మరో 1.3 ఓవర్లుండగానే మ్యాచ్ ముగిసింది.

**శివాలెత్తిన శివమ్:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ స్లో పిచ్‌పై పరుగులు సాధించేందుకు తెగ కష్టపడింది. అయితే డాషింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే బ్యాట్‌ను ఝుళిపించడంతో పాటు రిషభ్ పంత్ నిలకడ జట్టుకు మంచి స్కోరునే అందించింది. ఓపెనర్లు రోహిత్ (15), రాహుల్ (11) ఇద్దరూ విఫలమయ్యారు. అయితేనేం.. ప్రొఫెషనల్ క్రికెట్ కెరీర్‌లో తొలిసారి మూడో స్థానంలో వచ్చిన దూబే తన పవర్ హిట్టింగ్‌ను చూపించాడు. మిగతా బ్యాట్స్‌మెన్ ఇబ్బందిపడిన చోట అలవోకగా షాట్లు ఆడేశాడు. తొలి 14 బంతుల్లో 12 పరుగులే చేసిన అతడు 8వ ఓవర్ నుంచి గేరు మార్చాడు. హోల్డర్ వేసిన ఈ ఓవర్ తొలి బంతిని పుల్ షాట్ ద్వారా డీప్ స్క్వేర్ లెగ్‌లో సిక్సర్ బాదిన శివమ్ ఆ మరుసటి బంతిని లాంగాన్, మిడ్ వికెట్ మధ్య నుంచి ఫోర్‌తో వావ్ అనిపించాడు. ఇక తొమ్మిదో ఓవర్‌లో సూపర్ టైమింగ్‌ను కనబరుస్తూ పొలార్డ్‌కు చుక్కలు చూపించాడు. ఈ ఓవర్‌లో తను హ్యాట్రిక్ సిక్సర్లతో మొత్తం 26 పరుగులు రాబట్టాడు. దీంతో 27 బంతుల్లోనే దూబే తొలి అర్ధసెంచరీ పూర్తయింది. కానీ 11వ ఓవర్‌లో స్పిన్నర్ వాల్ష్ గూగ్లీని సరిగ్గా అర్థం చేసుకోలేకపోయిన దూబే భారీ షాట్‌కు వెళ్లి కవర్‌లో క్యాచ్ ఇచ్చాడు. ఆతర్వాత కొద్దిసేపటికే కోహ్లీ (19)ని పేసర్ విలియమ్స్ అవుట్ చేయడంతో స్టేడియం ఒక్కసారిగా మూగబోయింది. ఈసారి నోట్‌బుక్ సంబరాలు జరపకుండా తన వేలితో నోటిని మూస్తూ కనిపించాడు. ఇకతా నెదుర్కొన్న రెండో బంతినే సిక్సర్‌గా మలిచిన పంత్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే శ్రేయాస్ (10), జడేజా (9)ల నుంచి సహకారం అందలేదు. చివరి ఐదు ఓవర్లలో భారత్ 38 రన్స్ మాత్రమే చేసి 3 వికెట్లు కోల్పోయింది.



శివమ్ దూబే (54)

**1**

**అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు (2,563) చేసిన క్రికెటర్‌గా విరాట్ కోహ్లీ. ఒక్క పరుగు తేడాతో రోహిత్‌ను అధిగమించాడు.**

### స్కోరుబోర్డు

**భారత్:** రోహిత్ (బి) హోల్డర్ 15; రాహుల్ (సి) హెట్‌మయెర్ (బి) పియెర్ 11; శివమ్ దూబే (సి) హెట్‌మయెర్ (బి) వాల్ష్ 54; కోహ్లీ (సి) సిమ్మన్స్ (బి) విలియమ్స్ 19; పంత్ (నాటౌట్) 33; శ్రేయాస్ (సి) కింగ్ (బి) వాల్ష్ 10; జడేజా (బి) విలియమ్స్ 9; సుందర్ (సి అండ్ బి) కాట్రెల్ 0; చాహర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 170/7. వికెట్ల పతనం:** 1-24, 2-56, 3-97, 4-120, 5-144, 6-164, 7-167. **బౌలింగ్:** కాట్రెల్ 4-0-27-1; పియెర్ 2-0-11-1; హోల్డర్ 4-0-42-1; విలియమ్స్ 4-0-30-2; పొలార్డ్ 2-0-29-0; హేడెన్ వాల్ష్ 4-0-28-2.

**విండీస్:** సిమ్మన్స్ (నాటౌట్) 67; లూయిస్ (స్టంప్) పంత్ (బి) సుందర్ 40; హెట్‌మయెర్ (సి) కోహ్లీ (బి) జడేజా 23; పూరన్ (నాటౌట్) 38; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 18.3 ఓవర్లలో 173/2. వికెట్ల పతనం:** 1-73, 2-112. **బౌలింగ్:** దీపక్ చాహర్ 3.3-0-35-0; భువనేశ్వర్ 4-0-36-0; సుందర్ 4-0-26-1; చాహల్ 3-0-36-0; దూబే 2-0-18-0; జడేజా 2-0-22-1.



## ఘనంగా సాయి ప్రణీత్ వివాహం

**కాకినాడ (స్పోర్ట్స్):** బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత భమిడిపాటి సాయి ప్రణీత్ ఓ ఇంటివాడయ్యాడు. కాకినాడకు చెందిన జయంతి శ్రీనివాస్-సత్యశ్రీ దంపతుల కుమార్తె శ్వేతతో సాయి వివాహం ఆదివారమిక్కడ ఘనంగా జరిగింది. ఈ పెళ్లికి డబుల్స్ ఆటగాడు సాత్విక్ సాయిరాజ్ సహా పలువురు హాజరయ్యారు. వివాహ రిసెప్షన్ సోమవారం హైదరాబాద్‌లో జరుగనుంది.


# ఆశావహులకు మ్యాచ్ టైమ్

- నేటి నుంచే రంజీ ట్రోఫీ
- బరిలో ఆంధ్ర, హైదరాబాద్ జట్లు



**న్యూఢిల్లీ:** దేశవాళీ క్రికెట్ పండుగ రంజీ ట్రోఫీ సందడి చేయనుంది. మూడు నెలలపాటు జరిగే 2019-20 రంజీ సీజన్ సోమవారం ఆరంభం కానుంది. ఈ మెగా ఫస్ట్‌క్లాస్ టోర్నీలో 38 జట్లు, మొత్తం 169 మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. డబుల్ డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్న విదర్భ.. ముచ్చటగా మూడో టైటిల్‌పై గురిపెట్టింది. అయితే, ముంబై, కర్ణాటక, తమిళనాడు లాంటి పెద్ద జట్లు ఎలాగైనా ట్రోఫీని దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్నాయి. ఫిబ్రవరిలో న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్ నేపథ్యంలో పుజార (సౌరాష్ట్ర), అజింక్యా రహానె (ముంబై), మయాంక్ అగర్వాల్ (కర్ణాటక), అశ్విన్ (తమిళనాడు) రంజీలను ప్రాక్టీస్‌గా ఉపయోగించుకోవాలంటున్నారు.

**మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా...:** గత రంజీ సీజన్‌లో ఏమాత్రం ఆకట్టుకోలేకపోయిన ఆంధ్ర ఈసారి మెరుగైన ప్రదర్శన కనబరచాలన్న పట్టుదలతో ఉంది. సోమవారం జరిగే తమ తొలి మ్యాచ్‌లో డబుల్ డిఫెండింగ్ చాంప్ విదర్భతో ఆంధ్ర తలపడనుంది. విజయవాడలోని మూలపాడు స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఆంధ్ర జట్టుకు టీమిండియా టెస్ట్ ఆటగాడు హనుమ విహారి సారథ్యం వహించనుండగా.. వైస్ కెప్టెన్, కీపర్ శ్రీకర్ భరత్‌పై అందరి దృష్టి నెలకొనే అవకాశం ఉంది. టెస్ట్‌ల్లో వృద్ధిమాన్ సాహాకు బ్యాకప్ కీపర్‌గా భరత్ పేరు తరచూ వినిపిస్తోంది. ఇటీవల టెస్ట్ టీమ్ నుంచి రిషభ్ పంత్‌ను రిలీజ్ చేసినప్పుడు భరత్‌ను బీసీసీఐ బ్యాకప్ కీపర్‌గా ఎంపిక చేసింది. విహారితోపాటు రికీ భుయ్, సుమంత్ బ్యాటింగ్ భారాన్ని మోయనున్నారు. అయ్యప్ప, గిరినాథ్ రెడ్డి ప్రధాన పేసర్లు. 2018-19 సీజన్‌లో ఆంధ్ర క్వార్టర్స్‌కు కూడా చేరలేక పోయింది.


ఆంధ్ర కెప్టెన్ విహారి


పద్మశ్రీ దీప్తి నందిని

## పద్మశ్రీకి పసిడి, దీప్తికి రజతం

**జాతీయ ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న జాతీయ అథ్లెటిక్ పోటీల్లో తెలంగాణ స్ప్రింటర్లు మూడు పతకాలు కొల్లగొట్టారు. పంజాబ్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో బాలికల 400 మీ. హర్డిల్స్‌లో సీహెచ్.పద్మశ్రీ స్వర్ణ పతకం సాధించి సత్తా చాటింది. రేసును 1 నిమిషం ఐదు సెకన్లలో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. బాలికల 200 మీ. స్ప్రింట్‌లో జె.దీప్తి (24.88 సెకన్లు) రజత పతకం దక్కించుకుంది. బాలికల 100 మీ. హర్డిల్స్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన నందిని (14.87 సెకన్లు) కాంస్య పతకం నెగ్గింది.

## హైదరాబాద్‌కు మరో ఓటమి

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఐఎస్ఎల్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీకి మరో ఓటమి ఎదురైంది. గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 0-1తో ఎఫ్‌సీ గోవా చేతిలో పరాజయం పాలైంది. 68వ నిమిషంలో మన్వీర్ గోల్ చేసి గోవాను ఆధిక్యంలో నిలబెట్టాడు. ఆతిథ్య హైదరాబాద్ ఎంత ప్రయత్నించినా ప్రత్యర్థి డిఫెన్స్‌ను బద్దలు కొట్టలేక పోయింది.



## ఎనిమిదో రోజు 38 పతకాలు

**ఖాట్మండు:** ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ పసిడి పట్టు పట్టింది. దీంతో దక్షిణాసియా క్రీడల రెజ్లింగ్‌లో ఒక్క రోజే భారత్ 4 స్వర్ణాలతో అదరగొట్టింది. రెజ్లర్లతోపాటు స్విమ్మర్లు 7 స్వర్ణాలు అందించడంతో ఆదివారం భారత్ 38 (22 స్వర్ణ, 10 రజత, 6 కాంస్య) పతకాలు సాధించింది. మొత్తం 252 (132 పసిడి, 79 రజత, 41 కాంస్య) మెడల్స్‌తో పతకాల పట్టికలో అగ్రస్థానంలో దూసుకెళ్తోంది. 62 కిలోల ఫైనల్లో మిహిర (శ్రీలంక)ను సాక్షి మట్టికరిపించింది. రవీందర్ (61 కి), పవన్ కుమార్ (86 కి), అన్షు (59 కి) కూడా స్వర్ణాలు నెగ్గారు. బాక్సింగ్‌లో వికాస్ క్రిషన్ (69 కి), పింకీ రాణి (51 కి) సహా ఏడుగురు బాక్సర్లు ఫైనల్ చేరారు.

# ఆంగ్లంతోనే మెరిట్ వస్తుందా!?



మైత్రీ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గంగాధర్

- తెలుగు, ఇంగ్లీషులు సమానమే
- మైత్రీ సదస్సులో మేధావులు

విజయవాడ, డిసెంబరు 8: ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్నే మెరిట్‌గా పరిగణించడం దురదృష్టకర దుష్పరిణామమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బీసీ జనసభ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యావిధానం-భాషా మాధ్యమంపై మైత్రీ సదస్సు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియాన్ని ఆహ్వానిస్తూనే దానికి సమాంతరంగా తెలుగు మీడియాన్ని కొనసాగించాలని, ప్రైవేట్, పాఠశాలలు, కాలేజీల్లో కూడా తెలుగు మీడియంను పెట్టాలని, నైపుణ్యం కలిగిన బోధన సిబ్బందిని నియమించాలని తీర్మానించారు. బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ, ప్రాథమిక విద్యలో ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టడంలో కొందరి అధికారుల అత్యుత్సాహం ఉందన్నారు. మాతృభాషను విస్మరిస్తే తీవ్ర అనర్థాలు వస్తాయన్నారు. టీడీపీ నాలెడ్జ్ సెంటర్ కన్వీనర్ మల్యాద్రి మాట్లాడుతూ, గతంలో టీడీపీ ప్రభుత్వం పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని తెచ్చే ప్రయత్నాన్ని అప్పటి ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ఇంగ్లీషు మాధ్యమానికి టీడీపీ వ్యతిరేకం కాదని, అయితే, మాతృభాషను విస్మరించకూడదని సూచించారు. ఆంధ్ర అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ, ఇంగ్లీషు మీడియం పేరుతో తెలుగును నిరాదరణకు గురిచేయడం తగదన్నారు.

## తెలుగు పరిరక్షణకు రాజకీయ పార్టీ

- ఏపీలో 11న, తెలంగాణలో 14న ఆవిష్కరణ
- వ్యవస్థాపకుడు నాబార్డు రిటైర్డ్ డీజీఎం సుబ్బారావు

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష మనుగడ కోల్పోతున్న తరుణంలో ఆ భాష పరిరక్షణే లక్ష్యంగా 'ప్రపంచ తెలుగు భాషా పరిరక్షణ పార్టీ' ఏర్పడింది. కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి పార్టీకి ఇటీవల అనుమతులు కూడా వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నాబార్డు రిటైర్డ్ డీజీఎం కోటిపల్లి సుబ్బారావు ఈ పార్టీని ఏర్పాటు చేశారు. పార్టీ వివరాలు, ఆశయాలను ఆదివారం బెంగళూరులో ఆయన వివరించారు. తెలుగు ప్రపంచ భాషగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. పదో తరగతి వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బోధన తెలుగులోనే సాగాలని, తెలుగులోనే పూర్తిగా పాలనా వ్యవహారాలు సాగాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో పార్టీ తరఫున పాదయాత్ర చేస్తానని తెలిపారు. ఏపీలో ఈనెల 11న చిత్తూరు జిల్లా కుప్పంలో, తెలంగాణలో 14న గద్వాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం జోగుళాంబ ఆలయం వద్ద పార్టీని ఆవిష్కరించనున్నామని చెప్పారు.



పోటు చిమ్నీ వద్ద ఎగసిపడుతున్న మంటలు

# శ్రీవారి బూందీపోటులో అగ్నిప్రమాదం

- నెయ్యి డబ్బా కిందపడి ఎగసిన మంటలు
- ఎలాంటి నష్టమూ జరగలేదు: డిప్యూటీ ఈవో

తిరుమల, డిసెంబరు 8: తిరుమల శ్రీవారి ఆలయం వెనుక ఉన్న లడ్డూ బూందీ పోటులో మరోసారి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో 19వ నంబర్ పొయ్యి వద్ద వంశీకృష్ణ అనే కార్మికుడు బాండీలో నెయ్యి నింపుతుండగా డబ్బా జారి కిందపడింది. దీంతో స్టవ్ నుంచి మంటలు ఎగసిపడ్డాయి. బాండీ చుట్టూ అంటుకున్న వ్యర్థాలు, జిడ్డుకు కూడా వ్యాపించిన మంటలు... బ్లోయర్ నుంచి పైకి ఎగసిపడ్డాయి. సిబ్బంది సకాలంలో స్పందించడంతో భారీప్రమాదం తప్పింది. రెండు ఫైర్‌ఇంజన్ల సహాయంతో మంటలను అదుపుచేశారు. పోటు పైభాగం నుంచి వస్తున్న మంటలు, దట్టంగా అలుముకున్న పొగను చూసి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. కాగా, బూందీపోటులో జరిగింది స్వల్ప ప్రమాదమేనని, ఆస్తినష్టం జరగలేదని ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ తెలిపారు. అరగంటలోనే పోటును శుభ్రపరిచి బూందీ తయారీని యథావిధిగా కొనసాగించామన్నారు. ప్రస్తుతం టీటీడీ రోజుకు 3లక్షలకు పైగా లడ్డూలు తయారుచేస్తోంది. ఇక్కడ 48సాధారణ పొయ్యిలపై భారీ బాండీల్లో నెయ్యిని వేడిచేసి బూందీ సిద్ధం చేస్తుంటారు. ఈ క్రమంలో స్టౌల నుంచి వచ్చే అధిక వేడి కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

# బో'ధనం' ఏదీ!



- ఇంటర్ ట్యూషన్ ఫీజుపై కిరికిరి
- 'అమ్మఒడి' 15 వేలు ఇస్తామంటున్న సర్కారు
- నిర్వహణ పేరుతో తల్లికి ఇస్తే కాలేజీల పరిస్థితేంటి?
- రీయింబర్స్ చేస్తారో లేదో తెలియక సతమతం
- జీవోలతో సందిగ్ధత.. 6 నెలలుగా రూపాయి లేదు
- ఆందోళనలో జూనియర్ కాలేజీల యాజమాన్యాలు

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై గందరగోళ పరిస్థితి నెలకొంది. 'అమ్మ ఒడి' పథకం కింద పిల్లలను బడికి పంపించే ప్రతి తల్లికీ ఏటా రూ.15 వేలు ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం.. రకరకాల ఆంక్షలతో జూనియర్ కళాశాలలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాత్రం స్పష్టత ఇవ్వకుండా దోబూచులాడుతోంది. నిర్వహణ కింద తల్లికి రూ.15 వేలు ఇస్తే... మరి పిల్లలకు చదువు చెప్పే కాలేజీల పరిస్థితి ఏమిటని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 2019-20 విద్యా సంవత్సరం మొదలై ఆరు నెలలు కావస్తున్నా జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల బోధనకు ఇప్పటి వరకూ ఒక్క రూపాయి ఫీజు కూడా యాజమాన్యాలకు ప్రభుత్వం రీయింబర్స్ చేయలేదు. అసలు ట్యూషన్ ఫీజును రీయింబర్స్ చేస్తారో, చేయరో కూడా తెలియని గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

### కోర్సులు సమానమే అయినా..

ప్రస్తుతం ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్ రెండు రూపాల్లో ఉంది. ఒకటి... మెయింటెనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజు(ఎంటీఎఫ్), రెండు... రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు(ఆర్‌టీఎఫ్)గా గత ప్రభుత్వం అమలు పరుస్తోంది. ఎంటీఎఫ్‌ను విద్యార్థుల ఖాతాలో ప్రభుత్వం జమచేస్తుంది. ఆర్‌టీఎఫ్‌ను కాలేజీల ఖాతాలో జమచేస్తారు. గత విద్యా సంవత్సరం వరకూ ఈ పద్ధతి అమల్లో ఉంది. ఇంటర్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్ లేదు. కానీ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్ పేరిట ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు ఎంటీఎఫ్ కింద ఏటా రూ.6 వేలు, బీసీ విద్యార్థులకు రూ.5 వేలు వాళ్ల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఆర్‌టీఎఫ్ కింద తొలి సంవత్సర విద్యార్థులకు రూ.2850, రెండో సంవత్సర విద్యార్థులకు రూ.3150 కాలేజీల ఖాతాల్లో వేస్తున్నారు. కానీ జగన్ ప్రభుత్వం రాగానే 'అమ్మ ఒడి' పథకాన్ని ప్రవేశపెట్టింది. తొలుత ఒకటి నుంచి పదో తరగతి వరకూ ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పి, తర్వాత దాన్ని రెండేళ్ల ఇంటర్మీడియట్ వరకూ విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. దీని అమలుకు సంబంధించిన విధివిధానాలతో హడావిడిగా జీవోలు జారీచేసింది. ఈ పథకం అమలు చేస్తున్నందున ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్ వర్తించని విధంగా మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా ఒక రకమైన అయోమయ పరిస్థితిని సృష్టించింది. అమ్మ ఒడి పథకం కింద ఒక విద్యార్థికి సంవత్సరానికి రూ.15 వేలు సరిపోయే పరిస్థితి ఉందా? పదో తరగతి తర్వాతి కోర్సులైన ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు చదివే విద్యార్థులతో సమానంగా ఇచ్చే పరిస్థితి లేకపోవడం సరికాదని జూనియర్ కాలేజీల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. జగన్ ప్రభుత్వం గత ఆరు నెలల నుంచి రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోగా, కొత్తగా అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన అనే పేర్లతో హడావిడిగా జీవోలు ఇచ్చి కాలయాపన చేస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటర్‌తో సమానమైన కోర్సులైన ఐటీఐ విద్యార్థులకు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.15,700, మెయింటెనెన్స్ కింద రూ.10 వేలు... అంటే మొత్తం రూ.25,700 ఇస్తున్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.24 వేలు, మెయింటెనెన్స్ కింద రూ.15 వేలు... అంటే మొత్తం రూ.39వేలు ఇస్తున్నారు. కానీ ఎక్కువ మంది చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు మాత్రం 'అమ్మఒడి' కింద రూ.15 వేలతో సరిపెట్టి భారం తగ్గించుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న అభిప్రాయాలున్నాయి. కళాశాల ఎటాచ్డ్ హాస్టళ్లకి ఇవ్వాల్సిన భోజన ఫీజులను కూడా తల్లి ఖాతాకు తరలించడం ఎంతవరకూ సబబని యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. గత 25 ఏళ్లుగా విద్యార్థులకు సంబంధించిన భోజన రుసుములను కళాశాల ప్రిన్సిపాల్ ఖాతాలో వేస్తున్నారని, కానీ ఈ ప్రభుత్వం రుసుమును చెల్లించడం లేదన్నారు.

## బదిలీలపై తాత్సారం తగదు

- మాధ్యమం ముసుగులో ఓటురాజకీయం
- 11న సత్యాగ్రహానికి మద్దతు: ఏపీటీఎఫ్

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల్లో బదిలీలు నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి స్వయంగా చెప్పి... ఇప్పుడు తాత్సారం చేయడం తగదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహణ సమితి సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మాధ్యమం ముసుగులో ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. దీనిని వ్యతిరేకిస్తూ ఈ నెల 11న జరిగే సత్యాగ్రహానికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఏపీజేఏసీ ఆధ్వర్యంలో 10వ తేదీన జరగబోయే జిల్లా స్థాయి ధర్నాల్లో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రెండు దశల ఆందోళనా కార్యక్రమాలు జరిగినా సీపీఎస్ రద్దు చేయకపోవడం, మూడు విడతల కరువుభత్యంపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం, కనీసం పిలిచి మాట్లాడకపోవడంపై సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సదాశివరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి హృదయరాజు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పీఎస్‌ఎల్వీ-సీ48 రిహార్సల్స్ సక్సెస్

- నేడు షార్‌లో ఎంఆర్ఆర్, ల్యాబ్ సమావేశం
- 10న కౌంట్‌డౌన్.. 11న మధ్యాహ్నం ప్రయోగం

శ్రీహరికోట (సూళ్లూరుపేట), డిసెంబరు 8: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తన 50వ పీఎస్‌ఎల్వీ ప్రయోగం కోసం ఆదివారం నిర్వహించిన రిహార్సల్స్ విజయవంతమయ్యాయి. షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి బుధవారం మధ్యాహ్నం 3.25 గంటలకు పీఎస్‌ఎల్వీ-సీ48 రాకెట్‌ను ఇస్రో ప్రయోగించనుంది. ప్రయోగ సన్నాహాల్లో భాగంగా దీనిక రిహార్సల్స్‌ను శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. సోమవారం షార్‌లో రాకెట్ సన్నద్ధ సమావేశం (ఎంఆర్ఆర్) నిర్వహించి.. అనంతరం ల్యాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశమై ప్రయోగానికి అనుమతి ఇవ్వనున్నారు. మంగళవారం ఈ ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. కౌంట్‌డౌన్ పూర్తయిన వెంటనే బుధవారం మధ్యాహ్నం 3.25 గంటలకు స్వదేశీ రీశాట్-2బీఆర్1తో పాటు, 9 విదేశీ ఉపగ్రహాలతో ఈ రాకెట్ నింగిలోకి దూసుకుపోనుంది. ఇటలీ, ఇజ్రాయెల్, జపాన్‌కు చెందిన ఒక్కో, అమెరికాకు చెందిన ఆరు ఉపగ్రహాలను ఈ రాకెట్ వివిధ కక్ష్యల్లో వదిలిపెట్టనుంది.

## షార్‌కు ఇజ్రాయెల్ విద్యార్థులు

జెరూసలేం, డిసెంబరు 8: పీఎస్‌ఎల్వీ-సీ48 ప్రయోగం కోసం ఇజ్రాయెల్‌కు చెందిన ముగ్గురు పాఠశాల విద్యార్థులు షార్‌కు చేరుకోనున్నారు. ఈనెల 11న జరిగే ప్రయోగంలో ఈ ముగ్గురు విద్యార్థులు రూపొందించిన 'డచ్‌ఫాట్-3' ఉపగ్రహాన్ని కూడా నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌లోని హనెగెవ్ హైస్కూల్ విద్యార్థులు అలోన్ అబ్రమోవిచ్, మితావ్ అసులిన్, ష్మాయెల్ అవీవ్ లెవీ సోమవారం షార్‌కు విచ్చేయనున్నారు. ఇజ్రాయెల్ విద్యార్థులు తయారు చేసిన ఉపగ్రహ సిరీస్‌లో డచ్‌ఫాట్-3 మూడోది. హెర్జ్లియా సైన్స్ సెంటర్ సహకారంతో ఈ ముగ్గురు విద్యార్థులే దీన్ని రూపొందించారు. 2.3 కిలోల బరువు మాత్రమే ఉండే ఈ చిన్న ఉపగ్రహం ఇజ్రాయెల్‌లో చిన్నారుల కదలికను గుర్తించనుంది.

## మరో నెల సెలవుపై ఎల్వీ!

- దరఖాస్తు చేసిన మాజీ సీఎస్

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం మరో నెలరోజుల పాటు సెలవు తీసుకోనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన్ను గత నెల 4వ తేదీన హఠాత్తుగా బాపట్లలోని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరక్టర్ జనరల్‌గా బదిలీ చేశారు. అయితే ఆయన అప్పటి నుంచి సెలవులో ఉన్నారు. తొలుత నెలరోజులు సెలవు పెట్టారు. సెలవు ఇటీవలే ముగిసినా ఆయన బాధ్యతలు చేపట్టలేదు. మరో నెలరోజుల పాటు సెలవుకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా.. ఆయన తన సుదీర్ఘ ఐఏఎస్ జీవితానికి సంబంధించి ఒక పుస్తకం రాయబోతున్నారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. అయితే ప్రస్తుతానికి అలాంటి ఆలోచనేదీ ఆయనకు లేదని ఎల్వీ సన్నిహితులు చెబుతున్నారు.






Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.